నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 4-10-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 53 పేజీలు:6 వెల: రూ.1/-

పోలీసులు ఆపారని బైక్‌ను తగులబెట్టిన వ్యక్తి

హైదరాబాద్, అక్టోబర్ 3: హైదరాబాద్‌లోని మైత్రివనం వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడు హంగామా సృష్టించాడు. రాంగ్ రూట్‌లో వచ్చిన ఆ వాహనదారుడిని ట్రాఫిక్ పోలీసులు ఆపారు. పోలీసులు ఆపారని తన బైక్‌ను తానే తగులబెట్టాడు. బైక్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తిని ఎల్లారెడ్డిగూడకు చెందిన అశోక్‌గా పోలీసులు గుర్తించారు. దీంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

5వ తేదీన టీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ మీటింగ్

హైదరాబాద్, అక్టోబర్ 3: తెలంగాణ భవన్ లో దసరా నాడు (అక్టోబర్ 05) ఉదయం 11 గంటలకు తలపెట్టిన టీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ మీటింగ్ యధావిధిగా జరగుతుందని పార్టీ అధినేత సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. మునుగోడు ఉప ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో దాని ప్రభావం, దసరా నాటి టీఆర్ఎస్ సర్వసభ్య సమావేశం పైన ఉండదని, సభ్యులు అనుమానాలకు గురికావద్దని అన్నారు. ముందుగా ప్రకటించినట్టే అక్టోబర్ 05 వ తేదీన ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్ లో పార్టీ సర్వసభ్య సమావేశం కొనసాగుతుందని సీఎం కేసీఆర్ పునరుద్ఘాటించారు. అందరూ నిర్దేశిత సమయంలోపే హాజరుకావాలన్నారు.

కాబూల్‌లో ఆత్మాహుతి బాంబు దాడి.. 53 మంది మృతి

కాబూల్, అక్టోబర్ 3: ఆఫ్ఘనిస్థాన్‌లోని కాబూల్‌ని షాహిద్ మజారీ రోడ్‌లోని పుల్-ఎ-సుఖ్తా ప్రాంతానికి సమీపంలో ఆత్మాహుతి సోమవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో 53 మంది వరకు మృత్యువాతపడ్డారు. ఓ పాఠశాల తరగతి గదికి సమీపంలో పేలుడు జరగ్గా.. పేలుడులో 53 మంది మృతి చెందారు.

ఇందులో 46 మంది బాలికలు, మహిళలు ఉన్నారు. కాబూల్‌లోని పీడీ-6 ప్రాంతంలోని పశ్చిమాన మధ్యాహ్నం 2 గంటలకు ఈ పేలుడు సంభవించింది.

ఇదిలా ఉండగా.. సెప్టెంబర్ 30న శుక్రవారం కాబూల్‌లోని యూనివర్సిటీ వద్ద జరిగిన ఆత్మాహుతి బాంబుదాడిలో కనీసం వంద మంది పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. షియా ప్రాంతంలోని విద్యాసంస్థపై ఆత్మాహుతి దాడి జరిగింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని మైనారిటీ షియా కమ్యూనిటీ వ్యక్తులు ఎక్కువగా నివసించే కాబూల్‌లోని దష్టి బార్చి పరిసరాల్లోని సెంటర్ లోపల ఉదయం సమయంలో పేలుడు చోటుచేసుకున్నది.

తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆఫీసులో చోరీ

హైదరాబాద్, అక్టోబర్ 3: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలోని తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యాలయంలో చోరీ జరిగింది. ఈ విషయాన్ని ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ జీపీ పాల్గుణ ధృవీకరించారు. సోమవారం ఉదయం కార్యాలయం ఓపెన్ చేయగా, వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయని తెలిపారు. ఇక ట్రోఫీలు, ఆటగాళ్లకు సంబంధించిన కిట్లు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. రూ. 50 వేల విలువ చేసే ట్రోఫీలు, రూ. 10 వేల విలువ చేసే కిట్లు అదృశ్య అయ్యాయని చెప్పారు.

ఇవాళ ఉదయం ఆఫీసును క్లీన్ చేసేందుకు వచ్చిన పని వారు ఈ ఘటనను గుర్తించి తనకు సమాచారం అందించారని వెల్లడించారు. తాను ఆఫీసుకు వచ్చి చూసేసరికి ట్రోఫీలు, కిట్లు కనబడటం లేదని తెలిపారు.

అనంతరం సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎల్బీ స్టేడియం వద్ద ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

సూపర్ సీనియర్ సిటిజన్లకు ఈ బ్యాంకు ఎఫ్‌డీలపై 0.80 శాతం అదనపు వడ్డీ

హైదరాబాద్, అక్టోబర్ 3: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) సీనియర్ సిటిజన్లు (80 ఏండ్లు దాటిన వారికి) ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 80 బేసిక్ పాయింట్లు (0.80 శాతం) వడ్డీ అదనంగా ఆఫర్ చేస్తున్నది. సాధారణ పౌరుల కంటే సూపర్ సీనియర్ సిటిజన్ల (80 ఏండ్లు దాటిన వారు) ఫిక్స్‌డ్ డిపాజిట్లకు 0.80 శాతం అదనంగా వడ్డీ లభిస్తుంది.

ఏడు రోజుల నుంచి 10 ఏండ్ల టెన్యూర్ వరకు ఈ అదనపు వడ్డీరేట్లు లభిస్తాయి. 60 ఏండ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50 శాతం (50 బేసిక్ పాయింట్లు) వడ్డీ ఆఫర్ చేస్తున్నది పంజాబ్ నేషనల్ బ్యాంక్. పెరిగిన వడ్డీరేట్లు గత నెల 13 నుంచి అమల్లో ఉన్నాయి.

ఇతర బ్యాంకులతో పోలిస్తే పంజాబ్ నేషనల్ బ్యాంక్ మాత్రమే సూపర్ సీనియర్ సిటిజన్లకు అదనంగా 80 బేసిక్ పాయింట్ల వడ్డీ ఆఫర్ చేస్తున్నది.

ఒకవేళ మెచ్యూరిటీ డేట్‌కు ముందే ముందస్తుగా విత్‌డ్రా చేసుకుంటే మాత్రం 30 బేసిక్ పాయింట్ల వడ్డీ వర్తించదు.

ఎస్బీఐ తన ఖాతాదారులకు 'వుయ్ కేర్ సీనియర్ సిటిజన్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్', హెచ్డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫర్ సీనియర్ సిటిజన్స్ అనే పేరుతో స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు అమలు చేస్తున్నాయి.

సూపర్ సీనియర్ సిటిజన్లకు ఎస్బీఐ వుయ్ కేర్ ఎఫ్డీ కింద 80 బేసిక్ పాయింట్లు అదనపు వడ్డీ ఇస్తుండగా, హెచ్డీఎఫ్‌సీ బ్యాంక్ 0.25 శాతం వడ్డీ ఆఫర్ చేస్తున్నది.

చరిత్రలో నేటినిజం

కం॥ చికకని పచుళాలమునకు
చెకకన రూపముగ నిలచి చిన్నమ్మలటో
మీకుక్రవ గలి గింప - గాలుకు -
చకకని నటనమ్ము బూపు స్వాతీశర్మనే!!

(అక్టోబర్ 4 స్వాతీశర్మ పుట్టినరోజు..) -రాధశ్రీ

సెల్:9494481210

ఫ్లోరోసిస్ దుస్థితికి ఆనాటి సాక్ష్యం.. కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 3:ఫ్లోరైడ్ రక్కసి నల్లగొండ జిల్లాను అతలాకుతలం చేసింది. వేల మందిని జీవచ్ఛవంలా మార్చింది. కాళ్లు, చేతులు వంకర పోవడంతో.. ఏ పని చేయలేని స్థితిలో ఉండిపోయి, అనేక బాధలను అనుభవించారు. అలాంటి ఫ్లోరైడ్ రక్కసి నుంచి నల్లగొండ జిల్లా ప్రజలకు టీఆర్ఎస్ సర్కార్ విముక్తి కల్పించింది. మిషన్ భగీరథ పథకం ప్రవేశపెట్టి.. సురక్షితమైన తాగునీరు అందించి.. ఆ జిల్లా ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చెరగని ముద్ర వేసుకున్నారు.

అయితే ఫ్లోరైడ్ రక్కసికి సంబంధించి గతాన్ని గుర్తు చేస్తూ టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు.

ప్రధాని టేబుల్ మీద ఫ్లోరోసిస్ బాధితుడు స్వామి చిత్రం ఆనాటి దుస్థితికి సాక్ష్యమని కేటీఆర్ పేర్కొన్నారు. దశాబ్దాలు అధికారంలో ఉన్నా స్వయంగా ప్రధానికి మొరపెట్టుకున్నా పైసా ఇవ్వలేదు, పరిష్కారం కాలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన శాశ్వతంగా ఈ సమస్య తీర్చిన మాట వాస్తవమని కేంద్రమే పార్లమెంట్లో చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు.

మెడికల్ రంగంలో ఇది గొప్ప విజయం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 3:తెలంగాణ రాష్ట్రంలో ఈ విద్యాసంవత్సరం కొత్తగా 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1200 మందికి కొత్తగా అడ్మిషన్లు వచ్చాయన్నారు. ఇది గొప్ప విజయం. 1200 సీట్లు ఒక విద్యాసంవత్సరంలో రావడం దేశ చరిత్రలోనే ఇది తొలిసారి అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఇవాళ మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో గాంధీ ఆస్పత్రికి వెళ్లి 2004 నుంచి 2014 వరకు మెడికల్ కాలేజీల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై మాట్లాడానని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ వస్తేనే మెడికల్ కాలేజీలు వస్తాయని, న్యాయం జరుగుతుందని మాట్లాడటం జరిగిందన్నారు. సమైక్య రాష్ట్రంలో మూడే మూడు మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్. 70ఏళ్ల సమైక్య పాలనలో మూడు కాలేజీలు వస్తే, ఏడేళ్లలో 17 కాలేజీలు తెచ్చుకున్నాం. కొత్తగా 12 కాలేజీలను ఈ ఏడేళ్లలో తెచ్చుకోగలిగామని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 8 మెడికల్ కాలేజీలు పెట్టుకుంటున్నామని చెప్పారు. ఒక్క మెడికల్ కాలేజీకి రూ. 510 కోట్ల చొప్పున సీఎం కేసీఆర్ మంజూరు చేశారు. మొత్తం రూ. 4,080 కోట్లు మంజూరు చేయడం జరిగిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ 8 మెడికల్ కాలేజీలకు మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతి వచ్చేందుకు కృషి చేసిన డీఎంఈకి, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు, విమలా థామస్, డాక్టర్ వాణికి మంత్రి అభినందనలు తెలిపారు. రిజ్వీ కృషిని కూడా అభినందిస్తున్నానని చెప్పారు.

3.3 రెట్లు పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రం ఏర్పడినపుడు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు 850 ఉంటే, ఈ విద్యా సంవత్సరంలో 2,901కు సీట్లను పెంచుకున్నామని హరీశ్‌రావు వెల్లడించారు. ఎంబీబీఎస్ సీట్లు 3.3 రెట్లు పెరిగాయన్నారు. ఇది చారిత్రాత్మక విజయం అని మంత్రి పేర్కొన్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులు ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లి వైద్య విద్య అభ్యసించవలసిన అవసరం లేదు. ఇలాంటి పరిస్థితికి కారణం. సమైక్య పాలనలో తెలంగాణపై చూపిన వివక్షే అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ-ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో 6,540 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2014లో ప్రభుత్వ-ప్రయివేటు రంగంలో ఎంబీబీఎస్ సీట్లు కేవలం 2,600 ఉన్నాయని గుర్తు చేశారు. ఇవి కాక ఆయుష్, ఆయుర్వేద, యూనాని వంటి విభాగాల్లోనూ సీట్లు ఉన్నాయని తెలిపారు.

బీ కేటగిరి సీట్లలో 85 శాతం లోకల్ రిజర్వేషన్లు

బీ కేటగిరి సీట్లలోనూ 85 శాతం లోకల్ రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకున్నామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీని వల్ల తెలంగాణ వైద్య విద్యార్థులు ఇక్కడే చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ నిర్ణయ వల్ల 1,067 సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయని పేర్కొన్నారు.

ఎస్ఎన్‌డీపీ నాలా పనులకు ఎలాంటి నిధుల కొరత లేదు : జీహెచ్ఎంసీ మేయర్

హైదరాబాద్, అక్టోబర్ 3: ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపట్టిన నాలా పనులకు ఎలాంటి నిధుల కొరత గానీ, బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం లేదని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. నగరంలో వరద ముంపు నివారణకు రూ.985 కోట్లతో 60 పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు రూ. 450 కోట్ల విలువ గల బిల్లులు చెల్లింపులకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అందులో ఇప్పటికే రూ.103.19 కోట్ల విలువ గల బిల్లులు చెల్లించినట్లు స్పష్టం చేశారు. మిగతా రూ. 350 కోట్ల బిల్లులు చెల్లించేందుకు ప్రాసెస్ లో కలవు. వాటిని కూడా త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు.

నాలా పనులను ముందుగా మిషన్ మోడ్‌లో అనుకున్న సమయంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ రుతుపవనాలు అడ్వాన్స్ గా ప్రవేశించడం, ఎడతెరపి లేకుండా వర్షాలు పడటం మూలంగా అనుకున్న లక్ష్యం నెరకు పూర్తి చేయలేక పోవడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ చేపట్టిన నాలా పనుల వల్ల లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవాహం లేకుండా చేయడం జరిగిందన్నారు. వర్షాలు కురుస్తున్నప్పటికీ పనులు చేపట్టేందుకు మెటీరియల్ సిద్ధం చేసుకున్నప్పటికీ ఎడతెరిపి లేకుండా నిరంతరంగా కురుస్తున్న భారీ వర్షాలకు పనులను కొనసాగించ లేకపోయినట్లు మేయర్ వెల్లడించారు.

ఎస్ఎన్‌డీపీ పనుల కారణంగా కొన్ని కాలనీలలో వరద ముంపు సంభవించలేదని పేర్కొన్నారు. బంజారా కాలనీ, అంబేద్కర్‌నగర్, బండ్లగూడ, నాగోల్, హయత్‌నగర్, సింగరేణి కాలనీ, రామంతపూర్, సరస్వతి నగర్ (మన్సూరాబాద్), క్రిస్టియన్ కాలనీ (వనస్థలిపురం), కోదండరాంనగర్, పీ అండ్ టీ కాలనీ, తపోవన్ కాలనీ, అల్వాల్, కొంపల్లి, జీడిమెట్ల, హబీబ్‌నగర్, ఇక్రిసాట్ కాలనీ, హఫీజ్‌బాబా నగర్ (ముర్కి నాలా వెంట ఉన్న కాలనీలు), విక్రమ్ నగర్, పాట్నీ నగర్, తదితర కాలనీల్లో ముంపు సంభవించలేదని మేయర్ స్పష్టం చేశారు.

అక్టోబరు 5వ తేదీన హిమాచల్ ప్రదేశ్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022వ సంవత్సరం లో అక్టోబరు 5వ తేదీ నాడు హిమాచల్ ప్రదేశ్ ను సందర్శించనున్నారు. అక్కడ 3,650 కోట్ల రూపాయల పైచిలుకు విలువ కలిగిన ప్రాజెక్టుల లో కొన్నిటి ని ఆయన ప్రారంభించి, మరికొన్నిటి కి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం పూట ఇంచుమించు 11:30 గంటల వేళ లో ఎఐఐఎమ్ఎస్ బిలాస్ పుర్ ను ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. తదనంతరం, మధ్యాహ్నం సుమారు 12 గంటల 45 నిమిషాల వేళ లో బిలాస్ పుర్ లో లును గ్రౌండు కు చేరుకొని అనేక అభివృద్ధి పథకాల ను ప్రారంభించడం తో పాటు మరికొన్నిటి కి శంకుస్థాపన కూడా చేయనున్నారు. ఒక జనసభ ను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు కూడాను. మధ్యాహ్నం ఇంచుమించు 3 గంటల 15 నిమిషాల వేళ లో ప్రధాన మంత్రి కుల్లూ లోని ధాల్ పుర్ గ్రౌండు కు చేరుకొని అక్కడ జరిగే కుల్లూ దసరా వేడుకల లో పాల్గొంటారు.

ఎఐఐఎమ్ఎస్ బిలాస్ పుర్ ప్రారంభ కార్యక్రమం దేశవ్యాప్తం గా ఆరోగ్య సేవల ను పటిష్టపరచాలనే ప్రధాన మంత్రి యొక్క దృష్టికోణాన్ని మరియు వచనబద్ధత ను మరో సారి కళ్ల కు కట్టనుంది. ప్రధాన మంత్రి 2017వ సంవత్సరం అక్టోబరు లో శంకుస్థాపన చేసిన ఈ ఆసుపత్రి ని 'ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన' లో భాగం గా ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

ఎఐఐఎమ్ఎస్ బిలాస్ పుర్ నిర్మాణాని కి 1470 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు అయింది. ఈ అత్యాధునిక ఆసుపత్రి లో 18 స్పెశాలిటీ విభాగాలు, 17 సూపర్ స్పెశాలిటీ విభాగాలు, 18 శస్త్ర చికిత్స సదుపాయాలు, 64 ఐసియు పడకల తో సహా 750 పడక లు ఉన్నాయి. 247 ఎకరాల కు మించిన స్థలం లో నెలకొల్పిన ఈ ఆసుపత్రి లో అత్యవసర స్థితి లో ఉపయోగించవలసిన సదుపాయాలు మరియు డాయెలిసిస్ సదుపాయాలు, అల్ట్రసోనోగ్రఫి, సిటి స్కాన్, ఎమ్ఆర్ఐ వగైరా అధునాతన రోగ నిర్ధారణ యంత్రాలు, అమృత్ ఫార్మసీ ఎండ్ జన్ ఔషధీ కేంద్ర తో పాటు గా 30 పడకల తో కూడిన ఆయుష్ బ్లాక్ కూడా ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్ లోని ఆదివాసీ ప్రాంతాల లోను, చేరుకోవడం కష్టమైన మారుమూల ప్రాంతాల లోను ఆరోగ్య సేవల ను అందించడానికి తోడ్పడే సెంటర్ ఫార్ డిజిటల్ హెల్థ్ ను కూడా ఈ ఆసుపత్రి కలిగివుంది.

అంతేకాక కాజా, సలూణీ మరియు కేలాంగ్ ల వంటి ఉన్నత హిమాలయ ప్రాంతాలు మరియు దుర్గమమైన ఆదివాసీ ప్రాంతాల లో ఆరోగ్య శిబిరాల ను నిర్వహించడం ద్వారా ఈ ఆసుపత్రి స్పెశలిస్ట్ హెల్థ్ సర్వీసెజ్ ను అందజేయనుంది. ఈ ఆసుపత్రి లో ఎంబిబిఎస్ కోర్సు కోసం ఏటా వంద మంది విద్యార్థుల ను, నర్సింగ్ కోర్సుల కోసం ఏటా 60 మంది విద్యార్థుల ను చేర్చుకోవడం జరుగుతుంది.

ఎన్ హెచ్ -105 లో పింజోర్ నుండి నాలాగఢ్ వరకు దాదాపు గా 31 కిలో మీటర్ ల జాతీయ రహదారి ని నాలుగు దోవ లు కలిగింది గా తీర్చిదిద్దే ప్రాజెక్టు కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టు విలువ 1690 కోట్ల రూపాయల కు పైబడి ఉంటుంది. ఈ ప్రాజెక్టు రోడ్డు అంబాలా, చండీగఢ్, పంచ్ కుల, సోలన్/శిమ్ లా ల నుండి సాగిపోయే వాహనాలు బిలాస్ పుర్ కు, మండీ కి మరియు మనాలీ కి సాగిపోయేందుకు ఒక ప్రధానమైన లంకె గా ఉంటుంది.

ఈ నాలుగు దోవల జాతీయ రహదారి లో దాదాపు గా 18 కి. మీ. భాగం హిమాచల్ ప్రదేశ్ లోను, మిగిలిన భాగం హరియాణా లోను ఉంటుంది.

ఈ హైవే హిమాచల్ ప్రదేశ్ లో పారిశ్రామిక కేంద్రం అయినటువంటి నాలాగఢ్-బద్దీ లో ఉత్తమమైన రవాణా సౌకర్యాల కు పూచీపడటం తో పాటు గా ఆ ప్రాంతం లో పారిశ్రామికాభివృద్ధి కి ఒక ఉత్తేజాన్ని కూడా అందించనుంది. ఇది రాష్ట్రం లో పర్యటన రంగాని కి కూడా దన్నుగా ఉంటుంది.

నాలాగఢ్ లో మెడికల్ డివైస్ పార్కు కు కూడా ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. సుమారు 350 కోట్ల రూపాయల ఖర్చు తో ఈ పార్కు ను నిర్మించడం జరుగుతుంది. ఈ మెడికల్ డివైస్ పార్కు లో పరిశ్రమల ను ఏర్పాటు చేయడం కోసం 800 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన అవగాహన పూర్వక ఒప్పంద పత్రాల (ఎంఒయు) పై ఇప్పటికే సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు ఆ ప్రాంతం లో ఉపాధి అవకాశాల ను చెప్పుకోదగ్గ స్థాయి లో పెంపొందింపచేయనుంది.

బాండ్ లా లో గవర్నమెంట్ హైడ్రో ఇంజినీరింగ్ కాలేజీ ని కూడా ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు. ఈ కళాశాల నిర్మాణాని కి 140 కోట్ల రూపాయల ఖర్చు అయింది; జల విద్యుత్తు పథకాల కు శిక్షణ ను పొందినటువంటి శ్రమ శక్తి ని అందుబాటు లోకి తీసుకు రావడం లో ఈ కళాశాల దోహదం చేయను ంది. హిమాచల్ ప్రదేశ్ హైడ్రో పావర్ ప్రాజెక్టుల లో అగ్రగామి రాష్ట్రాల లో ఒక రాష్ట్రం గా ఉంది. ఈ కళాశాల యువత కు నైపుణ్యాల కు మెరుగు లు దిద్దుకోవడం లోను, జలవిద్యుత్తు రంగం లో కావలసినంత ఉద్యోగ అవకాశాల కల్పన కు సాయపడనుంది.

అంతర్జాతీయ కుల్లూ దసరా ఉత్సవాన్ని 2022 అక్టోబరు 5వ తేదీ మొదలుకొని 11వ తేదీ వరకు కుల్లూ లోని ధాల్ పుర్ గ్రౌండ్ లో నిర్వహించడం జరుగుతుంది.

లోయ లోని 300 కు పైగా దేవత లు ఒక చోటు కు రావడం ఈ ఉత్సవం విశిష్టత. ఉత్సవం లో ఒకటో రోజు న, చక్కగా అలంకరించిన పల్లకీల లో బయలుదేరే దేవత లు ముఖ్య దైవం అయిన భగవాన్ రఘునాథ్ జీ ఆలయం లో వాటి వందనాన్ని ఆచరించి, అటు తరువాత ధాల్ పుర్ గ్రౌండు కు ఊరేగింపు గా బయలుదేరి వెళ్తాయి. దివ్యమైన రథయాత్ర ను మరి అలాగే చరిత్రాత్మకమైనటువంటి కుల్లూ దసరా ఉత్సవాల లో దేవతల మహా కూటమి ని ప్రధాన మంత్రి వీక్షించనున్నారు. దేశ ప్రధాన మంత్రి కుల్లూ దసరా ఉత్సవాల లో పాలుపంచుకోవడం ఇదే తొలిసారి కానున్నది.

రేపటి నుంచి మూడ్రోజులపాటు భారీ వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 3:రాష్ట్రంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ఏపీ తీరంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి నైరుతి దిశగా వంపు తిరిగి ఉన్నదని వివరించింది. ఈశాన్య బంగాళాఖాతం పరిసరాల్లో ఏర్పడిన మరో ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉన్నదని తెలిపింది. వీటి ప్రభావంతో బుధవారం నుంచి మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం ప్రాథమిక హెచ్చరిక జారీ చేసింది.

5న హైదరాబాద్‌లో సంబురాలు : మంత్రి తలసాని

హైదరాబాద్, అక్టోబర్ 3: ఈ నెల 5న హైదరాబాద్ నగరవ్యాప్తంగా భారీ ఎత్తున సంబురాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా టీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ నెల 5న దసరా రోజు టీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని, సమావేశం అనంతరం రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద, నగరంలోని అన్ని నియోజకవర్గాలు, డివిజన్లలో భారీ ఎత్తున సంబురాలు జరుపాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, సాయన్న, ముఠా గోపాల్, కార్పొరేషన్ చైర్మన్లు రావుల శ్రీధర్ రెడ్డి, ఆయాచితం శ్రీధర్, గజ్జెల నగేశ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, పలువురు కార్పొరేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ములాయం ఆరోగ్యంపై సీఎం కేసీఆర్ ఆరా

హైదరాబాద్, అక్టోబర్ 3: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు ములాయం సింగ్ యాదవ్ ఇటీవల అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సోమవారం ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. ములాయం తనయుడు, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌కు సీఎం కేసీఆర్ స్వయంగా ఫోన్ చేశారు. అఖిలేశ్‌తో మాట్లాడి ములాయం ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. దసరా పండుగ తర్వాత స్వయంగా వచ్చి కలుస్తానని ఈ సందర్భంగా అఖిలేశ్ యాదవ్‌కు సీఎం కేసీఆర్ తెలిపారు.

హైదరాబాద్‌లో పట్టుబడ్డ 900 కిలోల గంజాయి

హైదరాబాద్, అక్టోబర్ 3: హైదరాబాద్‌లో మరోసారి భారీగా గంజాయి పట్టుబడింది. డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి ముంబైకి గంజాయిని తరలిస్తున్న నలుగురిని ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద లభించిన 900 కిలోల గంజాయిని సీజ్ చేశారు. దీనివిలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని చెప్పారు. నిందితుల నుంచి డీసీఎం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్‌డీపీఐకి పీఎఫ్ఐతో లింక్ లేదు.. స్పష్టం చేసిన ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: కేంద్ర ప్రభుత్వం నిషేధించిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) తో రాజకీయ పార్టీ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) కి ఎలాంటి సంబంధాలు లేవని తేలింది. ఈ విషయాన్ని భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ (సీఈసీ) వెల్లడించారు. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా నిలుస్తున్న పీఎఫ్ఐని కేంద్రం ఇటీవలనే ఐదేండ్ల పాటు నిషేధించింది. ఈ నేపథ్యంలో తమకు పీఎఫ్ఐతో ఎలాంటి సంబంధాలు లేవని ఎస్‌డీపీఐ స్పష్టం చేసుకోవాల్సి వచ్చింది.

సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ), నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) కి మధ్య ఎలాంటి లింకులు లేవని ఎన్నికల సంఘం గుర్తించింది. దేశవ్యాప్తంగా పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలపై ఎన్ఐఏ కొరడా ఝులిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. ఈ నేపథ్యంలో పీఎఫ్ఐతో తమకు ఎలాంటి సంబంధాలు లేవని స్పష్టం చేసే అన్ని పత్రాలను ఎస్‌డీపీఐ తమకు అందజేసిందని, వీటిని పరిశీలించిన తర్వాత వారిపై ఎలాంటి చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని సీఈసీ రాజీవ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఎస్‌డీపీఐ వైపు నుంచి ఎలాంటి డిఫాల్ట్ లేదని ఆయన చెప్పారు.

కాగా, ఎస్‌డీపీఐ 2009 జూన్ 21 న ఏర్పడింది. 2010 ఏప్రిల్ 13 వ తేదీన భారత ఎన్నికల సంఘం వద్ద నమోదైంది. ఇప్పటివరకు, ఎస్‌డీపీఐ పార్టీ కేరళ, తమిళనాడు, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, కర్నాటక, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మునిసిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసింది.

కొత్త సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్‌కు జెడ్ ప్లస్ భద్రత

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జనరల్ అనిల్ చౌహాన్‌కు జెడ్ ప్లస్ భద్రతను కేంద్ర ప్రభుత్వం కల్పించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఢిల్లీ పోలీస్ విభాగానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో సీడీఎస్ అనిల్ చౌహాన్ నివాసం, ఆయన పర్యటనల సందర్భంగా 33 మంది సాయుధ ఢిల్లీ పోలీసులు రక్షణగా ఉంటారు.

కాగా, తొలి సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్, హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన తర్వాత 9 నెలల పాటు ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. అయితే లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) అనిల్ చౌహాన్‌ను సీడీఎస్‌గా కేంద్రం నియమించింది. అలాగే ఆయనకు జనరల్ ర్యాంకు హోదా కూడా కల్పించింది. దేశ సైనిక చరిత్రలో ఇలా జరుగడం ఇదే తొలిసారి.

1961 మే 18న జన్మించిన జనరల్ చౌహాన్ 1981లో భారత సైన్యంలోని 11 గూర్ఖా రైఫిల్స్‌లో చేరారు. శుక్రవారం సీడీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన త్రివిధ దళాల వ్యవహారాలపై రక్షణ మంత్రికి ప్రిన్సిపల్ మిలిటరీ సలహాదారుడిగాను, సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగాను వ్యవహరిస్తారు.

అంతరిక్ష రహస్యాల గుట్టు విప్పాలి..!

(4-10 అక్టోబర్ "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు" సందర్భంగా)

ప్రపంచదేశాల్లో శాస్త్రసాంకేతిక నవవిప్లవ ఫలాలు సగటు మానవుని జీవితంతో ఊహించలేనంతగా మార్పును తెచ్చాయి. విశ్వమానవాళి సంక్షేమానికి, సులభతర జీవన విధానానికి శాస్త్ర పరిశోధనలు ఊతం ఇస్తూనే ఉన్నాయి. అరచేతిలో స్మార్ట్ ఫోన్ వైకుంఠం వెలసి, విశ్వాన్ని కుగ్రామం చేసింది. ప్రయోగశాల నుండి ఖగోళం దాకా, వంటింటి నుంచి నక్షత్ర, గ్రహాల దాకా మానవుడు సృజించని తావు లేదు, అర్థ చేసుకోని అంశం లేదు. భూగ్రహాన్ని అర్థం చేసుకోవడానికి అంతరిక్ష పరిశోధనలు కావాలి. అనంత అంతరిక్షంలో లెక్కకు మించిన నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, గ్రహశకలాలు లాంటి అతిభారీ ఆకారాలు ఉన్నాయి. అంతరిక్షంలోని పాలపుంతలోగల సూర్యమండలంలో భానుడు కేంద్రంగా నవ గ్రహాలు, సహజ ఉపగ్రహాలు ఉన్నాయి. అనేక గ్రహాల్లో భూగ్రహం మాత్రమే జీవ మనుగడకు అనుకూలంగా ఉందని మన నమ్మకం. అంతరిక్షంలో విహరించి గ్రహాలను, ఉపగ్రహాలను శోధించేందుకు, భూగ్రహ రహస్యాల గుట్టు విప్పేందుకు ఆధునిక అంతరిక్ష ప్రయోగాలు ముమ్మరంగా జరుతూనే ఉన్నాయి. అంతరిక్ష అంతు చూడడం, మానవాళి జీవనశైలిలో సకారాత్మక మార్పులు తేవడానికి ప్రపంచ దేశాలు అంతరిక్ష ప్రయోగాలకు అతి ప్రాధాన్యతలను ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రతి ఏటా అక్టోబర్ 04 నుండి 10 వరకు విశ్వవ్యాప్తంగా "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల"ను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 06 డిసెంబర్ 1999న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను సభ్యదేశాలు నిర్వహిస్తున్నాయి.

అంతరిక్ష అద్భుతం – తాజా నాసా డార్ట్ మిషన్:

భూగ్రహాన్ని ఢీ కొట్టే అవకాశం ఉన్న గ్రహశకలాలను ధ్వంసం లేదా దారి మళ్లించడానికి అమెరికన్ నాసా సంస్థ చేసిన డార్ట్ (డబుల్ ఆస్టరాయిడ్ రీడైరెక్షన్ టెస్ట్) ప్రయోగాలు సఫలం కావడం ప్రపంచ మానవాళికా శుభవార్తగా వ్యాపించింది. 24 నవంబర్ 2021న ప్రయోగించిన డార్ట్ స్పేస్‌క్రాఫ్ట్ 11 మిలియన్ కిమీ దూరంలో 526అడుగుల వ్యాస పరిమాణం ఉన్న 'డైమార్ఫోస్' గ్రహశకలాన్ని 26 సెప్టెంబర్ 2022న ఢీ కొట్టడంతో గ్రహశకలం ముక్కలు కావడం, దారి మళ్లడం జరిగింది. ఇలాంటి అద్భుత అంతరిక్ష ప్రయోగాలతో విశ్వ మానవాళి మనుగడ (శాస్త్రసాంకేతిక ప్రగతితో) సుగమం అవుతున్నది. డార్ట ప్రయోగం విజయవంతం కావడంతో భవిష్యత్తులో భూమిని ఢీ కొట్టే అవకాశం కలిగిన గ్రహశకలాల దారిని మళ్లించడానికి మార్గం సుగమం అయ్యింది.

అంతరిక్ష పరిశోధనల్లో మహిళలు:

ఈ ఏడాది 'ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు–2022' నినాదంగా "అంతరిక్షం మరియు సుస్థిరత (స్పేస్ అండ్ సస్టేనబులిటీ)" తీసుకున్నారు.విశ్వ అంతరిక్ష పరిశ్రమలో దాదాపు 22 శాతం వరకు మహిళా శక్తి వినియోగించబడుతున్నది. అంతరిక్షంలో మహిళలు దూసుకుపోవడానికి ఐరాస 'స్పేస్4వూమెన్' అనే నినాదంతో అంతరిక్ష వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీ, ఇన్నొవేషన్, ఎక్స్‌ప్లోరేషన్ రంగాల్లో పలు ప్రణాళికలు వేస్తున్నారు. 1963లో వాలెంటీనా తెరిస్కోవా అంతరిక్షయానం చేసిన తొలి మహిళగా చరిత్రకు ఎక్కారు. నాటి నుండి నేటి వరకు 65 మంది మహిళలు అంతరిక్ష నౌకలో ప్రయాణించి పరిశోధనలు చేశారు. భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా, సునితా విలియమ్స్, రాకేష్ శర్మ, శిరీష బండ్లలు వ్యోమగాములుగా అంతరిక్షయానం చేశారు.

అంతరిక్ష పరిశోధనలు:

ప్రపంచ అంతరిక్ష చరిత్రలో 04 అక్టోబర్ 1957న ప్రథమ మానవ నిర్మిత భూ ఉపగ్రహం (ఎర్త్ శాటలైట్), స్పుత్నిక్–1ను అంతరిక్షంలోకి ప్రయోగించగా, 10 అక్టోబర్ 1967న బాహ్య అంతరిక్ష ఒప్పందం(అవుటర్ స్పేస్ ట్రీటి)లో సంతకాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలలో ఐరాస సభ్యదేశాలకు చెందిన విద్యాలయాలు, ప్రభుత్వ వేదికలు, అంతరిక్ష సంస్థలు, ప్రదర్శనశాలలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, సామాన్యులకు అంతరిక్ష పరిశోధనలు మరియు రహస్యాలను వివరించే ప్రయత్నాలు చేస్తున్నారు. సామాన్య ప్రజానీకంలో అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచడం, అంతరిక్షశాస్త్రం పట్ల ఆసక్తిని కలిగించడం, అంతరిక్ష పరిశోధనలతో మానవాళి సుస్థిరాభివృద్ధి, అంతరిక్ష శాస్త్రజ్ఞుల సేవలు గుర్తించడం, యువతను వైజ్ఞానిక, సాంకేతిక, ఇంజనీరింగ్ మరియు గణితశాస్త్రాల వైపు దృష్టి మరల్చడం మరియు అంతరిక్ష పరిశోధనలలో ప్రపంచదేశాలను సమన్వయ పరచడం లాంటి అంశాలను చేపడతారు. గత ఆరు దశాబ్దాలుగా పలు అంతరిక్ష సంస్థలు కృత్రిమ ఉపగ్రహాలను ప్రయోగిస్తూ, పరిశోధిస్తూ, సాంకేతిక ఫలాలను సకల మానవాళి సౌభాగ్య సన్నిధికి చేర్చడంలో అనేక మైలు రాళ్ళ దాటుతూ వస్తున్నది. మన అంతరిక్ష పరిశోధనల పుణ్యాన వాతావరణ హెచ్చరికలు, టివిలో ప్రత్యక్ష ప్రసారాలు, స్మార్ట్ ఫోన్ విప్లవాలు, జిపియస్ టెక్నాలజీ లాంటి అద్భుతాలు సుసాధ్యం అయ్యాయి. నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ మె?దటిసారి (20 జూలై 1969న) ఇంద్రమండలంపై అడుగిడి అర్థశతాబ్దం దాటింది. సూక్ష్మ, చిన్న మరియు 10 సెంటీమీటర్ల ఘనాకారం ఉపగ్రహాలను చవకగా ప్రయోగించే స్థాయికి చేరాం. రిమోట్ సెన్సింగ్, గురుత్వాకర్షణ, పర్యావరణ పరిజ్ఞానం, అంతరిక్ష శాస్త్రం, గ్రహవ్యవస్థ, ఆస్ట్రానమీ, మెటీరియల్ సైన్స్, జీవశాస్త్రం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్ర రంగాల్లో విప్లవాత్మక అంతరిక్ష పరిశోధనలు జరుగుతున్నాయి. ఐటిటి మరియు ఎంబెడెడ్ వెబ్ టెక్నాలజీ, కెమెరా సెన్సార్స్, జిపియస్, కమ్యూనికేషన్ మరియు ఇంటర్నెట్ లాంటి ఆధునిక విప్లవానికి అంతరిక్ష పరిశోధనలే పునాదులు వేశాయి.

అంతరిక్షంలో భారతం:

ఇండియా అంతరిక్ష చరిత్రలో 1969లో తొలి అడుగుగా స్వయంప్రతిపత్తి గల "భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ, ఇస్రో"ను నెలకొల్పడం జరిగింది. ప్రతిష్టాత్మక ఇస్రో నేతృత్వంలో ఉపగ్రహాల రూపకల్పన, అభివృద్ధి, అసెంబ్లింగ్ మరియు ప్రయోగించడం జరుగుతోంది. అంతరిక్ష ఉపగ్రహ ప్రయోగ వాహనాలను తయారుచేయడం, శ్రీహరికోట ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుండి అంతరిక్ష కక్ష్యలోకి చేర్చడం తెలికైంది. ఇస్రో ప్రధాన కార్యాలయం బెంగళూరులో, అంతరిక్ష ఉనువర్తన కేంద్రం అహమ్మదాబాద్, విక్రం సారాబాయ్ అంతరిక్ష కేంద్రం తిరువనంతపురం, సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం శ్రీరరికోట, మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ హసన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత అంతరిక్ష పరిశోధనా కేంద్రాలు ఇస్రో సొంతం కావడం మనందరికీ గర్వకారణం. 1975లో రష్యా నుండి ఇస్రో ప్రయోగించిన మొదటి భారత ఉపగ్రహం ఆర్యభట్టా, 1980 భారత్ స్వతంత్రంగా ప్రయోగించిన రోహిణి, ఇన్సాట్, జీసాట్, పియస్‌యల్‌వి, జియస్‌యల్‌వి వరకు అనేక మైలు రాళ్ళు విజయవంతంగా దాటుతూ వస్తోంది. చంద్రయాన్–1 మరియు చంద్రయాన్–2ల ద్వారా చంద్రమండలం చేరడం, మార్స్ ఆర్బిటర్ మిషన్ మరియు 2021లో కక్షలోకి వ్యోమగామిని పంపే లక్ష్యాలను ఇస్రో పెట్టుకుంది. అనంత అంతరిక్షంలో దాగి ఉన్న విశ్వాంతరాళ రహస్యాలను బయటకు తీసి, ప్రపంచ మానవాళి సుఖ సౌభాగ్యాలకు పూల బాటలు వేయాలనే అంతరిక్ష సంస్థల ఆశలు సఫలం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

– డా౹౹ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జాతిపిత మహాత్మాగాంధీ చూపిన బాట అందరికీ మార్గదర్శకం....!

–రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్.

సంగారెడ్డి, అక్టోబర్ 3: (నేటినిజం ప్రతినిధి):శాంతి, అహింసలే ఆయుధాలుగా జాతిపిత మహాత్మా గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు.

గాంధీ జయంతి పురస్కరించుకొని ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గల మహాత్మా గాంధీ విగ్రహానికి రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, గాంధీ చూపిన బాటలో నడవాలని, అహింస తిరుగులేని గొప్ప ఆయుధమని నిరూపించిన మహాత్ముడు అని అన్నారు. భవిష్యత్ తరాలు వారి అడుగుజాడల్లో నడవాలన్నారు.

జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అహింస మార్గంలో పోరాడిన గొప్ప మహనీయుడిని, అహింస మార్గంలో దేనినైనా సాధించవచ్చని గాంధీజీ రుజువు చేశారన్నారు. పల్లె లు దేశానికి పట్టుబొమ్మలని నినదించి పల్లె సీమల అభివృద్ధికి పాటుపడ్డారని, అందరికీ మేలు జరిగేలా దేశాభివృద్ధి ఉండాలని తపించిన గొప్ప మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ అందరికీ ఆదర్శనీయుడని, యువత వారు చూపిన బాటలో నడవాలన్నారు.

ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఎల్లయ్య , ప్రజా ప్రతినిధులు ,అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

హైదరాబాద్, అక్టోబర్ 3:మరోసారి హైదరాబాదులో అంతర్రాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టయ్యింది. ఎల్బీనగర్ లో ఎస్ఓటి పోలీసులు తనిఖీలు నిర్వహించి 900 కేజీల నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 2కోట్ల విలువ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి డీసీఎం, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్న ఎస్వోటీ పోలీసులు. వారిని రిమాండ్ కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 3.0ని ప్రారంభించిన శ్రీ కిరణ్ రిజిజు, అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం ఉదయం న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 3.0 లాంచ్ జరిగింది. 2020లో కోవిడ్–19 మహమ్మారి ఉధృతంగా ఉన్న సమయంలో భారత ప్రభుత్వం ప్రారంభించిన అతిపెద్ద దేశవ్యాప్త ఉద్యమాలలో ఇది ఒకటి. మూడవ ఎడిషన్ ఫిట్ ఇండియా ఫ్లాగ్ రన్‌ను కేంద్ర న్యాయ మరియు న్యాయ శాఖ మంత్రి శ్రీ కిరెన్ రిజిజు మరియు యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ రోజు అక్టోబర్ 2న ప్రారంభమైన ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ మూడవ ఎడిషన్ అక్టోబర్ 31 వరకు కొనసాగుతుంది.

ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో భారత మాజీ ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ హర్షవర్ధన్ గోయెల్, క్రీడా కార్యదర్శి శ్రీమతి. సుజాత చతుర్వేది, డైరెక్టర్ జనరల్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శ్రీ సందీప్ ప్రధాన్, ఫిట్ ఇండియా అంబాసిడర్ రిపు డామన్ బెవ్లీతో పాటు క్రీడా మంత్రిత్వ శాఖ మరియు సాయ్ నుండి ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి దార్శనికతను పునరుద్ఘాటిస్తూ శ్రీ కిరణ్ " శ్రీ నరేంద్ర మోదీ 2019లో ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు దేశం మొత్తం ఫిట్‌గా ఉండాలనేది ఆయన లక్ష్యం. ఇన్నేళ్లుగా సాగుతున్న ఈ ఉద్యమం ఇప్పుడు అంత పెద్ద విజయం సాధించింది. ప్రతి ఒక్కరూ ఇప్పుడు ఉద్యమంలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు మరియు ఫిట్ ఇండియా మొబైల్ యాప్ కూడా ప్రతిరోజూ చాలా ఉత్సాహంతో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు" అని పేర్కొన్నారు,

శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ కూడా అదే క్రమంలో తన భావాలను ప్రతిధ్వనిస్తూ " ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నుండి అమృత్ కాల్ వరకు, భారతదేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలనే ప్రధానమంత్రి దృష్టికి మనం కృషి చేస్తూనే ఉండాలి మరియు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి మొదటి మార్గం మన ఫిట్‌నెస్ కొత్త స్థాయికి చేరుకుంటుంది" అని తెలిపారు.

ఈ ఎడిషన్ ఫ్రీడమ్ రన్‌లో రికార్డు సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని శ్రీ ఠాకూర్ కోరారు " ఈ విజయవంతమైన రన్ మూడవ ఎడిషన్‌ను గాంధీ జయంతి రోజున ప్రారంభించి అక్టోబరు 31న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జన్మదినమైన ఏక్తా దివస్‌లో ముగించడం కంటే మంచి సందర్భం మరొకటి లేదు. గత సంవత్సరం మొత్తం భాగస్వామ్య సంఖ్య 9 కోట్ల 30 లక్షలకు చేరుకుంది మరియు పార్టిసిపేషన్ సంఖ్యలను రెట్టింపు చేయడానికి ఫిట్ ఫ్రీడమ్ రన్ 3.0కి మనం చాలా బలాన్ని అందించాలి" అని చెప్పారు.

ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో గత రెండు సంవత్సరాలుగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్), ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) ఇండియన్ రైల్వేస్, సిబిఎస్ఈ మరియు ఐసిఎస్ఈ పాఠశాలలు అలాగే యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ యూత్ వింగ్స్ నెహ్రూ యువ కేంద్ర సంగటన్ (ఎన్‌వైకెఎస్) మరియు నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్)సహా అనేక సంస్థలు పాల్గొన్నాయి.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై సామర్థ్య నిర్మాణ కార్యక్రమం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఈఎస్బియుడి), నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అత్యున్నత సంస్థ. ఉత్తరాఖండ్ ప్రభుత్వంలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్, ఉత్తరాఖండ్ ప్రభుత్వ అధికారుల కోసం దాని నోయిడా క్యాంపస్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై 5 రోజుల సామర్థ్య నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించింది.

ఈ కార్యక్రమాన్ని ఎంఎస్ఎంఈ శాఖ, పరిశ్రమల డైరెక్టరేట్, ఉత్తరాఖండ్ ప్రభుత్వం సౌజన్యంతో నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లోని వివిధ జిల్లాల నుండి డెవలప్‌మెంట్, ప్రమోషనల్ రోల్‌లో ఉన్న మొత్తం 29 మంది అసిస్టెంట్ డైరెక్టర్లు, మేనేజర్లు, డైరెక్టరేట్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌లోని కీలక అంశాలపై అధికారుల సామర్థ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ ఉత్తరాఖండ్ డైరెక్టర్ శ్రీ ఎస్ సి నౌటియాల్ హాజరయ్యారు. ఉత్తరాఖండ్‌లో వ్యవస్థాపక వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి ఎన్ఐఈఎస్బియుడి, డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ కలిసి పనిచేస్తున్నాయని శ్రీ నౌటియాల్ పేర్కొన్నారు. క్రమబద్ధమైన, ప్రణాళికాబద్ధమైన ప్రయత్నాల ద్వారా వ్యవస్థాపకత కోసం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంలో ఇటువంటి సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు మరింత సహాయపడతాయి.

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం కోసం ఎన్ఐఈఎస్బియుడి తో కలిసి పనిచేస్తున్నందుకు సంస్థ డైరెక్టర్ డాక్టర్ పూనమ్ సిన్హా శ్రీ నౌటియాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్ఐఈఎస్బియుడి, డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్ కలిసి రాష్ట్ర స్థాయిలో వ్యవస్థాపకత ప్రదేశంలో శక్తివంతమైన, కనిపించే ప్రభావాన్ని చూపుతున్నాయని అన్నారు. వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి మరియు అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన సినర్జీని రూపొందించడానికి ఇప్పటికే ఉన్న వనరులను సమగ్రపరచడం ద్వారా మరింత ప్రయోజనం పొందుతుందని డాక్టర్ సిన్హా పేర్కొన్నారు. కార్యక్రమం వారి జ్ఞానం, అనుభవం, నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందని తెలిపారు

శారదా పీఠాన్ని సందర్శించిన మంత్రి ఆర్కే రోజా

తిరుమల, అక్టోబర్ 3: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి , ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వార్లని ఏపీ క్రీడలు, పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా ఈరోజు విశాఖ శ్రీ శారదాపీఠాన్ని సందర్శించారు. శారదా పీఠంలో శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామిజీ ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ? రాష్ట్రంలో భక్తులకు పుణ్యక్షేత్రాల దర్శనం కోసం పర్యాటక శాఖ ద్వారా పర్యాటకంగా తీసుకుంటున్నటువంటి చర్యలు స్వామివారికి వివరించారు. స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి పర్యాటక శాఖ మంత్రిగా రోజా పుణ్యక్షేత్రాల్లో భక్తుల సౌకర్యార్థం తీసుకుంటున్నటువంటి చర్యలు తన దృష్టికి వచ్చాయని చాలా బాగా అభివృద్ధి చేస్తున్నారని రోజాని అభినందించారు.

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పుష్ప నివాళులు అర్పించిన డీఆర్‌డిఒ చైర్మన్, అధికారులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీలోని డిఆర్ డిఒ కేంద్ర కార్యాలయమైన డిఆర్‌డిఒ భవన్ సెంట్రల్ హాలులో గాంధీ చిత్రానికి డిడిఆర్ ఢ డి ఢ చైర్మన్ డిఆర్‌డిఒ డాక్టర్ సమీర్ వి కామత్, డైరెక్టర్ జనరళ్ళు, ఇతర అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెండింగ్‌లో ఉన్న వ్యవహారాలను పరిష్కరించడం, పారిశుద్ధ్యం గురించి ప్రత్యేక ప్రచారాన్ని డిఆర్‌డిఒ నేడు ప్రారంభించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన పెండింగ్ సూచనలు, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన పెండింగ్ సూచనలు, అంతర్ మంత్రిత్వ శాఖల సూచనలు (కేబినెట్ నోట్), 03 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పార్లమెంటరీ హామీలు, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలు, అప్పీళ్ళు, పారిశుద్ధ్య ప్రదేశాల గుర్తింపు, స్పేస్ నిర్వహణ ప్రణాళిక, చెత్త పారవేయడం తదిరాల వంటి నిర్దిష్ట పెండెన్సీ పై ప్రత్యేక ప్రచారాన్ని రికార్డుల నిర్వహణ (రికార్డుల డిజిటైజేషన్)పై ప్రత్యేక దృష్టిని ఈ సందర్భంగా చేపడతారు. ఈ చొరవను 2 అక్టోబర్ 2022 నుంచి 31 అక్టోబర్ 2022 వరకు రక్షణ మంత్రిత్వ శాఖ చేపట్టిన స్వచ్ఛత 2.0 ప్రత్యేక ప్రచారంలో భాగం.

అంతేకాకుండా, ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ (ఎఫ్ఐఎఫ్ఆర్) 3.0లో భాగంగా నేడు డిఆర్‌డిఒ కేంద్ర కార్యాలయంలో ఫిట్ ఇండియా ఫ్లాగ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఫ్లాగ్ రన్‌లో 250మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. ఈ చొరవ ద్వారా, ఫిండ్ ఇండియా మిషన్ స్వచ్ఛ భారత్ అభియాన్‌తో కలుస్తుంది. వివిధ డిఆర్‌డిఒ కేంద్ర కార్యాలయ డైరెక్టొరేట్లు పారిశుద్ధ్య డ్రైవ్‌లను తమ తమ ప్రాంతాలు, కార్యాలయాలలో చేపట్టారు.

పెరిగిన పత్తి విస్తీర్ణం.. రాష్ట్రవ్యాప్తంగా 16.5 లక్షల ఎకరాల్లో సాగు

అమరావతి: అక్టోబర్ 3:రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. 2022–23 సీజన్ లో రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణాన్ని 14.73 లక్షల ఎకరాలుగా నిర్ధారించగా సుమారు 17 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టినట్టు– అంచనా. అధికారిక లెక్కల ప్రకారం ఖరీఫ్ సీజన్ లో 6,53,150 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగయింది. గత ఏడాది ఖరీఫ్ లో 4,99,512 హెక్టార్లలో సాగవుగా ఈ సీజన్ లో 53 వేల హెక్టార్లకు పైగా సాగు విస్తీర్ణం పెరిగింది. 2014–15 సంవత్సరంలో 16.35 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేపట్టగా ఏడేళ్ళ తరువాత ఆ రికార్డును ఈ ఏడాది రైతులు బ్రేక్ చేశారు.

బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటు రాయలసీమలో వేరుశెనగకు బదులు ప్రత్యామ్నాయంగా కొన్ని చోట్ల పత్తి సాగు చేపట్టటం విస్తీర్ణం పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఖరీఫ్ లో పత్తి సాగుకు వాతావరణం అనుకూలంగా మారటంతో విస్తీర్ణంతో పాటు దిగుబడి కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా. దాదాపు ఇదే విస్తీర్ణం సాగు చేసినపుడు 2014–15లో 15 లక్షట టన్నుల దిగుబడి రాగా ఈ ఏడాది సుమారు 18 లక్షల టన్నుల దిగుబడి రావచ్చని అంచనా. సీజన్ పూర్తయ్యే నాటికి దిగుబడి 20 నుంచి 21 లక్షల టన్నులకు చేరువ కావచ్చని అధికారులు భావిస్తున్నారు. పత్తి సాగును అత్యధికంగా చేపట్టే కర్నూలు, గుంటూరు జిల్లాల్లో ఎకరాకు గరిష్టంగా 20 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని అంచనా.

పత్తికి ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల కన్నా బహిరంగ మార్కెట్లో అధిక ధర లబిస్తోంది. గత ఏడాది గరిష్టంగా టన్ను రూ 13 వేలు పలికిన ధర ఈ సంవత్సరం రూ 9,500 నుంచి 10,000 వద్ద కొనసాగుతోంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో ఇపుడున్న డిమాండ్ ను బట్టి పత్తి ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. అందువల్లనే ఇపుడున్న ధరకు కొనుగోలు చేసి స్టాకు చేసుకునేందుకు ట్రేడర్లు మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల కన్నా బహిరంగ మార్కెట్లో రూ 3 వేల కు మించి అధికంగా ధరలు ఉండటంతో రైతులు కూడా ప్రయివేట్ ట్రేడర్లకు పత్తిని విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం పొడుగుపింజ రకం పత్తికి టన్నుకు రూ 6,380, మధ్యస్థ పత్తికి రూ 6.080 గా కనీస మద్దతు ధరను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ రెండు రకాల పత్తిని రైతులు మార్కెట్లోనే విక్రయిస్తున్నారు.కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా పత్తి కొనుగోళ్ళకు రంగం సిద్ధం. సీసీఐ మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు మాత్రమే పత్తిని కొనుగోలు చేయనుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో 34 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం జిల్లాల్లో 34 కేంద్రాలను సీసీఐ ప్రారంభించింది. అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డు, జిన్నింగ్ మిల్లుల్లోనూ సీసీఐ మద్దతు ధరలకు పత్తిని కొనుగోలు చేయనుంది. రాష్ట్రంలో అత్యధికంగా పొడవు పింజ రకాన్నే రైతులు సాగు చేస్తుంటారు. పొడవు పింజ పత్తికి సీసీఐ క్వింటాకు రూ 6,380 చెల్లించనుంది. సీసీఐ ద్వారా పత్తిని అమ్మదల్చుకున్న రైతులు సమీప రైతు భరోసా కేంద్రాలను సందర్శించి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటు–ంది. ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పంటను సిసిఐ కొనుగోలు చేయనుంది.

మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించిన మాక్సివిజన్ ఐ హాస్పిటల్స్

హైదరాబాద్, అక్టోబర్ 3: భారతదేశంలోని ప్రముఖ కంటి ఆసుపత్రుల గొలుసు మాక్సివిజన్, రోగుల సౌలభ్యం కోసం మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించింది. రోగులు ఇప్పుడు వారి వైద్య డేటాను డౌన్‌లోడ్ చేయగల సామర్థ్యం, ??డాక్టర్ అపాయింట్‌మెంట్‌లను షెడ్యూల్ చేయడం, శస్త్రచికిత్స అనంతర సూచనలను స్వీకరించడం, మందుల రిమైండర్‌లను స్వీకరించడం వంటి అనేక ఎంపికలకు ప్రాప్యతను కలిగి ఉంటారు. ఈసందర్భంగా మాక్సివిజన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ సీఈఓ వీఎస్. సుధీర్ మాట్లాడుతూ నాణ్యమైన కంటి సంరక్షణ సేవల కోసం వెతుకుతున్న గరిష్ట సంఖ్యలో రోగులను చేరుకోవడమే మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించడం తమ లక్ష్యమన్నారు. పేషెంట్లు ఇప్పుడు తమ ఇంటి వద్ద నుండి వారి ఇష్టపడే డాక్టర్‌తో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోగల ఁన్నారు. ఈ యాప్ పరిచయంతో, కంటి సంరక్షణలో తమ డిజిటల్ టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో, తమ సేవలను మునుపటి కంటే సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో తాము కొత్త పేజీని మార్చామన్నారు.

బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలి : మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి): బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలనే రూ.2 కోట్లతో 20 చోట్ల బతుకమ్మ నిమజ్జనం పాయింట్లు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. 11వ డివిజన్ గౌతమి నగర్ కాలనీలో మానేరు డ్యామ్ కట్ట వద్ద నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ మెట్లు, రైలింగ్ నుబీసీ సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. తెలంగాణలో పూలను పూజించే పండుగ బతుకమ్మ అన్నారు. నూతనంగా ఐదు లక్షలతో బతుకమ్మ ఘాట్ నిర్మాణం చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. తెలంగాణలో అన్ని మతాల పండుగలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం -మున్సిపల్ సమన్వయంతో ఘనంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్, లైటింగ్ ,ప్రమాదాల నివారణకు గజ ఈత గాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మంత్రి గంగుల తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా-నర్సయ్య, టీఆర్ఎస్ నాయకులు చల్ల హరి శంకర్, ఎడ్ల అశోక్ , కోల సంపత్ , డివిజన్ వాసులు పాల్గొన్నారు.

మునుగోడులో భారీ మెజార్టీతో గెలుస్తాం-కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 3:మునుగోడులో భారీ మెజార్టీతో గెలుస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ? మునుగోడు ఉప ఎన్నికకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. రైతుల కరెంట్ మోటార్లకు మీటర్లు పెట్టాలని తమ ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఎంఐఎంను బలోపేతం చేసేందుకే కేసీఆర్ జాతీయ పార్టీ అన్నారు. టీఆర్ఎస్ పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. వైఫల్యాల నుంచి చర్చ మరల్చేందుకే కేసీఆర్ పార్టీ అని కిషన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తో దేశంలో ఏ పార్టీ కలిసి రావడం లేదన్నారు. కేసీఆర్ కాళ్ల కింద భూమి కదులుతోందన్నారు. తెలంగాణలో ఫాంహౌస్ ల పాలన పోవడం ఖాయమన్నారు.

ఏపీకి రూ.1453 కోట్లు బకాయిల చెల్లింపునకు కేంద్రం అంగీకారం

తిరుమల, అక్టోబర్ 3: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు రూ.1453 కోట్లు చెల్లించటానికి కేంద్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి బుడి ముత్యాల నాయుడు తెలిపారు. కేంద్ర మంత్రి తిరుమల తిరుపతి పర్యటనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం తిరుపతి పద్మావతి అతిథి గృహంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పార్లమెంటు సభ్యులు చిత్తూరు ? రెడ్డప్ప, తిరుపతి డా.గురుమూర్తి , అనకాపల్లి ? సత్యవతి జెసి డీకే బాలాజీ, రాష్ట్ర డైరెక్టర్ చిన్న తాతయ్య, జిల్లా అధికారులు కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి మీడియాకు వివరిస్తూ కేంద్ర మంత్రి తిరుపతి పర్యటన సందర్భంగా వారికి స్వాగతం పలికి రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలకు కేంద్రం నుండి రావలసిన బకాయిలను, కేంద్ర అనుసంధాన పథకాలలో పేదలకు కొన్ని వెసులుబాటు కోసం వినతి పత్రం అందించామని వివరించారు.

పండ్ల తోటల రైతులకు 5 ఎకరాల వరకే వెసులుబాటు ఉందని 10 ఎకరాలు ఉన్న వారిని పెద్ద రైతులుగా గుర్తిస్తున్నామని అయినా వాళ్ళు పంటలు పండక పేద రైతులు గానే ఉండిపోతున్నారని పరిశీలించి 10 ఎకరాలకు అర్హత కలిగేలా ఆదేశాలు ఇవ్వాలని కోరామని అన్నారు. గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ తోటలకు కూడా ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని అప్పుడే గిరిజనులకు మేలు కలుగుతుందని తెలిపామని అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన క్రింద గృహ నిర్మాణాలకు ఇస్తున్న 90 రోజులు పని దినాలను 100 రోజుల పని దినాలతో కలపకుండా అదనంగా ఉపాధి కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఎస్టీలలో అత్యంత వెనుకబడిన వారు చెంచు జాతులని వారికి ఉపాధి హామీ పనులు 200 రోజులు వర్తించేలా కోరామని తెలిపారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ఫేస్ 1 కింద పనులను రానున్న మార్చి వరకు పొడిగించాలని దాదాపు 624 కిలోమీటర్లు రోడ్లు వేయవలసి ఉందని సూచించామని అన్నారు. ఫేస్ ఎఎఎ కింద 970 కిలోమీటర్లు 76 బ్రిడ్జిల నిర్మాణాలకి ప్రతిపాదనలు పంపేమని మంజూరు చేయాలని కోరమని తెలిపారు. నేషనల్ రూర్బన్ మిషన్ కింద రూ. 48 కోట్లు వెనక్కు తీసుకోవడంతో రూ. 145 కోట్లు చెల్లింపులు ఆగాయని త్వరగా మంజూరు చేయాలని కోరమని అన్నారు. దీన దయాల్ అంత్య యోజన -జాతీయ గ్రామీణ ఉపాధుల మిషన్ శిక్షణ నిచ్చే ఏజెన్సీలకు రూ.5.81 కోట్లు కేంద్రం నుండి రావాల్సి ఉ

కేంద్రం అవార్డులే మా పని తనానికి నిదర్శనం : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, అక్టోబర్ 3:మిషన్ భగీరథ, పంచాయతీరాజ్‌శాఖకు వచ్చిన కేంద్ర అవార్డులే తమ పని తనానికి నిదర్శనమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఖైతరాబాద్‌లోని రంగారెడ్డి జడ్పీ కాన్ఫరెన్స్‌లో హాలులో జరిగిన కార్యక్రమం అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు తాగునీటికి ఎంతో కష్టాలు పడ్డారని, మహిళల బిందెలు పట్టుకొని ఎంతోదూరం నడుచుకుంటూ వెళ్లేవారని గుర్తు చేశారు. అసెంబ్లీలోనూ విషయంపై చర్చలు జరుగుతుండేవన్నారు. కేంద్రం ఎన్నోసార్లు రాష్ట్రాన్ని అభినందించి.. పార్లమెంట్‌లో సైతం రాష్ట్ర అభివృద్ధిని కొనియాడారని, అభివృద్ధిలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. కేంద్రం ఢిల్లీలో అభినందిస్తూ గల్లీలో విమర్శిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కేంద్రం అవార్డులు ఇస్తే రాష్ట్ర నాయకులు ఫేక్ లెటర్లు క్రియేట్ చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గాంధీ జయంతి రోజున తెలంగాణకు అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. మిషన్ భగీరథకు కేంద్ర పురస్కారం రావడంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ హనుమంతరావు, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డితో పాటు పలువురు అధికారులను మంత్రి అభినందించారు.

2022 సెప్టెంబర్ నెలలో అత్యధికంగా 115.80 ఎంటీ సరుకులు రవాణా చేసిన రైల్వే

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: సరుకు రవాణాలో భారతీయ రైల్వే 2022 సెప్టెంబర్ నెలలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. సెప్టెంబర్ నెలలో 115.80 ఎంటీ సరుకులు రైల్వే ద్వారా రవాణా అయ్యాయి. ఒక నెలలో ఇంత పరిమాణంలో సరుకులు రవాణా కావడం ఇదే తొలిసారి. 2021 సెప్టెంబర్ నెలతో పోల్చి చూస్తే సరుకు రవాణా 9.15% వరకు పెరిగింది. 2021 లో జరిగిన సరుకు రవాణా కంటే 2022 సెప్టెంబర్ నెలలో 9.7 ఎంటీ ఎక్కువ సరుకులు రవాణా అయ్యాయి. దీంతో వరుసగా 25 నెలల పాటు అత్యుత్తమ నెలవారీ సరుకుల రవాణా చేయడంలో రైల్వే విజయం సాధించింది.

సెప్టెంబర్ నెలలో బొగ్గు రవాణా మొత్తం 6.8 ఎంటీ వరకు పెరిగింది. ఇనుప ఖనిజం రవాణా 1.2 ఎంటీ, ఇతర సరుకుల రవాణా 1.22 ఎంటీ, సిమెంట్ రవాణా , కంకర రవాణా 0.4 ఎంటీ, ఎరువుల రవాణా 0.3 ఎంటీ వరకు వృద్ధి సాధించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రైల్వే ద్వారా వాహనాల రవాణా పెరుగుదల నమోదు చేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నెల వరకు రైల్వే 2712 రేకుల ద్వారా వాహనాలను రవాణా చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో 1575 రేకుల ద్వారా వాహనాలు రవాణా అయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే 2022-23 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నెల వరకు వాహనాల రవాణా 72.2 %.వృద్ధి నమోదు చేసింది.

1 ఏప్రిల్ 2022 నుంచి 30 సెప్టెంబర్ 2022 వరకు 736.68 ఎంటీ సరుకులు రైల్వే ద్వారా రవాణా అయ్యాయి. 2021-22 లో ఇదే కాలంలో 668.86 ఎంటీ సరుకులు రైల్వే ద్వారా రవాణా అయ్యాయి. 2021-22 ఇదే కాలంలో జరిగిన సరుకు రవాణాతో పోల్చి చూస్తే 2022-23 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు రవాణా 67.83 ఎంటీ వరకు పెరిగి 10.14% వృద్ధి నమోదు చేసింది. సరుకు రవాణా నికర టన్ను కిలోమీటర్లు సెప్టెంబర్ '21 లో 63.43 బిలియన్ల వరకు ఉన్నాయి. సెప్టెంబర్' 22 నాటికి నికర టన్ను కిలోమీటర్లు 69.97 బిలియన్లకు పెరిగి 10.3% వృద్ధిని నమోదు చేశాయి. సంవత్సరం మొదటి అర్ధ భాగంలో సంచిత సరుకు రవాణా నికర టన్ను కిలోమీటర్లు 17.1% వృద్ధి నమోదు చేశాయి.

విద్యుత్ మరియు బొగ్గు మంత్రిత్వశాఖలతో సన్నిహిత సమన్వయంతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు సరఫరాను పెంచడానికి భారతీయ రైల్వేలు చేస్తున్న నిరంతర ప్రయత్నాలు సెప్టెంబర్ నెలలో సరుకు రవాణా పెరుగుదలకు సహాయ పడ్డాయి.గత సంవత్సరం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు 35.8 ఎంటీ బొగ్గు రవాణా అయ్యింది. 2022-23 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ నెల వరకు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు 42.00 ఎంటీ బొగ్గు రవాణా అయ్యింది. 17.3% వృద్ధితో సెప్టెంబరులో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు జరిగిన (దేశీయ మరియు దిగుమతి చేసుకున్న) బొగ్గు రవాణా 6.2 ఎంటీ వరకు పెరిగింది. సంవత్సరం మొదటి అర్ధ భాగంలో గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే భారతీయ రైల్వే 64.53 ఎంటీ అదనపు బొగ్గును విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు రవాణా చేసి 29.3% మించి వృద్ధిని సాధించింది.

దేశ అవసరాలకు సరిపడా ఆహారధాన్యాల నిల్వలు అందుబాటులో ఉన్నాయి: కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: గత వారం దేశంలో గోధుమలు మరియు బియ్యం చిల్లర, టోకు ధరలు తగ్గాయి. గోధుమ పిండి ధరలు లో స్థిరంగా ఉన్నాయి.కనీస మద్దతు ధర పెరగడంతో గత రెండు సంవత్సరాల ంగా గోధుమలు, బియ్యం ధరలు ఎక్కువ లేదా తక్కువ పెరిగాయి. ధరలు నియంత్రించడానికి 2021-22 లో ఒఎంఎస్ఎస్ ద్వారా బహిరంగ మార్కెట్ లోకి 80 ఎల్ఎంటీ ఆహార ధాన్యాలను విడుదల చేయడంతో ధరలు తక్కువగా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం గోధుమలు మరియు బియ్యం తో సహా నిత్యావసర వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది.

గతంలో ఎన్నడూ లేని విధంగా నెలకొన్న అంతర్జాతీయ రాజకీయ అనిశ్చితి కారణంగా ఆహార భయాల సేకరణ తక్కువగా ఉండడంతో ఇంతవరకు ఒఎంఎస్ఎస్ ద్వారా బహిరంగ మార్కెట్ పరిస్థితిలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. అయితే, ప్రతి వారం ధరల పరిస్థితిని సమీక్షిస్తున్న కేంద్రం ధరలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉంది. ధరలు మరింత పెరగకుండా చూడడానికి ప్రభుత్వం 13.05.2022 నుంచి గోధుమ ఎగుమతులు, 08.05.2022 నుంచి బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఈ చర్యతో గోధుమ, బియ్యం ధరలు తక్షణమే నియంత్రణలోకి వచ్చాయి.

ధరలను అదుపు చేసేందుకు మరియు సమాజంలో బలహీన వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ ఆన్ యోజన (ఖఓఉఐంజ)ని మరో మూడు నెలల పాటు (దశ ఎఎ) అక్టోబర్ 2022 నుంచి డిసెంబర్ 2022 వరకు పొడిగించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దేశంలోని పేదలు మరియు నిరుపేదలకు రాబోయే పండుగ కాలంలో ఎలాంటి సమస్యలు ఎదురుకావు. ప్రతికూల మార్కెట్ శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కలుగుతుంది. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఔఈూం), ఇతర సంక్షేమ పథకాలు మరియు ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ ఆన్ యోజన కింద సరఫరా చేయాల్సి ఉన్న అదనపు అవసరాలకు అవసరమైన ఆహార ధాన్యాల నిల్వలు కేంద్ర పూల్‌లో అందుబాటులో ఉన్నాయని మరియు ధరలు నియంత్రణలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం వివరించింది.

యుఎల్ఐపిపై డాటాను పొందేందుకు 13 సంస్థలు గోప్యత ఒప్పందం (ఎన్‌డిఏ) సంతకాలు చేయడంతో అద్భుత స్పందనను అందుకున్న యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫాం (యుఎల్ఐపి)

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జాతీయ లాజిస్టక్స్ పాలసీ (ఎన్ఎల్‌పీ)లో భాగంగా 17 సెప్టెంబర్ 2022న ప్రారంభించిన యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫస్ ప్లాట్‌పార్మ్ (యుఎల్ఐపి - ఏకీకృత లాజిస్టిక్స్ వినిమయ సీమ వేదిక) లాజిస్టిక్స్ ప్రక్రియలను సరళీకృతం చేయడం, దాని సామర్థ్యాన్ని పెంచడం, పారదర్శకతను, దృగ్గోచరతను తీసుకువచ్చందుకు, లాజిస్టిక్స్ వ్యయం ఠ సమయాన్ని తగ్గించడం ద్వారా లాజిస్టిక్స్ రంగంలో వ్యాపారం చేయడాన్ని సులభతరం చేయడాన్ని లక్ష్యంగా చేపట్టిన చొరవ.

ఈ వేదికకు పరిశ్రమ నుంచి అద్భుతమైన ప్రతిస్పందన వస్తోంది. నేటి వరకూ, 13 సంస్థలు - మ్యాప్ మై ఇండియా, కార్గో ఎక్స్‌చేంజ్, ఫ్రీట్ ఫాక్స్, కానమూవ్, ఇంట్యూజెన్, ఈకోనాటెక్, ఎస్ బ్యాంక్, సూపర్ ప్రొక్యూర్, కార్గో శక్తి, క్లౌడ్ స్ట్రాట్స్, షిప్‌లైట్, ఎపిఎస్ఇజెడ్ ఎల్, ఎఐటిడబ్ల్యుఎలు యుఎల్ఐపి పై డాటా సమాచారాన్ని పొందేందుకు నాన్- డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ (ఎన్‌డిఎ - గోప్యంగా ఉంచేందుకు ఒప్పందం)పై సంతకాలు చేశాయి. ఇన్‌స్టావ్యాన్స్‌డ ట్రిక్స్, బోష్ ఇండియా, పోర్ట్‌లింక్స్, షిప్‌రాకెట్ తదితరాలతో సహా మరొక 11 సంస్థలతో ఎన్‌డిఎల ప్రక్రియ సాగుతోంది.

ఈ రంగానికి నూతన పరిష్కారాలను సృష్టించేందుకు స్టార్టప్‌లు నూతన ఐడియాలను ప్రదర్శించేందుకు సంసిద్ధమవుతుండగా, పెద్ద పెద్ద వాణిజ్య సంస్థలు సంక్లిష్టమైన లాజిస్టిక్స్ ప్రక్రియలను సరళీకృతం చేసేందుకు, విక్రేతల పత్రాలను ధృవీకరించడం, సరుకు తరలింపు దృశ్యమానతను పొందడం కోసం యుఎల్ఐపితో ఏకీకృతం కావడం గురించి యోచిస్తున్నాయి.

వివిధ మంత్రిత్వ శాఖల వద్ద అంబాటులో ఉన్న లాజిస్టిక్స్, వనరులకు సంబంధించిన సమాచారాన్ని సురక్షితంగా పొందేందుకు యుఎల్ఐపి వేదిక పారిశ్రామికవేత్తలను అనుమతిస్తుంది. ప్రస్తుతం ఏడు మంత్రిత్వ శాఖల నుంచి 30 వ్యవస్థలు దాదాపు 100కు పైగా ఎపిఐల ద్వారా 1600 డాటా క్షేత్రాలను ఆవరిస్తూ భాగస్వాముల వినియోగం కోసం ఏకీకృతం చేశారు.

డాటా కోసం చేసే విజ్ఞప్తి ప్రక్రియను సరళతరం, వేగవంతం, పారదర్శకం చసందుకు కట్టుబడిన పోర్టల్ యుఎల్ఐపికి ఉంది. ఈ పోర్టల్‌ను "ప్తబిబిజూబ:/ /ఐనీబీశ్రీతిజూ.తిని/" అన్న లింక్‌ను క్లిక్ చేయడం ద్వారా చూడవచ్చు. ఈ పోర్టల్‌పై నమోదు చేసుకోవాలనుకునే పారిశ్రామికవేత్తలకు తోడ్పాటునందించేందుకు ఇరవై నాలుగు గంటలూ అంకితభావంతో పని చేస్తున్న సహాయక బృందం ఉన్నది. నమోదు అనంతరం, యూజర్లు తమ యూజ్- కేసులను సమర్పించవలసి ఉంటుంది. విజ్ఞప్తి చేసిన డాటా ప్రతిపాదిత వినియోగం ఆధారంగా వీటిని సమీక్షిస్తారు. విజయవంతమైన సమీక్ష అనంతరం, డాటా కోసం విజ్ఞప్తి చేసే యూజర్లు నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్ (ఎన్‌డిఎ) పై సంతకాలు చేయవలసి ఉంటుంది. ఎన్డీయేపై సంతకాలు చేసిన తర్వాత పారిశ్రామికవేత్తలు యుఎల్ఐపితో ఏకీకృతం కావడం కోసం ఎపిఐలను అభివృద్ధి చేయవచ్చు. వ్యవస్థ భద్రత పరీక్ష, విలీనీకరణ ద్వారా వివిధ ప్రభుత్వ రంగాల నుంచి యుఎల్ఐపి ద్వారా ప్రామాణికమైన డాటాను పొందవచ్చు.

లాజిస్టిక్స్ భాగస్వాములందరికీ ఒక్క క్లిక్‌లోనే డ్రైవర్లు, వాహనాల ధ్రువీకరణ, పంపిన సరుకు ట్రాకింగ్ ఠ ట్రేసింగ్, సానుకూల మార్గానికి ప్రణాళిక, సరుకు గమ్యం చేరే వివిధ దశలకు సంబంధించి సకాలంలో నవీకరణ, కాగితం పని తగ్గింపు, ఖాళీ కారియర్ఠ కంటైనర్ దృశ్యమానత, జాబితా నిర్వహణ తదితరాల ద్వారా యుఎల్ఐపి ప్రత్యక్ష, పరోక్ష లబ్ధిని చేకూరుస్తుంది. నియంత్రణ, దస్తావేజు, ఇతర జాప్యాలను తగ్గించడం ద్వారా యుఎల్ఐపి వ్యవస్థీకృత ప్రణాళిక ప్రారంభించేందుకు వాంఛనీయ లాజిస్టిక్స్ వినియోగ పద్ధతులపై నిర్ణయాలను తీసుకునేందుకు తోడ్పడి వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేస్తుంది.

సమాచారాన్ని ప్రజాస్వామీకరించడం ద్వారా, ఆదాయ ఉత్పత్తికి మార్కెట్‌ను సృష్టించడంతో పాటుగా, గుత్తాధిపత్యం, అపరిమితమైన ప్రయోజనాన్ని రద్దు చేయడాన్ని యుఎల్ఐపి లక్ష్యంగా పెట్టుకుంది. అత్యల్ప, వ్యక్తిగత స్థాయిల్లో సానుకూల ఫలితాలను సాధించడం అన్నది జిడిపిలో లాజిస్టిక్స్ వ్యయ శాతంతో పాటు భారత లాజిస్టిక్స్ రంగం మొత్తంపై భారీ నిర్మాణాత్మక ప్రభావాన్ని కలిగి ఉండడంతో సహా భారతీయ, అంతర్జాతీయ లాజిస్టిక్స్ సూచీలను పెంచుతుంది.

నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణపై వినియోగదారుల వ్యవహారాల విభాగం జాతీయ స్థాయి సామర్థ్య నిర్మాణానికి సంబంధించిన వర్క్‌షాప్‌ను నిర్వహించింది

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ 30 సెప్టెంబర్, 2022న ఢిల్లీలో ధరల పర్యవేక్షణపై ఒక రోజు సామర్థ్యం పెంపుదల వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ధరల సేకరణ భౌగోళిక కవరేజీని పెంచడానికి, ధర డేటా నాణ్యతను దాని విశ్లేషణాత్మక ఉత్పత్తిని మెరుగుపరచడానికి చొరవలో వర్క్‌షాప్ ఒక భాగం. వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యం ధరల డేటా ప్రాముఖ్యత గురించి రాష్ట్ర నోడల్ అధికారులకు అవగాహన కల్పించడం, ధరల సేకరణకు సంబంధించిన పద్ధతి గురించి వారికి అవగాహన కల్పించడం ధరల నివేదిక కేంద్రాల కోసం జోనల్/రాష్ట్ర స్థాయిలో తదుపరి సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్‌ల కోసం ప్రణాళికను రూపొందించడం.

ఈ సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ధరల డేటాను సేకరించి నివేదించే ప్రశంసనీయమైన పని చేసిన రాష్ట్ర ప్రతినిధులందరినీ అభినందించారు. ధర పర్యవేక్షణ ప్రాముఖ్యత, నివేదించబడిన ధర డేటా నాణ్యత వివిధ విధాన నిర్ణయాలలో డేటాను ఉపయోగించే విధానం చాలా ముఖ్యమని ఆయన చెప్పారు. ధరల డేటా నాణ్యత, క్రమబద్ధతపై దృష్టి సారించాలని రాష్ట్ర నోడల్ అధికారులకు ఆయన సూచించారు. దేశంలోని అన్ని జిల్లాల్లో ధరల డేటా సేకరణ కేంద్రాలు ఉండటం వల్ల సమాచారం మెరుగైన ప్రాతినిధ్యం ఉంటుందని కూడా వివరించారు. పీఎండీ అప్‌గ్రేడేషన్‌కు సాంకేతిక మద్దతును ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ అందిస్తోంది. క్రిషన్ సింగ్ రౌతేలా మాట్లాడుతూ ఏడీబీ అందించిన మద్దతు వివరాలు సామాజిక రక్షణ కోసం ధరల పర్యవేక్షణ ముఖ్యమని అన్నారు. సాంకేతిక సెషన్లలో, ధరల సేకరణ యాప్, సేకరణ ప్రక్రియలో సవాళ్లు, టెక్ ఎనేబుల్డ్ డేటా విజువలైజేషన్ డ్యాష్‌బోర్డ్‌లపై వివరణాత్మక చర్చలు నిర్వహించడం జరిగింది. ధరల విధానాల గురించి రాష్ట్ర నోడల్ అధికారులతో చర్చించారు.

డిపార్ట్‌మెంట్‌లోని పరిణామాలు, ధరల సేకరణ యంత్రాంగానికి సంబంధించిన మార్గదర్శకాలు పటిష్టమైన ధరల సేకరణ యంత్రాంగాన్ని నిర్మించడానికి రాష్ట్రాలలో కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌ల నిర్వహణ కోసం రోడ్‌మ్యాప్‌ను అభివృద్ధి చేయడం గురించి వారి సందేహాలను పరిష్కరించడం ద్వారా రాష్ట్ర నోడల్ అధికారులతో సంప్రదింపులతో ఈవెంట్ ముగిసింది. ముగింపు వ్యాఖ్యలలో, ఆర్థిక సలహాదారు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్స్యూమర్ అఫైర్స్, కె గైట్, రిపోర్ట్ చేయబడిన డేటా నాణ్యత ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ సేకరణ కేంద్రం నుండి ధరల సేకరణలో వారి అపారమైన మద్దతు సహకారం కోసం పాల్గొనేవారికి ధన్యవాదాలు తెలిపారు.

నన్ను ఆదరించి అసెంబ్లీకి పంపారు.. నిన్ను ఓడగొట్టారు.. ఎమ్మెల్యే దాసరి..

కరీంనగర్, అక్టోబర్ 3 (నేటినిజం ప్రతినిధి): నియోజకవర్గ ప్రజలకు తానేంటో తెలుసని.. అందుకే ప్రజలు తనను ఆదరించి రెండుసార్లు అసెంబ్లీకి పంపి.. నిన్ను ఓడగొట్టి ఇంట్లో కూర్చొబెట్టారని మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావును ఉద్దేశించి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ? పెద్దపల్లి ప్రజలకు దాసరి మనోహర్ రెడ్డి అంటే ఏంటో తెలుసని.. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా రెండోసారి ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. 2009లో ఒక్కసారి ప్రజలు అవకాశమిస్తే నీ అరాచకాలను చూసి బెంబేలెత్తిపోయి 2014, 2018 ఎన్నికల్లో ఓడగొట్టారన్నారు.అవినీతికి విజయ రమణారావు కేరాఫ్ అడ్రస్ అనే విషయం ఆయనతో నిత్యం తిరిగే నాయకులతో పాటు పెద్దపల్లి ప్రజలందరికీ తెలుసన్నారు. ఇసుక టెండర్లు పూర్తి కాగానే రీచ్ ల సందర్శన అంటూ హడావిడి చేసి కొన్ని నెలలుగా మౌనంగా ఎందుకు ఉన్నావని ప్రశ్నించారు. మానేరు పరివాహక ప్రజలందరికీ ఉచితంగా ఇసుక తీసుకువెళ్లే సదుపాయం ఉందన్నారు. ఈ విషయం తెలియక మాజీ ఎమ్మెల్యే ప్రజలకు ఇసుక దొరకడం లేదని, డబ్బులు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రజాభిమానం కోల్పోవడం వల్ల మూడవసారి ఓటమి కళ్ళ ముందు కనబడి మతిభ్రమించి తెరాస నాయకులపై అసత్యపు ప్రచారాలు చేస్తున్నావని, ఎన్ని అబద్ధాలు ఆడినా ప్రజల విశ్వాసం పొందలేవన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు నిన్ను నమ్మే పరిస్థితిలో లేరని, రెండుసార్లు ఓడగొట్టారని మూడోసారి కూడా ఓడకొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని భవిష్యత్తులో ఎన్నడూ కూడా ఎమ్మెల్యే కాలేవన్నారు. ఈ సమావేశంలో తెరాస ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిగిన పత్తి విస్తీర్ణం.. రాష్ట్రవ్యాప్తంగా 16.5 లక్షల ఎకరాల్లో సాగు

అమరావతి: అక్టోబర్ 3:రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. 2022-23 సీజన్ లో రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణాన్ని 14.73 లక్షల ఎకరాలుగా నిర్ధారించగా సుమారు 17 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టినట్టు- అంచనా. అధికారిక లెక్కల ప్రకారం ఖరీఫ్ సీజన్ లో 6,53,150 హెక్టార్ల విస్తీర్ణంలో పత్తి సాగయింది. గత ఏడాది ఖరీఫ్ లో 4,99,512 హెక్టార్లలో సాగవుగా ఈ సీజన్ లో 53 వేల హెక్టార్లకు పైగా సాగు విస్తీర్ణం పెరిగింది. 2014-15 సంవత్సరంలో 16.35 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేపట్టగా ఏడేళ్ళ తరువాత ఆ రికార్డును ఈ ఏడాది రైతులు బ్రేక్ చేశారు.

బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటు రాయలసీమలో వేరుశెనగకు బదులు ప్రత్యామ్నాయంగా కొన్ని చోట్ల పత్తి సాగు చేపట్టటం విస్తీర్ణం పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఖరీఫ్ లో పత్తి సాగుకు వాతావరణం అనుకూలంగా మారటంతో విస్తీర్ణంతో పాటు దిగుబడి కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా. దాదాపు ఇదే విస్తీర్ణం సాగు చేసినపుడు 2014-15లో 15 లక్షట టన్నుల దిగుబడి రాగా ఈ ఏడాది సుమారు 18 లక్షల టన్నుల దిగుబడి రావచ్చని అంచనా. సీజన్ పూర్తయ్యే నాటికి దిగుబడి 20 నుంచి 21 లక్షల టన్నులకు చేరువ కావచ్చని అధికారులు భావిస్తున్నారు. పత్తి సాగును అత్యధికంగా చేపట్టే కర్నూలు, గుంటూరు జిల్లాల్లో ఎకరాకు గరిష్టంగా 20 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని అంచనా.

పత్తికి ఈ ఏడాది ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరల కన్నా బహిరంగ మార్కెట్లో అధిక ధర లభిస్తోంది. గత ఏడాది గరిష్టంగా టన్ను రూ 13 వేలు పలికిన ధర ఈ సంవత్సరం రూ 9,500 నుంచి 10,000 వద్ద కొనసాగుతోంది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో ఇపుడున్న డిమాండ్ ను బట్టి పత్తి ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. అందువల్లనే ఇపుడున్న ధరకు కొనుగోలు చేసి స్టాకు చేసుకునేందుకు ట్రేడర్లు మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల కన్నా బహిరంగ మార్కెట్లో రూ 3 వేల కు మించి అధికంగా ధరలు ఉండటంతో రైతులు కూడా ప్రయివేట్ ట్రేడర్లకు పత్తిని విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం పొడుగుపింజ రకం పత్తికి టన్నుకు రూ 6,380, మధ్యస్థ పత్తికి రూ 6.080 గా కనీస మద్దతు ధరను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ రెండు రకాల పత్తిని రైతులు మార్కెట్లోనే విక్రయిస్తున్నారు.

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా పత్తి కొనుగోళ్ళకు రంగం సిద్ధం. సీసీఐ మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు మాత్రమే పత్తిని కొనుగోలు చేయనుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో 34 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం జిల్లాల్లో 34 కేంద్రాలను సీసీఐ ప్రారంభించింది. అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డు, జిన్నింగ్ మిల్లుల్లోనూ సీసీఐ మద్దతు ధరలకు పత్తిని కొనుగోలు చేయనుంది. రాష్ట్రంలో అత్యధికంగా పొడవు పింజ రకాన్నే రైతులు సాగు చేస్తుంటారు. పొడవు పింజ పత్తికి సీసీఐ క్వింటాకు రూ 6,380 చెల్లించనుంది. సీసీఐ ద్వారా పత్తిని అమ్మదల్చుకున్న రైతులు సమీప రైతు భరోసా కేంద్రాలను సందర్శించి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటు-ంది. ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పంటను సిసిఐ కొనుగోలు చేయనుంది.

దసరా సెలవుల్లో క్లాసులు నడిపితే కఠిన చర్యలు.. ఇంటర్ బోర్డ్ హెచ్చరిక

అమరావతి: అక్టోబర్ 3:అన్ ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కాలేజీలు దసరా సెలవుల్లో విద్యార్థులకు ఎటువంటి క్లాసులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డు హెచ్చరించింది. ఆ కాలేజీల గుర్తింపును రద్దు చేయడంతోపాటు ప్రిన్సిపాల్స్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

ఈమేరకు ఆదివారం ఇంటర్మీడియట్ బోర్డు ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈమేరకు ప్రాంతీయ పర్యవేక్షక అధికారులు కాలేజీలను తనిఖీ చేయాలని ఆదేశించింది. ఈనెల రెండో తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకు ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఖరీఫ్ సీజన్లో తగ్గిన పంటల సాగు.. 9 లక్షల ఎకరాల్లో పడని నాట్లు

అమరావతి: అక్టోబర్ 3: ఈ ఏడాది వ్యవసాయానికి అన్నీ అనువుగా ఉన్నా అన్నదాతల అనాసక్తత కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు తొమ్మిది లక్షల ఎకరాల్లో పంట వేయలేదు. ప్రధానంగా పెరిగిన పెట్టు-బడి వ్యయం.. ప్రకృతి వైపరీత్యాలు.. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో రైతులు సాగు వైపు మొగ్గు చూపలేదు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఖరీఫ్ సీజన్ దాదాపు ముగిసినట్లే. జూన్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు సీజన్ సమయం కాగా సాధారణ విస్తీర్ణంలో తొమ్మిది లక్షల ఎకరాలకు పైగా సాగు కాలేదు.

సాధారణ సాగులో పది శాతం విస్తీర్ణంలో సాగు లేక భూములు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది పంటల సాగు కాస్త ఆలస్యంగా మొదలైనందున అక్టోబర్‌లోనూ కొంత మేరకు సేద్యం జరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. నీటి వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో అక్టోబర్ రెండోవారం వరకు వరి నాట్లు పడతాయని అంచనా వేస్తున్నారు. ఆశలు, అంచనాలు ఎలా ఉన్నా ఈ సంవత్సరం సీజన్ ప్రారంభం నుంచీ సాగు ముమ్మరంగా లేదు.

కీలక సమయాల్లోనూ నత్తనడకనే నడిచింది. సాగు ఖర్చులు పెరగడం, సంస్థాగత అప్పులు పుట్టకపోవడం, అన్నింటికీ మించి పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, విపత్తు, తెగుళ్ల నష్టాల కారనంగా రైతులు నిరాశా నిస్పృహలకు లోనై కొన్ని పంటల సేద్యంపై అనాసక్తిగా ఉన్నారని చెబుతున్నారు. ఈ కారణాల వలన సాధారణ సాగులో తొమ్మిది లక్షల ఎకరాలకు మించి లోటు నెలకొంది. ప్రభుత్వం ఈ ఏడాది 96.42 లక్షల ఎకరాల్లో పంటల సాగును లక్ష్యంగా నిర్ణయించింది. సాధారణ సాగు విస్తీర్ణం 92.05 లక్షల ఎకరాలు. సెప్టెంబర్ నెలాఖరుతో సీజన్ ముగుస్తుండగా 82.82 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. సాధారణం కంటే 9.22 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది.

ప్రభుత్వం తీసుకున్న లక్ష్యం కంటే 13.62 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి సాధారణం కంటే 10 లక్షల ఎకరాల్లో సేద్యం తగ్గింది. ఖరీఫ్ వేళకొచ్చే నైరుతి రుతుపవనాలు జూన్ 13న ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి 20 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకూ విస్తరించాయి.

అక్కడక్కడ డ్రై-స్పెల్స్ ఉన్నప్పటికీ సీజన్ మొత్తమ్మీద సాధారణ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ 28 నాటికి నార్మల్ 556 మిల్లీమీటర్లు కాగా 563.2 మిమీ వర్షం పడింది. కాకినాడ, బాపట్ల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడగా వైఎస్ఆర్ జిల్లాలో తక్కువ వర్షం పడింది. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షం నమోదయింది.

రిజర్వాయర్లన్నింటిలో నీటి నిల్వలు ఆశాజనకంగానే ఉన్నాయి. భూగర్భ జలాలకు ఇబ్బంది లేదు. కాగా ఇప్పటికి 105 మండలాల్లో వర్షాభావం నెలకొంది. ప్రధానమైన ఆహార పంటల సాగు తగ్గింది. వరి, అపరాలు, చిరుధాన్యాలు, పప్పులు, నూనెగింజలు అన్నీ సాధారణంగా కంటే తక్కువ సాగయ్యాయి. అపరాల్లో మొక్కజొన్న మాత్రం వంద శాతానికిపైన సాగైంది. వాణిజ్యపంటల్లో పత్తి నార్మల్ కంటే కొంచెం ఎక్కువ సాగైంది. మిరప సైతం స్వల్పంగా పెరిగింది. చెరకు, పొగాకు, ఇతర పప్పుధాన్యాలు తగ్గాయి. పల్నాడు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో 51-75 శాతం మధ్య సేద్యం జరగ్గా, వైఎస్ఆర్, అనంతపురంలో వంద శాతానికి మించి సాగు నమోదైంది. తతిమ్మా జిల్లాల్లో 76-100 వంద శాతం లోపు సేద్యం జరిగింది. ఇదిలా ఉండగా సాధారణంగా సీజన్ చివరిలో ప్రభుత్వం పంటల సాగు గణాంకాలను విడుదల చేసేది. కానీ ఈ ఏడాది అందుకు విరుద్ధంగా పొడిపొడిగా సాగు వివరాలు వెల్లడించింది.

ప్రకృతిలో మమేకమైన పండుగ బతుకమ్మ

మెదక్, అక్టోబర్ 3: నేటినిజం (ప్రతినిధి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు ప్రతీకగా ప్రకృతిలో మమేకమైన పండుగ బతుకమ్మ అని అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన సోమవారం నాడు కలెక్టరేట్ ఆవరణలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంగిలి పూలను వెదజల్లుకునే అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలందరు తీరొక్క పూలతో జరుపుకునే పండుగ బతుకమ్మ అని అన్నారు. సెప్టెంబర్ 25 నుండి నేటి వరకు 9 రోజుల పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానె బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, , వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, సద్దుల బతుకమ్మలను నిర్వహించామన్నారు. నేటితో ముగిసే ఈ సద్దుల బతుకమ్మ చాలా విశిష్టమైన రోజు అని, పెద్ద బతుకమ్మను పేర్చి గౌరమ్మని పెట్టుకొని ఆడుతారని, 9 రకాల నైవేద్యంగా సమర్పిస్తారని అన్నారు. వివిధ శాఖల నుండి మహిళా ఉద్యోగినులు బతుకమ్మలు తెచ్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ బొడ్డెమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వచ్చిన లంబాడీల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిర, జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ, జిల్లా పరిషద్ సీఈఓ వెంకట శైలేష్, డిఆర్ డిఓ శ్రీనివాస్, డీఈఓ రమేష్ కుమార్, జిల్లా పరిశ్రమల మేనేజర్ కృష్ణ మూర్తి, బతుకమ్మ సమన్వయాధికారి రాజి రెడ్డి, అడిషనల్ డీఆర్ డిఓ భీమయ్య వివిధ శాఖల మహిళా ఉద్యోగినులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుండి వచ్చిన ఆర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

మెదక్, అక్టోబర్ 3: నేటినిజం (ప్రతినిధి):ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుండి వచ్చిన ఆర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించవలసినదిగా జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతూ ఒక్క ఆర్జీ కూడా పెండింగు ఉండకుండా అన్ని ఆర్జీలను పరిశీలించి పరిష్కరించాలన్నారు. దసరా పండుగా సెలవుల వాతావరణం సందర్భంగా ఈ రోజు ప్రజల నుండి చాలా తక్కువ సంఖ్యలో 8 ఆర్జీలు మాత్రమే వచ్చాయి. కొన్ని ఆర్జీల వివరాలు ఇలా... కొల్చారం మండలం రాంపూర్ బ్రిడ్జి వద్ద ఉన్న పాత రోడ్డును సర్పంచ్ అన్యాక్రాంతం చేసుకుంటున్నారని తగు చర్య తీసుకోవలసిందిగా మాచవరం గ్రామానికి చెందిన కిషోర్ తదితరులు ఫిర్యాదు చేశారు.మెదక్ పట్టణంలో డంపింగ్ యార్డు ను జె.సి.బి. ల ద్వారా చదును చేసినందుకు గాను అయినా ఖర్చు 5 లక్షల 17 వేల రూపాయలు ఇప్పించవలసిందిగా సిద్దిరాములు ఎర్త్ మూవర్స్ వారు అభ్యర్థించారు. నేను సాగుచేసుకుంటున్న 6 ఎకరాల 8 గుంటల భూమి ధరణి పోర్టల్ లో నిషేధిత జాబితాలో ఉన్నదని, దానిని తొలగించవలసినదిగా కౌడిపల్లి మండలం తునికికి నికికి చెందిన రథ్లా దుర్గ్యా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కృష్ణ మూర్తి, మైనారిటీ అధికారి జెంలా, డిఎమ్ అండ్ హెచ్ ఓ విజయ నిర్మల తదితర అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 16 న ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించనున్నాం-జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్

మెదక్, అక్టోబర్ 3: నేటినిజం (ప్రతినిధి): ప్రతి సంవత్సరం మాదిరే ఈ ఏడాది అక్టోబర్ 16 న ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ జాతీయ ఆహార భద్రతాచట్టం, తెలంగాణలో ఆహార భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, ఆహార భద్రతను పెంపొందించేందుకు సూచనలు అనే అంశాలపై తెలుగు, ఇంగ్లీష్ భాషలో వివిధ పోటీలు నిర్వహిస్తున్నదని ఆయన తెలిపారు . వ్యాస రచన, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు, పోస్టర్ల రూపకల్పన, లఘు వీడియోల రూపకల్పనలపై ఈ పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. వ్యాసరచన పోటీలో పాల్గొనేవారు తమ వ్యాసాలను వేయి నుండి మూడు వేల పదాలు మించకుండా పీడీఎఫ్ రూపంలో పంపాలని సూచించారు. పవర్ పాయింట్ లో పాల్గొనే వారు 20-25 స్లైడ్స్ ఉండేలా తయారు చేయాలని, పోస్టర్లను పంపేవారు ఏ1, ఏ2, ఏ3 సైజుల్లో జేపీజీలో గానీ, ఎడిట్ చేసేందుకు వీలయ్యే ఫార్మాట్ లో గాని పంపాలని సూచించారు. అదేవిధంగా లఘు వీడియోలు అయితే మూడు నుండి ఆరు నిముషాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల అభ్యర్థులు తమ అంశాలను tsfctelanganastate2017@gmail.com అనే మెయిల్ చిరునామాకు ఈ నెల 12 లోగా అందేలా పంపాలని రమేష్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో మండల స్థాయి అధికారులు, మండల విద్యాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, ఇతర భాగస్వాములు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా డీఈఓ రమేష్ విజ్ఞప్తి చేశారు.

ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డా.ఎల్.మురుగన్ హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఈ రోజు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రాన్ని సందర్శించారు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రాన్ని సహాయ మంత్రి సందర్శించటం ఇదే మొదటిసారి. తెలంగాణ రాష్ట్ర కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అధికారులతో వివిధ విభాగాల పనితీరు గురించి మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ని సందర్శించిన డా.ఎల్. మురుగన్ , ఆ సంస్థలో జరిగిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్.ఎఫ్.డి.బి కార్యాలయంలో వివిధ విభాగాలను మంత్రి పరిశీలించారు. స్వచ్ఛభారత్ అమలు తీరును కూడా మంత్రి పరిశీలించారు.

భారతదేశం ఎకనామిక్ సూపర్ పవర్ మరియు నాలెడ్జ్ బేస్డ్ ఎకానమీగా మారడానికి ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయపడతాయి: శ్రీ ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: 2020, 2021 మరియు 2022 సంవత్సరాల్లో వివిధ ప్రోగ్రామ్‌లలో నమోదు చేసుకున్న 4800 మంది విద్యార్థులకు హైదరాబాద్ విశ్వవిద్యాలయం డిగ్రీలను అందించింది. వీరిలో 1631 మంది వ్యక్తిగతంగా డిగ్రీలు పొందారు. మిగిలిన వారు హాజరుకాలేదు. ఈ 4800లో 573 మంది పిహెచ్‌డి పొందారు. అలాగే అసాధారణ ప్రతిభ చూపిన 484 మంది విద్యార్థులను అవార్డులు మరియు పతకాలతో సత్కరించారు.

మహమ్మారి కారణంగా మూడేళ్ల తర్వాత ఈ వేడుకను నిర్వహించారు. యూనివర్శిటీ గౌరవ ఛాన్సలర్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి ఉత్సవాలను ప్రారంభించి గ్రహీతలతో ప్రమాణం చేయించారు.

వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మరియు యూనివర్సిటీ చీఫ్ రెక్టార్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, గౌరవనీయులైన విద్యాశాఖ మంత్రి మరియు భారత ప్రభుత్వంలోని నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపకత మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, న్యాయమూర్తి ఎల్ నరసింహా రెడ్డిలకు సాదర స్వాగతం పలికారు.

పరిశోధన, బోధన, విద్యార్థుల మార్గదర్శకత్వం మరియు క్యాంపస్ లోని కార్పొరేట్ జీవితంతో సహ వివిధ రంగాలలో విశ్వవిద్యాలయానికి వారి సహకారానికి గుర్తింపుగా యువ అధ్యాపక సభ్యులను ఛాన్సలర్ అవార్డుతో సత్కరించడంతో వేడుక ప్రారంభమైంది.

ప్రొఫెసర్ బి జె రావు తన వార్షిక నివేదికలో హైదరాబాద్ విశ్వవిద్యాలయాన్ని మహోన్నత సంస్థగా మార్చడంలో అధ్యాపకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు అందించిన కృషిని అభినందించారు. అంతర్జాతీయీకరణ ప్రయత్నాలను పెంచడానికి ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థలతో అనేక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు మరియు అధ్యాపకులు సాధించిన విజయాల పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

"విశ్వవిద్యాలయం 1977 నుండి 2022 వరకు ప్రదానం చేసిన డిగ్రీలకు సంబంధించిన మొత్తం 36270 రికార్డులను డిజిలాకర్ సిస్టమ్‌కు అప్‌లోడ్ చేసింది, ఇది స్వయంగా ఒక రికార్డు" అని ఆయన తెలిపారు.

ప్రతి సంవత్సరం ఉన్నత స్థాయికి చేరుకుంటున్న హైదరాబాద్ విశ్వవిద్యాలయం మొత్తం సోదర వర్గాన్ని జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి అభినందించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ తన ప్రసంగంలో..కాన్వకేషన్ అనేది నేర్చుకోవడం నుండి అభ్యాసం వరకు ట్రాక్‌ను మార్చే ఒక ప్రధాన మైలురాయి అని అన్నారు. భారతదేశాన్ని విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో విశ్వవిద్యాలయం అత్యుత్తమ కేంద్రంగా ఆవిర్భవించినందుకు ఆయన అభినందనలు తెలిపారు. "భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకుంటున్నప్పుడు యూఓహెచ్(యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) మన విజ్ఞాన ఆధారిత సమాజంలో ప్రధాన కేంద్రాలలో ఒకటిగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను. మన విద్యార్థులు తమ విద్యను మరింత అర్థవంతంగా మరియు ఉద్దేశపూర్వకంగా చేయడానికి సమాజానికి తిరిగి ఇవ్వాలని నేను ఆశిస్తున్నాను" అని ఆయన చెప్పారు.

శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ భారతదేశం ఆర్థిక సూపర్ పవర్ మరియు విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఆవిష్కరణలు మరియు వ్యవస్థాపకత సహాయపడుతుందని అన్నారు. విద్యను మరింత అర్థవంతం చేయడానికి మరియు సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు.

ఆయన ఓ సారూప్యతను వివరిస్తూ "హైదరాబాద్‌ను అలంకార ముత్యాల నగరంగా పిలుస్తారు, మరియు హైదరాబాద్ విశ్వవిద్యాలయం మేధో ముత్యం" అని వ్యాఖ్యానించారు.

''జీవితంలో విజయం సాధించాలంటే మూడు మంత్రాలు మాత్రమే ఉన్నాయి - హార్డ్ వర్క్, హార్డ్ వర్క్ మరియు హార్డ్ వర్క్" అని డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ నొక్కి చెప్పారు. స్వామి వివేకానంద సూచించిన విధంగా పరిశోధనలను వారి జీవితంలో ఒక భాగం చేసుకోవాలని మరియు వారి అంతర్గత బలాలపై దృష్టి పెట్టాలని ఆమె విద్యార్థులకు తెలిపారు.ఛాన్సలర్ డిగ్రీ రికార్డుపై సంతకం చేసి కాన్వొకేషన్ పూర్తయినట్టు ప్రకటించారు.

దేశంలో ఐదో తరం (5జి) సేవలకు ప్రధానమంత్రి శ్రీకారం 6వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్'ను ప్రారంభించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో సరికొత్త సాంకేతిక శకానికి నాంది పలుకుతూ 5జి (ఐదో తరం) టెలికాం సేవలకు శ్రీకారం చుట్టారు. దీంతోపాటు 6వ 'ఇండియా మొబైల్ కాంగ్రెస్'ను కూడా ప్రారంభించిన ప్రధాని, దీనికి అనుబంధంగా ఏర్పాటు చేసిన 'ఐఎంసి' ప్రదర్శనను తిలకించారు. ఈ చారిత్రక సందర్భంగా పారిశ్రామిక దిగ్గజాలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

రిలయన్స్ చైర్మన్ శ్రీ ముకేష్ అంబానీ మాట్లాడుతూ- భారత్‌ను 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న ప్రధానమంత్రి దార్శనికతకు కృతజ్ఞతలు తెలిపారు. "భారతదేశాన్ని ఈ లక్ష్యం వైపు నడిపించడంలో ప్రభుత్వం తాను చేపట్టే ప్రతి చర్యను, ప్రతి విధానాన్ని ఎంతో నేర్పుతో రూపొందిస్తోంది. ఇందులో భాగంగా భారతదేశాన్ని 5జి శకంలోకి వేగంగా తీసుకెళ్లడంలో ప్రధానమంత్రి తీసుకున్న చర్యలు ఆయన దృఢ సంకల్పానికి నిదర్శనాలు'' అని ఆయన కొనియాడారు. విద్య, విజ్ఞానం, వాతావరణం వంటి కీలక రంగాల్లో 5జి సాంకేతికతకుగల అవకాశాలను ఆయన వివరించారు. ''మీ నాయకత్వం భారతదేశ కీర్తిని, ప్రతిష్టను, శక్తిని మునుపెన్నడూ లేనంతగా ప్రపంచవ్యాప్తం చేసింది. వేగంగా మారిపోతున్న నేటి ప్రపంచంలో పునరుత్థాన భారతం అగ్రస్థానంలోకి దూసుకెళ్లడాన్ని అడ్డుకోగల శక్తి ఏదీ లేదు" అని శ్రీ అంబానీ తన ప్రసంగం ముగించారు.

భారతి ఎంటర్‌ప్రైజ్ చైర్మన్ శ్రీ సునీల్ భారతీ మిట్టల్ మాట్లాడుతూ- 5జి ప్రారంభం కొత్త శకానికి నాంది అన్నారు. అందునా ఇది స్వాతంత్ర్య అమృత మహోత్సవ వేళ కావడం వల్ల మరింత ప్రత్యేకత సంతరించుకున్నదని చెప్పారు. "ప్రధానమంత్రి కృషితో దేశంలో ఇది కొత్త శక్తిని నింపుతుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యంత సూక్ష్మంగా అర్థం చేసుకుంటూ సాటిలేని రీతిలో దాన్ని దేశాభివృద్ధికి వినియోగించే నాయకుడు ప్రధానమంత్రి కావడం మన అదృష్టం" అని కొనియాడారు. శ్రీ మిట్టల్ తన ప్రసంగం కొనసాగిస్తూ- ఇది ప్రజలకు... ముఖ్యంగా మన గ్రామీణ ప్రజానీకానికి అపార అవకాశాలను సృష్టిస్తుందని చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులనుంచీ మౌలిక సదుపాయాలు, సాంకేతికత రంగంలో ప్రధానమంత్రి చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. మహమ్మారి సమయంలో గ్రామాలు, ఇళ్లవైపు దిశ మారిందని, అయినప్పటికీ దేశం గుండె చప్పుడు క్షణం కూడా ఆగలేదని ఆయన అన్నారు. ఇదంతా డిజిటల్ దార్శనికత ఘనతేనని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' దార్శనిక కార్యక్రమంలోని సాహసంతోపాటు దాని విజయాన్ని కూడా ఆయన ప్రశంసించారు. "డిజిటల్ భారతంతోపాటు స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని కూడా ప్రధానమంత్రి ముందుకు నడిపించారు. ఫలితంగా అనతి కాలంలోనే భారతదేశం యూనికార్న్‌ల ఆవిర్భావ గమ్యంగా మారింది" అని శ్రీ మిట్టల్ వివరించారు. "ఇక 5జి ఆగమనంతో మన దేశం కచ్చితంగా మరిన్ని ప్రపంచ యూనికార్న్ సంస్థలను జోడించగలదని నేను భావిస్తున్నాను" అన్నారు.

ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ శ్రీ కుమార మంగళం బిర్లా ప్రసంగిస్తూ- 5జి ఆగమనాన్ని ప్రపంచ వేదికపై భారత శక్తిసామర్థ్యాలను రుజువుచేసే పరివర్తనాత్మక సంఘటనగా పేర్కొన్నారు. భారతదేశ వృద్ధికి పునాదిగా టెలికాం సాంకేతిక పరిజ్ఞాన పాత్ర కీలకమైనదని ఆయన పునరుద్ఘాటించారు. ప్రపంచ వేదికపై భారతదేశం తనదైన ముద్రవేసే విధంగా సాంకేతికతను ఒక తరం మేర ముందడుగు వేయించడంలో గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు, ఆయన నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మహమ్మారి సమయంలో టెలికాం పరిశ్రమకు మద్దతివ్వడంలో, పరిశ్రమకు మార్గనిర్దేశం చేసే టెలికాం సంస్కరణలు తేవడంలో స్ఫూర్తిదాయక పాత్ర పోషించారంటూ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ 5జి ప్రారంభాన్ని భారతదేశ ఉత్తేజకర ప్రగతి పయనానికి నాందిగా శ్రీ బిర్లా అభివర్ణించారు. "మనం ఇకపై 5జి అభివృద్ధికి అపరిమిత సామర్థ్యాన్ని చూస్తాం... ఈ దృష్టాంతాలను రాబోయే ఏళ్లలోనూ వినియోగించుకుంటాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

దేశంలోని మూడు ప్రధాన టెలికం సేవల సంస్థలు 5జి సాంకేతికత సామర్థ్యాన్ని వెల్లడించే మూడు ప్రయోగాత్మక అంశాలను ప్రధానమంత్రి సమక్షంలో ప్రదర్శించాయి. ఇందులో భాగంగా 'రిలయన్స్ జియో' మహారాష్ట్ర, గుజరాత్, ఒడిసా రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లోగల విద్యార్థులతో ముంబైలోని ఒక పాఠశాల ఉపాధ్యాయుడిని అనుసంధానించి చూపింది. భౌతికంగా, భౌగోళికంగా సుదూరంలో ఉన్నప్పటికీ విద్యార్థులకు ఉపాధ్యాయులను చేరువ చేయడం ద్వారా విద్యారంగానికి తోడ్పాటులో 5జి సామర్థ్యం ఎంతటిదో ఈ ప్రయోగంతో రుజువైంది. అంతేకాకుండా అనుబంధ వాస్తవికత (ఏఆర్) శక్తి కూడా ఒక తెరపై ప్రదర్శించబడింది. దేశవ్యాప్తంగాగల పిల్లలకు 'ఏఆర్' పరికరంతో అవసరం లేకుండానే రిమోట్ పద్ధతిలో బోధనకు ఇదెలా ఉపయోగపడుతుందో కూడా దీంతో స్పష్టమైంది.

ఈ సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏక్‌నాథ్ షిండే సమక్షంలో మహారాష్ట్రలోని రాయగఢ్ లోగల జ్ఞానజ్యోతి సావిత్రీబాయి ఫూలే పాఠశాల విద్యార్థులతో ప్రధానమంత్రి సంభాషించారు. అలాగే గుజరాత్‌లోని గాంధీనగంలోని రోప్డా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్ సమక్షంలో ప్రధానితో ముచ్చటించారు. అదేవిధంగా ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సమక్షంలో ఆ రాష్ట్రంలోని మయూర్‌భంజ్‌లోగల 'ఎస్ఎల్ఎస్' స్మారక పాఠశాల విద్యార్థులతోనూ ప్రధానమంత్రి మాట్లాడారు. మరోవైపు ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్, బీకేసి, ముంబైకి చెందిన శ్రీ అభిమన్యు బసు 5జి సాంకేతికత ఉపయోగాన్ని ప్రదర్శనాత్మకంగా వివరించారు. విద్యలో సాంకేతికతపై విద్యార్థుల్లో పెల్లుబికిన ఉత్సాహాన్ని ప్రధానమంత్రి స్వయంగా గమనించారు. రచయిత అమిష్ త్రిపాఠీ ఈ విభాగాన్ని పరిచయం చేశారు.

వోడాఫోన్ ఐడియా సంస్థ తనవంతుగా ఢిల్లీ మెట్రో సొరంగం నిర్మాణంలోని కార్మికుల భద్రతకు సంబంధించిన అంశాన్ని 'డిజిటల్ ట్విన్' సాంకేతికత ద్వారా వేదికపై సృష్టించి ప్రదర్శించింది. ఈ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కార్మికుల పని ప్రదేశాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తూ సుదూర నుంచి ఎప్పటికప్పుడు భద్రత హెచ్చరికలు జారీ చేయవచ్చు. ఈ పరిజ్ఞానాన్ని వేదిక పైనుంచే ప్రధానమంత్రి ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇందులో భాగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), వాస్తవిక సాదృశ (వర్చువల్ రియాలిటీ) మాధ్యమాల సాయంతో కార్మికుల పనిని ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అంతేగాక ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ సక్సేనా సమక్షంలో ఢిల్లీ మెట్రో టన్నెల్ ద్వారకలో పనిచేస్తున్న శ్రీ రింకు కుమార్‌తో ప్రధాని స్వయంగా సంభాషించారు. సాంకేతికత అనుసరణకు అవసరమైన వినియోగానుభవం, అభ్యాస సాధ్యత గురించి ఆయన వాకబు చేశారు. భద్రతపై కార్మికులలో విశ్వాసం నింపడంలో కొత్త సాంకేతికత కీలక సహకారం అందిస్తుందన్నారు. దేశాభివృద్ధికి కృషి చేస్తున్న భారత కార్మిక శక్తిని ఈ సందర్భంగా ప్రధాని అభినందించారు.

ఎయిర్‌టెల్ సంస్థ ప్రదర్శనలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని దన్‌కౌర్‌లోగల విద్యార్థులు వర్చువల్ (విఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) పరిజ్ఞానాలద్వారా బోధనలో లీనమై, సౌర వ్యవస్థ గురించి తెలుసుకోవడం ద్వారా అభ్యాసంలో ప్రత్యక్ష అనుభవం పొందారు. వారిలో ఒక విద్యార్థి ఖుషీ, హోలోగ్రామ్ ద్వారా ఢిల్లీలోని వేదికపై కనిపిస్తూ- ఈ పరిజ్ఞానంతో విద్యాభ్యాసంపై తన అనుభవాన్ని ప్రధానితో పంచుకుంది. అలాగే ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ యోగి ఆదిత్యనాథ్ వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ నుంచి విద్యార్థులతో సంధానమయ్యారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో ప్రధాని ఆమెతో ముచ్చటించారు. పాఠ్యాంశాలను చక్కగా అర్థం చేసుకోవడంలో 'విఆర్' అనుభవం ఎలా తోడ్పడిందో వాకబు చేశారు. దీనిపై స్పందిస్తూ- ఈ అనుభవంతో కొత్త విషయాలను తెలుసుకోవాలన్న ఆసక్తి తనలో మరింత పెరిగిందని ఆ బాలిక తెలిపింది.

అనంతరం ప్రధానమంత్రి ప్రసంగిస్తూ- నేటి కార్యక్రమం ప్రపంచ స్థాయి సదస్సు అయినప్పటికీ దీని పర్యవసానాలు, దిశ స్థానికంగానే ఉంటాయన్నారు. వేగంగా పురోగమిస్తున్న 21వ శతాబ్దపు భారతదేశానికి ఈ రోజు ఎంతో ప్రత్యేకమైనదని ఆయన పేర్కొన్నారు. "నేడు 130 కోట్ల మంది భారతీయులు దేశం నుంచి, దేశంలోని టెలికాం పరిశ్రమ నుంచి 5జి రూపంలో అద్భుతమైన బహుమతిని అందుకుంటున్నారు. 5జి అంటే- దేశం తలుపు తడుతున్న కొత్త శకం... 5జి అంటే- అనంతాకాశం వంటి అవకాశాల పునాది. దీనిపై ప్రతి భారతీయుడినీ నేను అభినందిస్తున్నాను" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఇవాళ 5జి ప్రారంభం, సాంకేతికత ముందడుగులో గ్రామీణ ప్రాంతాలు, కార్మికులు కూడా సమాన భాగస్వాములుగా ఉండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ఐదో తరం సాంకేతిక ప్రారంభంపై మరో సందేశమిస్తూ- "నవ భారతం కేవలం సాంకేతికత వినియోగదారుగా మిగిలిపోదు... ఈ సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధి, అనుసరణలోనూ క్రియాశీల పాత్ర పోషిస్తుంది. అలాగే భవిష్యత్ తంత్రీరహిత (వైర్‌లెస్) పరిజ్ఞానం రూపకల్పన, తయారీలోనూ ప్రధాన సూత్రధారి కాగలదు'' అని ప్రధానమంత్రి ఆత్మవిశ్వాసం ప్రకటించారు. భారతదేశం 2జి, 3జి, 4జి సాంకేతిక పరిజ్ఞానాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చిందని ప్రధాని గుర్తుచేశారు. అయితే 5జి ద్వారా భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. "5జితో భారత్ తొలిసారి టెలికాం సాంకేతికతలో ప్రపంచ ప్రమాణాలను నిర్దేశిస్తోంది'' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇక డిజిటల్ భారతం కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ- దీన్నొక ప్రభుత్వ పథకంగా మాత్రమే కొందరు భావిస్తున్నారని ప్రధాని అన్నారు. కానీ, "డిజిటల్ భారతం అన్నది కేవలం ఓ పేరు కాదు.. దేశాభివృద్ధికి అదొక విశాల దార్శనిక దృక్పథం. ప్రజల కోసం... ప్రజలతో అనుసంధానమై పనిచేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు చేరువచేయడమే ఈ దార్శనిక దృక్పథం లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు.

డిజిటల్ ఇండియాకు సమగ్ర దృక్పథం అవశ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. "మేం ఏకకాలంలోనే నాలుగు దిశలలో 4 లక్ష్యాలపై దృష్టి సారించాం. మొదటిది.. పరికరం ధర; రెండోది.. డిజిటల్ అనుసంధానం; మూడోది.. డేటాపై ధర; నాలుగోది-కీలకమైనది... 'డిజిటల్ ఫస్ట్' యోచన" అని ఆయన వివరించారు. వీటిలో మొదటి లక్ష్యం విషయానికొస్తే- స్వావలంబన ద్వారా మాత్రమే చౌకధరతో పరికరాల లభ్యత సాధ్యమని ప్రధాని చెప్పారు. ఎనిమిదేళ్ల కిందట దేశంలో కేవలం రెండే రెండు మొబైల్ ఫోన్ తయారీ పరిశ్రమలు ఉండేవని ఆయన గుర్తుచేశారు. అయితే, "ఈ సంఖ్య ఇప్పుడు 200 దాటింది" అని శ్రీ మోదీ ఉటంకించారు. అలాగే 2014లో దేశం నుంచి మొబైల్ ఫోన్ల ఎగుమతి శూన్యం కాగా, ఇవాళ రూ.వేలకోట్ల విలువైన మొబైల్ ఫోన్ల ఎగుమతిదారుగా భారత్ ఎదిగిందని ప్రధాని నొక్కిచెప్పారు. "ఈ కృషితో సహజంగానే పరికరం ధర ప్రభావితమైంది. ఇప్పుడు మనం తక్కువ ధరతో మరిన్ని ఫీచర్లను పొందడం కూడా ప్రారంభించాం" అన్నారు.

ఇక రెండో లక్ష్యమైన డిజిటల్ అనుసంధానం విషయానికొస్తే- దేశంలో 2014 నాటికి ఇంటర్నెట్ వినియోగించే వారి సంఖ్య 6 కోట్లు కాగా, నేడు 80 కోట్లకు పెరిగిందని ప్రధాని గుర్తుచేశారు. అలాగే 2014లో ఆప్టికల్ ఫైబర్ అనుసంధానిత పంచాయతీల సంఖ్య 100కన్నా తక్కువ కాగా, ఇప్పుడది 1.7 లక్షలకు పెరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో "ఇంటింటికీ విద్యుత్ సౌకర్యంపై కార్యక్రమం ప్రారంభించిన తరహాలో; 'ఇంటింటికీ నీరు కార్యక్రమం' ద్వారా ప్రతి ఒక్కరికీ పరిశుభ్ర, సురక్షిత నీరందించే లక్ష్యంతో పనిచేసిన తీరులో; ఉజ్వల పథకం ద్వారా నిరుపేదలకు వంటగ్యాస్ పంపిణీ చేసిన విధంగానే... ఇవాళ 'అందరికీ ఇంటర్నెట్' లక్ష్యంగా మా ప్రభుత్వం పనిచేస్తోంది" అని ఆయన చెప్పారు.

014 నుండి ప్రధానమంత్రి ఎక్సలెన్స్ అవార్డు కాన్సెప్ట్, ఫార్మాట్ విప్లవాత్మక మార్పులకు గురైంది- కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: శాస్త్ర సాంకేతిక శాఖ (స్వతంత్ర), భూ శాస్త్ర సహాయ (స్వతంత్ర), ప్రధానమంత్రి కార్యాలయం, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 2022లో ప్రధానమంత్రి అవార్డుల కోసం వెబ్ పోర్టల్ (http://www.pmawards.gov.in)ను లాంఛనంగా ప్రారంభించారు.

న్యూఢిల్లీలోని సర్దార్ పటేల్ భవన్ లో కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖకు చెందిన పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం ఈ లాంఛనాన్ని అధికారికంగా ప్రారంభించింది.

భారతదేశంలోని మొత్తం 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీలు (ఎఆర్)/ (ఐటి) మరియు డిసిలు / డిఎంలు అలాగే 2020 బ్యాచ్ యొక్క అసిస్టెంట్ సెక్రటరీలను హైబ్రిడ్ విధానంలో ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు.

ప్రధాన మంత్రి అవార్డ్స్ వెబ్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ 2022 అక్టోబర్ 3 నుండి ప్రారంభమవుతుంది. దరఖాస్తులు అక్టోబర్ 3, 2022 నుండి నవంబర్ 28, 2022 వరకు స్వీకరించబడతాయి.

ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 తర్వాత పీఎం ఎక్సలెన్స్ అవార్డుల మొత్తం కాన్సెప్ట్ మరియు ఫార్మాట్ విప్లవాత్మక మార్పులకు గురైంది. ఈ పథకం లక్ష్యం నిర్మాణాత్మక పోటీని ప్రోత్సహించడం, ఆవిష్కరణలు, ప్రతిరూపం మరియు ఉత్తమ అభ్యాసాల సంస్థాగతీకరణ.

ప్రధానమంత్రి అవార్డులు, 2022లో ఇవి ఉంటాయి: (1) ట్రోఫీ, (2) స్క్రోల్ మరియు (3) అవార్డు పొందిన జిల్లా / సంస్థకు రూ .20 లక్షల ప్రోత్సాహకం, ప్రాజెక్ట్ / కార్యక్రమం అమలు లేదా ప్రజా సంక్షేమానికి చెందిన ఏ రంగంలోనైనా వనరుల అంతరాలను పూడ్చడానికి ఉపయోగించాలి.

ఏప్రిల్ 1, 2020నుంచి సెప్టెంబర్ 30, 2022 వరకు పీఎం ఎక్సలెన్స్ 2022 అవార్డుల కోసం పరిగణనలోకి తీసుకునే కాలం. 2022లో ప్రధాన మంత్రి అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కింద మొత్తం అవార్డుల సంఖ్య 16.

ఈ విధానం కింద, పరిమాణాత్మక లక్ష్యాలను సాధించడం కంటే సుపరిపాలన, గుణాత్మక సాధన మరియు చివరి మైలు కనెక్టివిటీపై దృష్టి సారించబడుతుంది. ఈ దృష్టితో, అవార్డుల కోసం దరఖాస్తులను సుపరిపాలన, గుణాత్మక మరియు పరిమాణాత్మక అనే మూడు పరామితర్లపై మదింపు చేస్తామని మంత్రి తెలిపారు.

సివిల్ సర్వీసెస్ డే, 2022 సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో, చివరి వ్యక్తికి తగిన ప్రయోజనాలను అందించడానికి ఖచ్చితమైన అంతరాయం లేని యంత్రాంగాన్ని నిరంతరం సృష్టించాలని నొక్కిచెప్పారని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. ఈ యంత్రాంగాన్ని మనం ఎంత ఎక్కువగా నిర్మిస్తే, చివరి వ్యక్తి సాధికారత అనే దేశ లక్ష్యాన్ని మనం సాధించగలం. సివిల్ సర్వీసెస్ డే మనలో కొత్త శక్తిని నింపడానికి మరియు కొత్త తీర్మానాలు చేయడానికి ఒక అవకాశంగా మారాలి. మనం కొత్త అధికారులను కొత్త ఉత్సాహంతో పట్టుకోవాలి. జిల్లాకు చెందిన లేదా ఒక నిర్దిష్ట జిల్లాలో చురుకుగా ఉన్న కొంతమంది వ్యవస్థాపకులను వారి అభ్యసన మరియు అనుభవాలను పంచుకోవడానికి పిలవవచ్చు, తరువాత వాటిని ఉత్తమ పద్ధతులుగా పునరావృతం చేయవచ్చు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో ఎక్సలెన్స్ 2022 కోసం ప్రధానమంత్రి అవార్డు కోసం పోటీ పడుతున్నప్పుడు ఈ పథకంలో పాల్గొనే అన్ని జిల్లాలు తమ పనితీరును ప్రదర్శించడానికి అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

2022 సంవత్సరానికి గాను, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో ఎక్సలెన్స్ కొరకు ప్రధాన మంత్రి అవార్డుల పథకం ఈ క్రింది రంగాలలో ప్రభుత్వోద్యోగుల యొక్క సహకారాన్ని గుర్తించడం లక్ష్యంగా పెట్టుకుంది:

ఎ. హర్ ఘర్ జల్ యోజన ద్వారా స్వచ్ఛ జల్ (క్లీన్ జల్) ను ప్రోత్సహించడం

బి. ఆరోగ్యం మరియు వెల్ నెస్ సెంటర్ల ద్వారా స్వస్థ్ భారత్ (ఆరోగ్యకరమైన భారత్) ను ప్రోత్సహించడం

సి. సమగ్ర శిక్షా ద్వారా సమానమైన మరియు సమ్మిళిత తరగతి గది వాతావరణంతో నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం

డి . ఆకాంక్షాత్మక జిల్లా కార్యక్రమం ద్వారా సంపూర్ణ అభివృద్ధి సంపూర్ణ పురోగతి, సంతృప్త విధానం మరియు ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి సారించడం.

ప్రధాన మంత్రి అవార్డ్స్ 2022 కోసం నామినేషన్లను సమర్పించడానికి అవసరమైన అర్హత ఈ కింది వాటికి అందుబాటులో ఉంటుంది: 1. పథకాలకు (ఎ) నుండి (సి) పై పేరా 6లో జిల్లాలకు సమగ్రాభివృద్ధికి మరియు (డి) ఆకాంక్షిత జిల్లాలకు మాత్రమే అవార్డులు. 2. పై పేరా 6లో స్కీం (ఇ) కొరకు అవార్డు జిల్లాలతో పాటు కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాలు/ జిల్లా అమలు యూనిట్ల సంస్థలకు అందుబాటులో ఉంటుంది.

ప్రధాన మంత్రి అవార్డుల మదింపు కోసం ప్రమాణం, 2022 లైన్ మినిస్ట్రీస్ / డిపార్ట్ మెంట్ లతో సంప్రదించి ముందస్తుగా నిర్ణయించిన సూచనలపై ఆధారపడి ఉంటుంది (సృజనాత్మకతను మినహాయించి). సంబంధిత లైన్ మినిస్ట్రీలు/డిపార్ట్ మెంట్ ల ద్వారా అందించబడే స్కీంలు మరియు ఫ్లెక్సిబుల్ పరామితర్ల యొక్క మిశ్రమం స్కీంల మధ్య ఉమ్మడి పరామితర్లు ఉంటాయి. భాగస్వాముల యొక్క ఆవశ్యకతలను తీర్చడం కొరకు ఒక సృజనాత్మక ఐడియా/స్కీం/ప్రాజెక్ట్ ని ప్రవేశపెట్టడం మరియు అమలు చేయడం ఆధారంగా ఇన్నోవేషన్ కేటగిరీ కొరకు అవార్డు మదింపు చేయబడుతుంది.

మదింపు ప్రక్రియలో (i) స్క్రీనింగ్ కమిటీ ద్వారా జిల్లాలు/సంస్థల షార్ట్ లిస్టింగ్ (మొదటి మరియు రెండవ దశ), (ii) నిపుణుల కమిటీ ద్వారా మదింపు మరియు (iii) సాధికార కమిటీ ఉంటాయి. అవార్డుల సాధికారిక కమిటీ సిఫార్సుల మేరకు ప్రధాన మంత్రి ఆమోదం తెలపనున్నారు.

కేసీఆర్ జాతీయ పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న యూకే ఎన్నారైలు..

హైదరాబాద్, అక్టోబర్ 3:కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి రావాలని, వారి నూతన జాతీయ పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు యూకే ఎన్నారైలు తెలిపారు. చారిత్రాత్మక లండన్ టవర్ బ్రిడ్జ్ వద్ద సమావేశమైన ఎన్నారైలు కేసీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. యూకే లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు సైతం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించి భారత దేశానికి నాయకత్వం వహించాలని, దేశ గతిని మార్చాలని కోరారు.

ఇప్పుడు దేశమంతా తెలంగాణ మోడల్ వైపు చూస్తోందని , రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, జరుగుతున్న అభివృద్ధి దేశమంతా జరగాలంటే కేసీఆర్ వల్లే సాధ్యమని ఎన్నారైలు తెలిపారు. "దేశ్ కీ నేత కేసీఆర్" అంటూ భారీ కటౌట్ పెట్టారు. కేసీఆర్ అతిపెద్ద కటౌట్? లండన్ టవర్ బ్రిడ్జి దగ్గర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర చలనచిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కూర్మాచలంతో పాటు ఎన్నారైలు అశోక్ దుసారి , రత్నాకర్ కడుదుల, నవీన్ రెడ్డి, హరి నవాపేట్, సృజన్ రెడ్డి, సత్యమూర్తి చిలుముల, సతీష్ గొట్టెముక్కల, సురేష్ గోపతి , రమేష్ ఎసెంపల్లి, నవీన్ భువనగిరి, రవి రేతినేని, సురేష్ బుడగం, రవి ప్రదీప్, సతీష్ గొట పాల్గొన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఎన్‌టీపీసీ ఉత్పత్తిలో 15.1% కంటే ఎక్కువ వృద్ధి

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ఎన్‌టీపీసీ గ్రూప్ కంపెనీలు ఏప్రిల్ – సెప్టెంబర్ 2022 మధ్య కాలంలో 203.5 బిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని నమోదు చేశాయి, ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 2021 వరకు ఉత్పత్తి చేసిన విద్యుత్తు176.8 బిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది దాదాపు 15.1% శాతం అధికం. అధిక ఉత్పత్తి వృద్ధి మెరుగైన పని తీరును, ప్రస్తుత సంవత్సరంలో విద్యుత్ డిమాండ్ పెరుగుదలను సూచిస్తుంది.

ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 2022 మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్‌లోని ఎన్‌టీపీసీ రిహాండ్ (3000 మెగా వాట్ల) 90.22% ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో గరిష్ఠ పనితీరును కనబరిచింది. దీంతో మెటి పనితీరును కనబరిచిన థర్మల్ ప్లాంటుగా ఈ యూనిట్ నిలిచింది. ఎన్‌టీపీసీ బొగ్గు స్టేషన్ల మొత్తం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ ఏప్రిల్ నుండి సెప్టెంబర్ 2022 మధ్య కాలంలో 76.3 శాతంగా ఉంది, ఇది పవర్ ప్లాంట్ల నిర్వహణ, నిర్వహణలో ఎన్‌టీపీసీ యొక్క అధిక స్థాయి కార్యాచరణ నిపుణత మరియు నైపుణ్యానికి నిదర్శనం. ఎన్‌టీపీసీ మొత్తం స్థాపిత సామర్థ్యం 70234 మెగా వాట్లు గ్రీన్ హైడ్రోజన్, వేస్ట్–టు–ఎనర్జీ మరియు ఈ–మొబిలిటీ వంటి కొత్త వ్యాపార రంగాలలో ఎన్‌టీపీసీ తన ఉనికిని విస్తరిస్తోంది. భారతదేశం యొక్క అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థ కూడా 2032 నాటికి నికర శక్తి తీవ్రతలో దాదాపు 10 శాతం తగ్గింపును లక్ష్యంగా పెట్టుకుంది. యుఎన్ హై-లెవల్ డైలాగ్ ఆన్ ఎనర్జీ (హెచ్‌ఎల్‌డీఈ)లో భాగంగా తన ఎనర్జీ కాంపాక్ట్ లక్ష్యాలను ప్రకటించిన మొదటి ఇంధన సంస్థ ఎన్‌టీపీసీ. విద్యుదుత్పత్తితో పాటు, జల, పవన, సౌర మరియు గ్రీన్ హైడ్రోజన్ సొల్యూషన్స్ వంటి క్లీనర్ మరియు గ్రీన్ మూలాల ద్వారా శక్తిని ఉత్పత్తి చేయడానికి ఎన్‌టీపీసీ నిమగ్నమై ఉంది. పవర్ మేజర్ ఇంధన సెల్‌లు, ఈ–మొబిలిటీ మరియు వేస్ట్–టు–ఎనర్జీతో సహా వివిధ వ్యాపార రంగాలలోకి సంస్థ ఇప్పటికే ప్రవేశించింది.

విశ్వాస పరీక్షలో నెగ్గిన పంజాబ్ మాన్ ప్రభుత్వం

చండీగఢ్ , అక్టోబర్ 3:తమ ప్రభుత్వంపై తామే విశ్వాస పరీక్ష పెట్టుకోవడం ఇటీవల ఫ్యాషన్‌గా మారింది. కొన్ని రోజుల కిందట ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో చేపట్టినట్లుగానే.. పంజాబ్‌లో సీఎం భగవంత్ మాన్ కూడా విశ్వాస పరీక్ష పెట్టుకుని నెగ్గాడు. మాన్ ప్రభుత్వానికి అనుకూలంగా 93 మంది ఓటేయగా.. వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా నమోదు కాకపోవడం విశేషం.

పంజాబ్‌లో తమ ప్రభుత్వం పట్ల ఆప్ ఎమ్మెల్యేల్లో విశ్వాసం ఉన్నదని స్పష్టం చేసేందుకు భగవంత్ మాన్ విశ్వాస పరీక్షను ఎదుర్కొన్నాడు. సోమవారం పంజాబ్ అసెంబ్లీలో స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వన్ విశ్వాస పరీక్ష నిర్వహించగా.. 90 మంది ఎమ్మెల్యేలు అనుకూలంగా ఓటేశారు. ఒక్కరు కూడా మాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయలేదు. దాంతో విశ్వాస తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. శిరోమణి అకాలీదళ్, బీఎస్పీ కూటమి ఎమ్మెల్యేలు సభలోనే ఉన్నప్పటికీ విశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించలేదు. బీజేపీ ఎమ్మెల్యేలు సభకు గైర్హాజరయ్యారు. విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా జలంధర్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే శీతల్ అంగురాల్ బీజేపీ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు. విశ్వాస పరీక్ష సందర్భంగా చర్చ దాదాపు 2 గంటలపాటు కొనసాగింది.

విశ్వాస పరీక్షపై చర్చను ప్రారంభించిన సీఎం భగవంత్ మాన్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అనేక పథకాలు తీసుకురానున్నమని చెప్పారు. తగినంత డబ్బు లేకపోవడంతో చెరుకు రైతులు వరి పంట వైపు వెళ్తున్నారని విచారం వ్యక్తం చేశారు. చెరకు మద్దతు ధరను రూ.360 నుంచి రూ.380 కు పెంచి ఖజానా నుంచి రూ.200 కోట్లు రైతులకు అందజేస్తామన్నారు. మొహాలీ విమానాశ్రయానికి భగత్ సింగ్ పేరు మార్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు సీఎం మాన్ చెప్పారు. హల్వారా విమానాశ్రయానికి కర్తార్ సింగ్ సారభా పేరు పెట్టేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. పంజాబ్ ప్రజలు తమపై నమ్మకంతో అధికారం అప్పగించారని, వారి నమ్మకాన్ని నెరవేరుస్తామని సీఎం మాన్ పేర్కొన్నారు.

నడ్డా వచ్చి అడ్డా వేసినా గులాబీదే విజయం : మంత్రి జగదీశ్ రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 3: కుట్రలు కుతంత్రాలకు భారతీయ జనతా పార్టీ పెట్టింది పేరు అని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి దుయ్యబట్టారు. అటువంటి కుతంత్రాలలో భాగమే మునుగోడు ఉప ఎన్నిక అని ఆయన తేల్చిచెప్పారు. ఎవరెన్ని కుట్రలకు తెర లేపినా అంతిమ విజయం ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ పార్టీదేనని ఆయన స్పష్టం చేశారు. మునుగోడు ఉప ఎన్నికల ప్రకటన వెలువడిన నేపథ్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియా తో మాట్లాడారు.

ఢిల్లీ బాద్‌షాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు వింటేనే హడలిపోతున్నారన్నారు. జాతీయ రాజకీయాల్లోకి వస్తామంటూ అధికారికంగా ప్రకటించారో లేదో 24 గంటల్లోనే మునుగోడు ప్రకటన వెలువడిందని ఆయన తెలిపారు. వాస్తవానికి అమిత్ షా మునుగోడు పర్యటన ముగిసిన మరుసటి రోజే ఎన్నికల ప్రకటన వస్తుందని భావించామన్నారు. అయితే పరిస్థితులు బీజేపీకి ఆశాజనకంగా కనిపించక పోయేసరికి వాయిదాల పద్ధతిని ఎంచుకున్నట్లు కనిపించిందన్నారు. నిజానికి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేసిన మరుక్షణమే అక్కడి ప్రజలు టీఆర్ఎస్‌ను గెలిపించాలని నిర్ణయించారన్నారు. ప్రధాని మోదీ,హోంమంత్రి అమిత్ షా లు అడ్డుపడ్డా.. నడ్డా వచ్చి ఇక్కడే అడ్డా వేసినా గులాబీ గెలుపును ఆపడం వారి తరం కాదన్నారు. జాతీయ పార్టీ ప్రకటనతో కమలనాథులు బెంబేలెత్తి పోతున్నారని ఆయన చెప్పారు. రాత్రికి రాత్రే వచ్చిన మునుగోడు ఎన్నికల ప్రకటన అందులో భాగమేనన్నారు. మునుగోడులో బీజేపీకి దక్కేది మూడో స్థానమేనని, ఇప్పటికీ మాతో పోటీ పడేది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన తేల్చిచెప్పారు.

డి.ఎ.డి. 275వ వార్షికోత్సవం సందర్భంగా పలు కీలక డిజిటల్ కార్యక్రమాలు శ్రీకారం..

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: న్యూ ఢిల్లీలో రక్షణ ఖాతాల శాఖ (డి.ఎ.డి.) 275వ వార్షికోత్సవాల సందర్భంగా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు అనేక డిజిటల్ కార్యక్రమాలను ప్రారంభించారు. కేంద్రమంత్రి ప్రారంభించిన డిజిటల్ కార్యక్రమాల్లో, పెన్షన్ పరిపాలనా వ్యవహారాల వ్యవస్థ (రక్ష) (స్పర్ష్) మొబైల్ యాప్; అగ్నివీరుల చెల్లింపు వ్యవస్థ; రక్షణ ప్రయాణ వ్యవస్థ (డి.టి.ఎస్.)లో అంతర్జాతీయ ఎయిర్ టికెట్ బుకింగ్ మాడ్యూల్; రక్షణ ఖాతాల వసూలు, చెల్లింపు వ్యవస్థ (దర్పణ్); రక్షణ పౌర చెల్లింపు వ్యవస్థ–రక్షణ ఖాతాల మానవ వనరుల నిర్వహణా వ్యవస్థ ఉన్నాయి. ఈ సందర్భంగా రక్షణమంత్రి మాట్లాడుతూ,... కొత్త డిజిటల్ కార్యక్రమాలతో రక్షణ శాఖ పనితీరులో పారదర్శకత, సమర్థత పెరుగుతుందని పేర్కొన్నారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞాన్ని ప్రోత్సహించేందుకు 'డిజిటల్ ఇండియా' పేరిట ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం స్ఫూర్తిని ఎంతో శ్రద్ధతో ముందుకు తీసుకెళ్లినందుకు రక్షణ ఖాతాల శాఖను (డి.ఎ.డి.ని) రక్షణమంత్రి ప్రశంసించారు. కీలకమైన శాఖాపరమైన ప్రాజెక్టులను అమలు చేయడంలో ఆదర్శవంతమైన రీతిలో చొరవను ప్రదర్శించిన మూడు బృందాలకు కేంద్రమంత్రి రాజనాథ్ సింగ్ అభినందనలు తెలిపారు. వారికి రక్షణ మంత్రి ప్రతిభా అవార్డు–2022 పురస్కారాలను కూడా ప్రదానం చేశారు. స్పర్ష్ అభివృద్ధి, పరీక్ష–అమలు; డి.ఆర్.డి.ఒ.–పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ (పి.ఎ.ఒ.) భారతి, ఇ–కాన్‌కరెన్స్ అమలు: యువర్ పి.ఎ.ఒ., కాల్‌అవే 24×7 వంటి కీలకమైన పథకాలను అమలు చేయడంలో చక్కని చొరవను ప్రదర్శించినందుకు గాను ఈ పురస్కారాలను ప్రదానం చేశారు.

స్పర్ష్ మొబైల్ యాప్: పెన్షనర్ అనుసంధానాన్ని ఈ యాప్ నిర్ధారిస్తుంది. పెన్షనర్ల మొబైల్ ఫోన్ల ద్వారా స్పర్ష్ పోర్టల్‌కు సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలను చేరువ చేస్తుంది. సాయుధ బలగాల సిబ్బంది పెన్షన్ మంజూరు, పంపిణీకి సంబంధించిన ఆటోమేషన్ కోసం సమగ్ర వ్యవస్థ రూపంలో ఒక పోర్టల్‌ను (ట్రబిబిజూబ://బజూజీతీబష్త.టవటవనిఇ•వజూవనిబతీనీని.ఐనీల.తిని/) రక్షణ మంత్రిత్వ శాఖ అమలులోకి తెచ్చింది. క్లెయిమ్ దశనుంచి, పంపిణీ వరకు పెన్షన్‌కు, సంబంధిత ప్రక్రియలకు ఇది పూర్తి పరిష్కారంగా ఉంటుంది. పెన్షనర్లు ఈ పోర్టల్‌కు లాగిన్ చేసి తమకు సంబంధించిన అన్ని పెన్షన్ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. స్పర్ష్ అనే మొబైల్ యాప్‌ను ఒక మైలురాయిగా రక్షణమంత్రి అభివర్ణించారు. జీవించి ఉన్న సమయంలో సైనికులకు, సేవా విధుల్లో ఉన్న సిబ్బందికి, మాజీ సైనికులకు, వారి కుటుంబాలకు ఉత్తమ సేవలను అందించడానికే ప్రభుత్వం కృషిచేస్తున్నదని ఆయన అన్నారు. సరైన సమయంలో సరైన పింఛన్ పంపిణీపై తాము ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన, నాణ్యమైన రీతిలో పెన్షనర్ల ఫిర్యాదులను పరిష్కరించడానికే తొలి ప్రాధాన్యత ఉండేలా చూడాలని రక్షణ మంత్రి డి.ఎ.డి.కి పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి ఎక్కడికక్కడ ఔట్‌రీచ్ కార్యక్రమాలను 'రక్షా పెన్షన్ సమాధాన్'ను క్రమం తప్పకుండా నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. ఇదే విధంగా వారు నిరంతరం కృషి చేయాలని కోరారు.

అగ్నివీర్ చెల్లింపు వ్యవస్థ: ప్రభుత్వం చేపట్టిన పరివర్తనాత్మకమైన అగ్నిపథ్ పథకం ద్వారా త్వరలో సాయుధ బలగాల్లో చేరనున్న అగ్నివీరులకు వేతన చెల్లింపుల నిర్వహణా ప్రక్రియను సమర్థవంతంగా, సులభతరంగా నిర్వహిస్తుంది. అగ్నివీరుల క్లెయిమ్ ప్రాసెసింగ్, పే–రోల్ నిర్వహణను నిర్ధారించడానికి పూర్తి యాంత్రీకరణ, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీతో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన పోర్టల్‌గా ఇది ఉంటుంది. ఇక అగ్నివీరుల కోసం రూపొందించిన కేంద్రీకృత పి.ఎ.ఒ. (ఆర్మీ) వ్యవస్థను కూడా రాజనాథ్ సింగ్ ఢిల్లీ కంటోన్మెంట్‌లో ప్రారంభించారు.

రక్షణ ప్రయాణ వ్యవస్థ: రైలు–విమాన టిక్కెట్ల బుకింగ్ ప్రక్రియనుంచి నగదు రహిత, కాగిత రహిత పద్ధతి వరకు రక్షణ సేవల సిబ్బందికి, పౌరులకు డిఫెన్స్ పోర్టల్‌లో తగిన సేవలను ఈ వ్యవస్థ అందిస్తుంది. ఎయిర్ ఎక్స్ఛేంజ్ వారెంట్ల స్థానంలో రక్షణ సేవల సిబ్బంది విదేశీ ప్రయాణాలకు సంబంధించిన విమాన టిక్కెట్ల బుకింగ్ సదుపాయాన్ని కూడాఅందిస్తుంది. జనరల్ సర్వీస్ లిస్ట్ (జి.ఎస్.ఎల్.) రసీదుకు, టికెట్ బుకింగ్ ప్రక్రియకు మధ్య వ్యవధిలో అంతరాన్ని ఇది తొలగిస్తుంది. ప్రయాణించనున్న సంబంధిత అధికారికి చివరి నిమిషంలో ఎదురయ్యే హడావుడిని నివారిస్తుంది.

దర్పణ్: డిఫెన్స్ అకౌంట్స్ రసీదులు, చెల్లింపు వ్యవస్థ అనేది థర్డ్ పార్టీ బిల్లు చెల్లింపు, అకౌంటింగ్ ప్రక్రియ కోసం రూపొందిన ఏకీకృత పరిష్కారం. వివిధరకాల అకౌంటింగ్ ప్రక్రియలకు, ఆర్థిక పనితీరుకు ఒక సమగ్రస్థాయి పరిష్కారంగా ఇది ఉపయోగపడుతుంది.

రక్షణ చెల్లింపు పౌర వ్యవస్థ: పూర్తిగా ఆధునికీకరించిన కేంద్రీకృత, స్వయంచాలక వ్యవస్థ ద్వారా రక్షణ పౌరులందరికీ వేతనాల పంపిణీని ఈ వ్యవస్థ రూపొందిస్తుంది. రక్షణ ఖాతాల యూనిట్లు, ప్రిన్సిపల్ డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోల్/సెంట్రల్ డిఫెన్స్ కంట్రోల్ కార్యాలయాలు ఈ వ్యవస్థతో అనుసంధానమై ఉంటాయి. దీనితో ఆయా యూనిట్లు చెల్లింపు ప్రక్రియ తాజా స్థితిని పోర్టల్‌లోనే సరిచూసుకునే అవకాశం ఉంటుంది.

ఈ అప్లికేషన్ వ్యవస్థ ప్రారంభం కావడంతో డిజిటల్ పరిజ్ఞానంతో పనిచేయగల మానవ వనరుల నిర్వహణా వ్యవస్థలో ఈ శాఖ ప్రవేశించినట్టయింది. ఇ–సర్వీస్ బుక్, లీవ్ మేనేజ్‌మెంట్, పే రోల్ జనరేషన్, ప్రమోషన్ వివరాలు వంటి పలు స్వయంసేవక మాడ్యూల్స్‌ను ఈ ప్లాట్‌ఫామ్‌లో పొందుపరిచారు. ఇవి మొబైల్ యాప్ ద్వారా ఉద్యోగులకు ఎక్కడైనా ఎప్పుడైనా అందుబాటులో ఉంటాయి.

పి.ఎ.ఒ.–భారతి: సాయుధ బలగాల సిబ్బంది వేతనాలు, అలవెన్సుల చెల్లింపులు, క్లెయిమ్‌లకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఈ వ్యవస్థ ద్వారా పొందడానికి వీలుంటుంది. దీనికి తోడుగా, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐ.వి.ఆర్.ఎస్.) ద్వారా, సిబ్బంది తమ ఫిర్యాదులను ఫోన్ ద్వారా నమోదు చేయవచ్చు. ఫిర్యాదులకు కూడా 48 గంటల్లో సమాధానాలను పొందవచ్చు. ఏడు చెల్లింపులు, ఖాతాల కార్యాలయాల్లో (పి.ఎ.ఒ.లలో) ఈ వ్యవస్థ అమలవుతూ వస్తోంది. త్వరలో మిగిలిన కార్యాలయాల్లో కూడా అమలు చేస్తామని రక్షణ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇలా డిజిటల్ కార్యక్రమాలను అవలంబించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' మంత్రాన్ని సాకారం చేసినందుకు రక్షణ ఖాతాల శాఖను (డి.ఎ.డి.ని) ఆయన ఎంతగానో ప్రశంసించారు. "సాంప్రదాయ విలువలతో అనుసంధానాన్ని కొనసాగిస్తూనే, ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా రక్షణ ఖాతాల శాఖ అభివృద్ధి చెందుతోంది" అని ఆయన అన్నారు.

ఆర్థిక వివేచన ద్వారా రక్షణసేవల శాఖ ఆర్థిక వనరులను నిర్వహించడంలో డి.ఎ.డి. పోషించిన కీలక పాత్రను కూడా రాజనాథ్ సింగ్ అభినందించారు. "భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతోంది. 2047 నాటికి ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒకటిగా అవతరించేందుకు 'అమృత్ కాల్'లో మందుకు సాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నూతన విశ్వాసం, సంకల్పంతో దేశం పురోగమిస్తోంది. స్వావలంబనతో 'ఆత్మనిర్భర్' స్థాయిలో రక్షణ పరిశ్రమలు అత్యాధునిక ఆయుధాలు/పరికరాలతో బలమైన సైన్యాన్నికలిగి ఉంటేనే ఈ లక్ష్యాన్ని సాధించేందుకు వీలుంటుంది. జాతీయ భద్రతను పటిష్టం చేయడం తొలినుంచి మన ప్రాధాన్యతగా ఉంటోంది. 2022–23లో రక్షణ మంత్రిత్వ శాఖకు మొత్తం రూ.5.25 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం సాటిలేని మన సంకల్ప బలానికి నిదర్శనం. ఈ ప్రయత్నంలో రక్షణ ఖాతాల శాఖ తన వంతు పాత్ర పోషిస్తోంది" అని రాజనాథ్ సింగ్ అన్నారు.

రక్షణ ఉత్పత్తిలో 'ఆత్మనిర్భరత' దృక్పథాన్ని సాకారం చేయడంలో రక్షణ మంత్రిత్వ శాఖ పోషించగల కీలక పాత్రను రాజ్‌నాథ్ సింగ్ ప్రధానంగా ప్రస్తావించారు. "2022–23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో 68 శాతం దేశీయ పరిశ్రమకు మూలధన సేకరణకు కేటాయించారు. రక్షణ తయారీ రంగంలో స్వావలంబన సాధించే విషయంలో ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను ఇది స్పష్టంగా సూచిస్తోంది. ప్రభుత్వ చేస్తున్న ఈ కృషికి మద్దతుగా సత్వర నిర్ణయాల ద్వారా రక్షణ శాఖ కూడా తగిన మద్దతు ఇవ్వాల్సి ఉంది. ఎందుకంటే జాప్యం జరిగితే డబ్బు నష్టంతో పాటు, దేశ పోరాట తత్వంపై ప్రతికూల ప్రభావం పడుతుంది." అన్నారు. రక్షణ మంత్రిత్వ శాఖలోని వివిధ అంశాల పనితీరు, సమర్థతపై పరిశీలనకోసం రక్షణ మంత్రి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీని గురించి ఆయన వివరించారు. మంత్రిత్వ శాఖలో జరుగుతున్న కృషిని నూతన, సృజనాత్మక దృక్కోణం నుండి ఈ కమిటీ ఆడిట్ ద్వారా సమీక్షిస్తుందన్నారు. ఈ ప్రక్రియలో డి.ఎ.డి. ఒక ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. దీనివల్ల సేవల సామర్థ్యం పెరగడమే కాకుండా వృథా ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. అకౌంటింగ్, బిల్లింగ్, చెల్లింపులు, అంతర్గత లెక్కల తనిఖీ అనేవి,.. రక్షణ మంత్రిత్వ శాఖలో (డి.ఎ.డి.) నిర్వహించే మూడు ప్రధాన పాత్రలు, తాజా సాంకేతిక పురోగతిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక సలహాలు, బిల్లింగ్–చెల్లింపులపై కొత్త పద్ధతిని రూపొందించేందుకు అందుబాటులోని అవకాశాలను అన్వేషించాలని ఆయన డి.ఎ.డి.కి సూచించారు. తమ శాఖాపరమైన విధులను ఇదే ఉత్సాహంతో, అంకితభావంతో డి.ఎ.డి. కొనసాగిస్తుందని, దేశ రక్షణ ఆర్థిక నిర్వహణకు ఇది దోహదపడుతుందని తాను ఆశిస్తున్నట్టు చెప్పారు. రక్షణ శాఖ కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్, సాయుధ బలగాల అధిపతి జనరల్ మనోజ్ పాండే, రక్షణసేవల ఆర్థిక సలహాదారు రసిక చౌబే, రక్షణ ఖాతాల అదనపు కంట్రోలర్ జనరల్ అవినాశ్ దీక్షిత్, రక్షణ మంత్రిత్వ శాఖలోని ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దళితుల ఆర్థిక ఎదుగుదలకే దళితబంధు : మంత్రి నిరంజన్‌రెడ్డి

కల్వకుర్తి, అక్టోబర్ 3:దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని తీసుకువచ్చారని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. దళితబంధు పైలెట్ ప్రాజెక్టుకింద కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆరు గ్రామాల లబ్ధిదారులకు సోమవారం జూపల్లి గ్రామంలో 304 మందికి యూనిట్లను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి వివక్ష, నిరాధరణకు గురై ఆర్థికంగా అణగారిన దళితులకు హక్కులు కల్పించిన తొలినేత సీఎం కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్ దళితబంధు మానసపుత్రిక అని, దళితబంధును పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో నాలుగు మండలాలను ఎంపిక చేయగా.. అందులో చారగొండ ఉండడం విశేషమన్నారు.

ఏదైనా సరే చెప్పి చేయడంలో కేసీఆర్‌కు సాటి మరెవరూ లేరన్నారు. రాష్ట్రంలో సంపదను పెంచేందుకు 75శాతం వ్యవసాయ రాష్ట్రంలో నదుల ద్వారా సాగునీరిచ్చి, 24 గంటల ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయంగా రైతుబంధు, రైతుబీమా ఇచ్చి ప్రజలకు పని కల్పించడం ద్వారా నేడు దేశానికి అన్నం పెట్టే స్థాయికి అత్యధిక వార్షిక ఆదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణా నిలిచిందన్నారు. ఒకసారి అవకాశం కల్పిస్తే కష్టపడి పని చేసి.. ఆర్థికంగా బలోపేతమైతే మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తారని దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఆమనగల్‌లో ఏడీఏ కార్యాలయం మంజూరు చేసి, త్వరలో ప్రారంబిస్తామన్నారు. కొత్త మండలాలకు గోదాములు త్వరలోనే మంజూర వుతాయన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పద్మావతి, ఎంపీ రాములు, ఎంఎల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, కలెక్టర్ ఉదయ్ పాల్గొన్నారు.

కర్ణాటక జెండాపై రాహుల్ ఫొటో.. కన్నడ సంఘాల ఆగ్రహం

బెంగళూరు, అక్టోబర్ 3: కర్ణాటకలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రపై వివాదం చెలరేగింది. కాంగ్రెస్ శ్రేణుల అతిపై కన్నడ అనుకూల సంఘాలు భగ్గుమంటున్నాయి. వెంటనే క్షమాపణ చెప్పి తప్పును సరిదిద్దుకోని పక్షంలో తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ఇంతకీ వివాదం ఏంటంటే..

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కర్ణాటకకు చేరింది. మైసూరు సమీపంలో రాహుల్‌ను చూడగానే కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ రెట్టింపైంది. అంతే బ్యానర్లు, పోస్టర్లు, జెండాలతో యాత్ర సాగే ప్రాంతాన్ని నింపేశారు. రాహుల్ యాత్ర కొనసాగుతుండగా కొందరు పార్టీ శ్రేణులు కర్ణాటక అధికారిక జెండాను పట్టుకుని కదలడం కనిపించింది. పసుపు, ఎరుపు రంగుల్లో ఉన్న ఈ జెండా కర్ణాటక జెండాగా పరిగణిస్తారు. ఈ జెండాపై స్థానిక కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ గాంధీ బొమ్మను కూడా ముద్రించి ప్రదర్శించారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కర్ణాటక జెండాపై రాహుల్ బొమ్మను ముద్రించడం ముమ్మాటికీ కర్ణాటక ప్రాంతాన్ని అవమానించడమే అని కన్నడ అనుకూల

సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ఇలా కన్నడ జెండాపై రాహుల్ ఫొటోను ముద్రించడాన్ని ఖండిస్తున్నాం. కాంగ్రెస్ నేత సిద్ధరామయ్య అధికారంలో ఉన్న సమయంలో కన్నడ జెండాను మార్చారు. ఇప్పుడేమో కాంగ్రెస్ శ్రేణులు ఏకంగా కన్నడ జెండాపై రాహుల్‌ను ముద్రించారు. ఇది సిగ్గుచేటు' అని కర్ణాటక రెవెన్యూ మంత్రి అశోక్ మండిపడ్డారు. కన్నడ అధికారిక జెండాను రాహుల్ ముద్రించడంపై బేషరతుగా క్షమాపణలు చెప్పి చేసిన తప్పును సవరించుకోవాలని పలు కన్నడ అనుకూల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణలు చేప్పనట్లయితే ఎలా గుణపాఠం చెప్పాలో మాకు తెలుసునని వారు అంటుండటంతో కాంగ్రెస్ నేతల గొంతుల్లో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

2022 సెప్టెంబర్ నెలలో రూ.1,47,686 కోట్ల స్థూల జీఎస్టీ ఆదాయం సేకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: సెప్టెంబర్ 2022 నెలలో సేకరించిన స్థూల జీఎస్టీ రాబడి రూ. 1,47,686 కోట్లు, ఇందులో సీజీఎస్టీ రూ. 25,271 కోట్లు, ఎస్ జీఎస్టీ రూ.31,813 కోట్లు, ఐ జీఎస్టీ రూ. 80,464 కోట్లు (వస్తు దిగుమతులు రూ.41,215 కోట్ల తో సహా), సెస్ కింద రూ.10,137 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ. 856 కోట్లతో సహా).

ప్రభుత్వం ఐజీఎస్టీ నుండి సీజీఎస్టీకి రూ.31,880 కోట్లు, ఎస్జీఎస్టీకి రూ. 27,403 కోట్లను ఎప్పటిలాగే సర్దుబాటు చేసింది. సెప్టెంబర్ 2022 నెలలో సాధారణ సెటిల్‌మెంట్ల తర్వాత కేంద్రం, రాష్ట్రాల ఆదాయం సీజీఎస్టీకి రూ.57,151 కోట్లు, ఎస్జీఎస్టీకి రూ. 59,216 కోట్లు కేటాయింపు అయింది.

సెప్టెంబర్ 2022 నెల రాబడి గత సంవత్సరం ఇదే నెలలో జీఎస్టీ రాబడి కంటే 26% ఎక్కువ. వస్తువుల దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయాలు 39% ఎక్కువగా ఉన్నాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చే ఆదాయాలు (సేవల దిగుమతి తో సహా) గత సంవత్సరం ఇదే నెలలో ఈ వనరుల నుండి వచ్చిన ఆదాయం కంటే 22% ఎక్కువగా ఉన్నాయి.

ఇది ఎనిమిదవ నెల, ఇప్పుడు వరుసగా ఏడు నెలలు, నెలవారీ జీఎస్టీ ఆదాయాలు రూ. 1.4 లక్షల కోట్ల మార్కు కంటే ఎక్కువగా ఉన్నాయి. గత సంవత్సరం ఇదే కాలంలో సెప్టెంబర్ 2022 వరకు జీఎస్టీ రాబడిలో వృద్ధి 27% ఉంది, ఆగస్టు 2022 నెలలో, 7.7 కోట్ల ఇ-వే బిల్లులు జెనరేట్ అయ్యాయి. ఇది జూలై 2022 లో 7.5 కోట్ల కంటే స్వల్పంగా ఎక్కువ.

ఈ నెలలో రెండో అత్యధిక సింగిల్ డే కలెక్షన్ రూ. 49,453 కోట్లు సెప్టెంబర్ 20న రెండవ అత్యధిక 8.77 లక్షల చలాన్‌లు దాఖలయ్యాయి, తర్వాత 2022 జూలై 20న 9.58 లక్షల చలాన్‌ల ద్వారా కేవలం రూ. 57,846 కోట్లు సేకరించారు, ఇది సంవత్సరం ముగింపు రిటర్న్‌లకు సంబంధించినది. జీఎస్టిఎన్ ద్వారా నిర్వహిస్తున్న జీఎస్టీ పోర్టల్ పూర్తిగా స్థిరీకరణ అయింది. ఏ లోపాలు లేవని ఇది స్పష్టంగా చూపిస్తుంది. 30వ తేదీన ఎన్ఐసి నిర్వహిస్తున్న పోర్టల్‌లో ఎలాంటి లోపం లేకుండా 1.1 కోట్లకు పైగా ఇ-వే బిల్లులు, ఇ-ఇన్‌వాయిస్‌లు (72.94 లక్షల ఇ-ఇన్‌వాయిస్‌లు , 37.74 లక్షల ఇ-వే బిల్లులు) జెనరేట్ అయి సెప్టెంబర్‌లో మరో మైలురాయిని దాటింది.

దిగువ చిత్రం ప్రస్తుత సంవత్సరంలో నెలవారీ స్థూల జీఎస్టీ ఆదాయాల ట్రెండ్‌లను చూపుతుంది. సెప్టెంబర్ 2021 తో పోలిస్తే సెప్టెంబర్ 2022 నెలలో ప్రతి రాష్ట్రంలో సేకరించిన జీఎస్టీ రాష్ట్రాల వారీ గణాంకాలను టేబుల్ చూపుతుంది.

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం కోసం దరఖాస్తు సమర్పించడానికి ఆఖరు తేదీ 15 అక్టోబర్ 2022వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు 8వ తరగతిలో డ్రాప్ ఔట్ అవడాన్ని నిలువరించి, ద్వితీయ శ్రేణి విద్య కొనసాగించడాన్ని ప్రోత్సహించడం కోసం వారిలో ప్రతిభగల విద్యార్థులకు అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకం కింద స్కాలర్‌షిప్‌ల కింద 2022–23 సంవత్సరంలో ఎన్‌ఎంఎంఎస్ఎస్ కింద దరఖాస్తులను సమర్పించేందుకు తేదీని 15అక్టోబర్ 2022 వరకు పొడిగించారు. ప్రతి సంవత్సరం 9వ తరగతి నుంచి ఎంపిక చేసిన విద్యార్థులకు కొత్తగా లక్ష స్కాలర్‌షిప్‌లను అందించనున్నారు. దీనితో పాటుగా, రాష్ట్ర ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10 నుంచి 12 తరగతులలో ఉన్న వారికి స్కాలర్‌షిప్ కొనసాగింపు/ పునరుద్ధరణ చేయనున్నారు. సంవత్సరానికి స్కాలర్‌షిప్ మొత్తం రూ. 12000/– గా ఉండనుంది.

విద్యార్థుల అందించే స్కాలర్‌షిప్ పథకాల కోసం ఏర్పాటు చేసిన వన్ స్టెప్ వేదిక అయిన నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పి) లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పథకాన్ని (ఎన్‌ఎంఎంఎస్ఎస్) చేర్చడం జరిగింది. ఎన్‌ఎంఎస్ఎస్ స్కాలర్‌షిప్‌లను డిబిటి పద్ధతిని అనుసరించి పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పిఎఫ్ఎంఎస్ – ప్రజా ఆర్థిక నిర్వహణ వ్యవస్థ) ద్వారా ఎంపిక చేసిన విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లలోకి నేరుగా పంపిణీ చేయనున్నారు. ఇది 100% కేంద్ర ప్రాయోజిత పథకం.

తల్లిదండ్రుల ఆదాయం అన్ని మార్గాల నుంచి ఏడాదికి రూ. 3,50,000/– కు మించకుండా ఉన్నవారు స్కాలర్‌షిప్‌లను పొందేందుకు అర్హులు అవుతారు. స్కాలర్‌షిప్ పొందేందుకు నిర్వహించే ఎంపిక పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు 7వ తరగతి పరీక్షలలో కనీసం 55% మార్కులు లేదా సమానమైన గ్రేడ్‌ను పొంది ఉండాలి (ఎస్/ ఎస్‌టి విద్యార్థులకు 5% సడలింపు).

ఐఎన్ఒ స్థాయి (ఎల్1) ధ్రువీకరణకు చివరి తేదీ 31 అక్టోబర్ 2022 కాగా, డీఎన్ఒ స్థాయి (ఎల్2) ధ్రువీకరణకు ఆఖరు తేదీ 15 నవంబర్, 2022.

స్వర్ణరథంపై కన్నులపండువగా శ్రీ వేంకటాద్రీశుడి విహారం

తిరుమల, అక్టోబర్ 3: శ్రీవారి నవహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వర్ణరథంపై శ్రీవేంకటాద్రీశుడు విహరించి భక్తులను అనుగ్రహించారు. ఆరవ రోజైన ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు శ్రీవారు బంగారు తేరులో పయనించి భక్తుల్ని తన కృపాకటాక్షాలతో అనుగ్రహించాడు. దాసభక్తుల నృత్యాలతోను, భజనబృందాల కోలాహలం, మంగళవాయిద్యాల నడుమ తిరు మాడవీధుల్లో కడురమణీయంగా స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి స్వర్ణరథన్ని లాగారు.

స్వర్ణరథంపై ఆసీనుడైన శ్రీవారికి శ్రీ, భూదేవులు ఇరుప్రక్కలా ఉన్నారు. శ్రీదేవి సువర్ణమయి. ఆమే బంగారు కాగా, ఆమెను భరించే స్వామికి బంగారు రథంలో ఊరేగడం ఎంతో ఆనందం. బంగారం శరీరాన్ని తాకుతుంటే శరీరంలో రక్త ప్రసరణ చక్కగా జరుగుతుంది. బంగారం మహా శక్తిమంతమైన లోహం. స్వామివారికి కృష్ణావతారంలో దారుకుడు సారథి, శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలనేవి నాల్గు గుర్రాలు. శ్రీవారి ఇల్లు బంగారం, ఇల్లాలు బంగారం, ఇంట పాత్రలు, సింహాసనం బంగారువి. అందుకని స్వర్ణరథం శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది. ఇరువైపులా శ్రీదేవి, భూదేవి ఉండగా శ్రీవారు మధ్యలో ఉండి, స్వర్ణరథంలో ఊరేగడం.. స్వామివారి మహోన్నతినీ, సార్వభౌమత్వాన్నీ, శ్రీసతిత్వాన్నీ, భూదేవీనాథత్వాన్నీ సూచిస్తున్నది. ఈ స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల లక్ష్మీదేవి కరుణతో బంగారు, మణులు, సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్త ధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయి.

గజవాహనంపై ఊరేగిన శ్రీవారు

ఇలాఉండగా, శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆదివారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీ మలయప్పస్వామివారు గజ వాహనంపై భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా.. భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.

సర్వదుఃఖ విమోచని- సర్వవిఘ్న నివారిణి దుర్గమ్మ

దసరా పండుగలో ఆదిపరాశక్తి అమ్మవారి అనుగ్రహం పొందడం కోసం రోజుకోరీతిగా పూజలు చేస్తుంటాం. ఆషాఢమాసం ముగిసిందంటే వానలతోపాటు పండుగలూ మొదలవుతాయి. నవరాత్రులు చేసుకునే పండుగలు గణపతి నవరాత్రులు, రామ నవరాత్రులు, దేవీ నవరాత్రలు, ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు దేవీ నవరాత్రులు, పదవరోజు విజయదశమి దసరా పండుగ. ఈ పండుగ తొమ్మిది రోజులు గౌరీదేవిని పూజించాలని దేవీ పురాణం, రుద్రయామళం చెబుతున్నాయి. కనుకనే దేవీ నవరాత్రులను పరాశక్తి, ఆదిశక్తిని పూజించటం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. ఈ చరాచర సృష్టికి శక్తి స్వరూపుణిని హిందువులు దేశవిదేశాల్లో వారి ఆచారాన్ని బట్టి కొలిచి పూజించడం "దసరా పండుగ" స్త్రీ శక్తి విజయంగా అభివర్ణిస్తారు. అయితే దేవి పురాణం, రుద్రయామళంలలో పేర్కొన్నవిధంగా ఈ వర్షఋతువులో సంక్రమించే వ్యాధులనుండి ఉపశమనం పొందాలంటే ఈ ఆశ్వీయుజమాసారంభం నుండే ఏ ప్రాంతంలో నివసించే ప్రజలైనప్పటికీ, గౌరీదేవిని పూజించాలని పురాణాలు చెబుతున్నాయంటారు పండితులు. కనుకనే 'దేవీ నవరాత్రులైన' దసరా పండుగ ప్రాముఖ్యతను సంతరించుకుంది. హిందూమత సంప్రదాయంలో ఈ చరాచర సృష్టికి శక్తిస్వరూపిణి 'ఆదిపరాశక్తి' అని పేర్కొనడం ద్వారా దేశమంతా ఒక్కొ రాష్ట్రములో ఒక్కొ విధముగా, వారి వారి జీవనస్థితిగతుల్ని అనుసరించి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ విధంగా దసరా పండుగ ప్రాశస్త్యం గురించి తెలుసుకుందాం.

పురాణాల ప్రాశస్త్యం:

దేవి నవరాత్రుల నేపథ్యం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లోను భారతదేశంలోను, ప్రపంచవ్యాప్తంగా హిందువులు చాలా గొప్పగా జరుపుకునే పండుగగా చెప్పుకోవచ్చు. అందుకు పురాణ ఇతిహాసాల్లో అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. దేవీ నవరాత్రుల పరమార్థాలన్నీ ఎంతో ప్రాచీనమైనవని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. ఆర్యుల ప్రవేశానికి ముందు కాలంలో ద్రావిడులలో స్త్రీకి దేవ్యారాధన విస్తృతంగా ఉండేది. వారు తమ వేట, వ్యవసాయానికి, వృత్తులకు దేవతలను కొలిచేవారు. ఈ ఆచారం నేటికీ గ్రామసీమల్లో దేవతలుగా స్త్రీలనే ఆరాధించడం కనబడు తుంది. ద్రావిడులలో స్త్రీలకు ప్రాధాన్యం ఇచ్చి ఆవె అజవమాయిషీలో కుటుంబం నడపబడుతుండేది. నవరాత్రులు సందర్భంగా ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమి వరకు తొమ్మిది రోజులు "దేవీని" భక్తి ప్రపత్తులతో ఆరాధిస్తారు. ఈ తొమ్మిది రోజులకు 'దేవీ నవరాత్రులు" అన్న పేరు ప్రశస్తమై నిలిచింది. ఈ దేవీ నవరాత్రులనే శరన్నవరాత్రులుగా పేర్కొనడం జరిగింది. తొమ్మిది రోజులు చేసే పూజోత్సవాన్ని వివిధ ప్రాంతాల్లో దేవీ వేరు వేరు పేర్లతో కొలవబడుతుంది. దేవికి తొమ్మిది నామాలలో మూడు రకాలుగా సాత్విక, రాజస, తామస పద్ధతులలో ఈ పూజను చేస్తారు. దేవికి తొమ్మిది రోజులు రకరకాల నైవేద్యాలు సమర్పిస్తారు. శ్రీరాముడు రావణునితో యుద్ధం చేసేసందర్భంలో రావణుని సంహారం కష్టతరం కావడంతో, ఆ సమయంలో తనకు విజయం సంప్రాప్తిమ్మాలని 'దేవిని' పూజించినట్లుగా చెబుతారు. ఆ పూజ ఆశ్వీయుజ శుద్ధ ప్రథమ (పాడ్యమి) మొదలుకుని నవమి వరకు తొమ్మిది

రోజులు చేసారని పదవ రోజు "దశమి" నాడు రాముడికి రావణ సంహారం జరిగి విజయం లభించిందని పురాణకథ. మన పురాణాలు పరిశీలిస్తే 'దేవి', మహాకాళీ, మహామాయగా అవతరించి మధుకైటభులను సంహరించినందున 'మహిషాసురమర్ధిని', మహా సరస్వతిగా, దేవి ఫాలం నుండి పుట్టినటువంటి చాముండ, సుంభ, నిసుంభులను, రక్త బీజుని వధించిందని, నందుని ఇంట పుట్టిన 'నంద' కంసుడు ఈమెను చంపేందుకు పైకి ఎగురవేయగా ఆమె నీ ప్రాణాన్ని హరించడానికి నీ ప్రాణశత్రువు (శ్రీ కృష్ణుడు) నందుడి ఇంట్లో పెరుగుతున్నాడని హెచ్చరించి మాయమవుతుంది. ఇంకా 'రక్తదంతి' అవతారంలో రాక్షసులను చీల్చివేయడంవల్ల ఈ పేరుతొ కొలుస్తారు. 'శాకాంబరి' ఒకప్పుడు కరువు ఏర్పడగా పూజలందుకున్నది. దుర్గ 'దుర్గముడు'అనే రాక్షసుని సంహరించినందువల్ల దుర్గగా పిలవబడుతోంది 'మాతంగి' అవతారంలో అరుణుడనే రాక్షసుడిని భ్రమరాలు (తుమ్మెదల) సాయంతో చంపడంవల్ల భ్రమరీ అనే పేరు పొందింది. ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమినాడు కలశస్థాపన చేసి దేవీమూర్తిని అందులో ఆవాహనం చేసి, నవరాత్రి వరకు దీక్షతో దేవీ పూజ చేస్తారు. ఆ విధంగానే కాక దేవీమూర్తిని పెట్టి తొమ్మిది రోజులు పూజలు జరిపి నిమజ్జనం చేయడం కూడా ఆచారంలో ఉంది. శ్రీ చక్ర పూజ కూడా దేవీ పూజా సందర్భంలో జరుపుతారు. ఈ తొమ్మిది రోజులు కన్యకపూజ, సుమంగళీ పూజ, జపహోమాదులతో విశేష పూజలు జరుపుతారు. నవమినాడు 'మహాచండీయాగం' కూడా కొన్ని చోట్ల చేస్తుంటారు. దశమి నాడు ఉదయం 'దేవీ' ప్రస్థానం జరుగుతుంది. మూలానక్షత్రం రోజు సరస్వతి పూజతో నవమి రోజున లోహాభిసారికమంటే రాజ చిహ్నాలను, గజాశ్వాదులను, చాపఖడ్గద్యాయుధాలను పూజించడం దానినే నేడు ఆయుధ పూజగా జరుపుకుంటారు.

రాజరిక వ్యవస్థలో "దేవి" ఉపాసన :

మహాభారతంలో కూడా దేవీ ప్రసక్తి రెండు పర్యాయాలు వచ్చింది. పాండవులు విరాటరాజు కొలువుకు వెళ్లబోయే ముందు, యుధిష్ఠరుడు 'దుర్గను' ప్రార్థించడం మొదటిది. కురుక్షేత్రం నందు కృష్ణుని సలహాపై అర్జునుడు చేసిన 'దుర్గాస్తుతి' రెండవది. ఈ విధంగా భారత, రామాయణ గ్రంథాలలో దేవి ప్రసక్తి ఆ దేవికి ఉన్న ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. మన పురాణాల్లో లక్ష్మి, పార్వతి, సరస్వతి వీరు ముగ్గురు 'శక్తి' స్వరూపిణికి మూడు అంశలు అని పేర్కొనడం జరిగింది. అలాగే లక్ష్మి, సరస్వతులు వీరిద్దరూ 'దుర్గాదేవి అంశ గలవారని వారిద్దరిని పూజించినచో దుర్గాదేవిని పూజించిన ఫలితం దక్కుతుందని చెప్పబడింది. "కేనోపనిషత్తులో" దుర్గాదేవిని ఈ విధంగా వర్ణించారు. ఆమె ఒక కాంతి పుంజం వంటిదని, జగత్తునకు వెలుగును ఇచ్చే ఆ సూర్యభగవానునే ప్రకాశింప జేయునది ఆమెయేనని, వాయుదేవతని, సమస్త ప్రాణి అన్ని దుర్గామాతయే "సర్వం శక్తిమయం" అనడంలో సందేహం లేదు. సృష్టికంతయు మూలాధారమైన శక్తి స్వరూపమే, పలు విధాలుగా శక్తిమూర్తులై పూజలందుతున్నట్లు, తూర్పు చాళుక్యులు కాలంలో 'కూష్మాండినీ' దేవిగా పూజింపబడింది. కందుకూరి చోడుల కాలంలో ప్రజలు మహిషాసురమర్ధిని, బ్రహ్మీ, మహేశ్వరీ, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండి, సరస్వతి దేవి మొదలైన స్త్రీ దేవతలను పూజించారు. శైవం ఆనాడు ప్రబలంగా ఉండేవి. చాళుక్యులు, చోళులు, పల్లవులు వీళ్లంతా వీరశైవమతానుయాయులు. జంతు బలులు కూడా వీరి కాలంలో ప్రబలంగా ఉండేవి. కాకతీయుల కాలంలో ఏకవీర, రేణుక, చాముండేశ్వరి మొదలగు దేవతలు పూజలందుకున్నారు. వీరి కాలంలో దుర్గాష్టమి పూజలు విశేషంగా వైభవోపేతంగా జరుపబడేవి. గౌరీ, కాకతీ, పద్మాక్షి, కూష్మాండిని పూజలు జరిగేవి. ఆశ్వీయుజ అమావాస్య నుండి అష్టమి వరకు దేవీ పూజలు జరిగేవి. దశమినాడు దసరా పండుగ జరిగేది. ఈ కాలంలో గౌరీ, లక్ష్మి, పార్వతులకు ప్రతిరూపంగా "బతుకమ్మ" పండుగను స్త్రీలు ఆచరించేవారని, పూలబతుకమ్మను దేవతగా, శక్తి స్వరూపిణిగా భావించి పూజించేవారని తెలుస్తుంది. రేణుకాదేవి 'ఎల్లమ్మ' దేవతగా పూజలందుకున్నది. ఈనాటికీ కూడా ఈమె పూజలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెలంగాణ అంతటా రాష్ట్ర పండుగగా ప్రతి వీధిలో, వాడవాడలా, విదేశాల్లో సైతం ఘనంగా జరుపుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలో కూడా ఈ పండుగ జరుపుకుంటారు. రేచర్ల పద్మ నాయకుల కాలంలో వైష్ణవం, శైవం కూడా ఉండేవి. వీరి కాలంలో కాళికాదేవి, దుర్గాదేవి, చండి, భద్రకాళి, మహిషాసురమర్దని పూజలు వ్యాప్తిలోకి వచ్చాయి. గ్రామ దేవతలు కట్ట మైసమ్మ, రేణుకమ్మ, మొదలైన వారు ఉండేవారు. రెడ్డి రాజుల కాలంలో కూడా శక్తి పూజలు వ్యాప్తిలోకి వచ్చాయి. పార్వతీదేవి, భద్రకాళి, దుర్గ, చండి, కాళికా రూపాలలో దేవి పూజలందుకుంది. క్రీడాభిరామంలో పరశు రాముని తల్లియు-జమదగ్ని భార్య అయిన రేణుకాదేవిని, ఏకవీరా దేవిగా పూజించే వారని, ఆమె పార్వతివలె, ఆదిశక్తి అఖిల వేద వేదాంతసారమని చెప్పబడింది. ఆమె కోపించిన సామ్రాజ్యాలు క్షణంలో నాశనమగునట. శక్తి పూజ తాంత్రిక విధానంతో సంబంధించినది. విజయనగరంలోని నవరాత్రి ఉత్సవాలు చూడడానికి దేశవిదేశాల నుండి ఎంతోమంది యాత్రికులు విజయనగరానికి వచ్చేవారు. ఆ తొమ్మిది రోజులు చక్రవర్తి విజయమంటపానికి ఉదయమే వచ్చి దుర్గపూజ చేసేవాడట. ఆ పూజపుష్పాలు తన ప్రీతి పాత్రములైన గుర్రాలు, ఏనుగుల మీద చల్లి, తర్వాత దుర్గాదేవికి నివేదించిన ప్రసాదాలను స్వీకరించేవారని 'నన్నిజూ' తన చారిత్రక గ్రంథంలో పేర్కొన్నాడు. ఆ విధంగా దేవి ఆరాధన అనాదిగా ఉందని తెలుస్తున్నది. అదిమానవుడి కాలం నుంచే ప్రారంభంమైన దేవీ ఉపాసన ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది. దేవి "స్త్రీ శక్తికి" ప్రతిరూపంగా నిలిచి పూజలు అందుకుంటుంది.

ఇంద్రకీలాద్రిపై అఖిలాండ కోటి బ్రహ్మండ నాయకి బెజవాడ కనకదుర్గమ్మ :

దక్షిణ భారత దేశంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమై కృతయుగం నాటి కోవెల బెజవాడ దుర్గమ్మ కొలువుండే ప్రధానాలయం బంగారు గోపురంతో ఉంటుంది. శ్రీ చక్ర అధిష్టాన దేవత, పరమ పవిత్రమైన ఇంద్రకీలాద్రి మీద ఇంద్రాది దేవతల కోరిక మీద దుర్గాదేవి మహిషాసురమర్దని స్వరూపంతో స్వయంభూగా వెలసి కోరిన వారికీ కొంగు బంగారమై "బెజవాడ దుర్గమ్మ"గ కీర్తి పొందుతున్నది. అమ్మవారి ఆలయానికి ఉత్తర భాగంలో ఉన్న భాగంలో అత్యంత ప్రాచీనమైన ఆలయం మల్లేశ్వరస్వామివారి ఆలయం అమ్మవారి భర్త అయిన పరమేశ్వరుడు వెలిసిన ఈ పవిత్రమైన ఆలయంలో అమ్మవారిని దర్శించిన ప్రతిఒక్కరు విధిగా మల్లేశ్వరస్వామి వారిని తప్పకుండా దర్శించాలి. క్షేత్రపాలక అంజనేయస్వామి, నాగేంద్రుడిపుట్ట, విఘ్నేశ్వరుడు, నటరాజస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరాలయం, పార్వతి పరమేశ్వరుల కళ్యాణం జరిపే మంటపం ఉంటుంది. ఈ దసరా ఉత్సవాల్లో దేశం నలుమూలల నుండి దుర్గమ్మని దర్శించుకోవాలని తపనపడతారు. లోకకంటకుడైన దుర్గమాసురుడి సంహారానంతరం ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ మహారౌద్రంగా ఉండేదట. అటువంటి రౌద్ర స్వరూపిణిని పరమశాంతి స్వరూపిణిగా మార్చాలనే సంకల్పంతో శ్రీ జగద్గురు అది శంకరాచార్యులవారు ఇక్కడికి వచ్చి అమ్మవారి సన్నిధిలో శ్రీ చక్ర యంత్రాన్ని స్వయంగా ప్రతిష్టించారు. అంతే ఆనాటి నుండి దుర్గమ్మ భక్తులకు శాంతి స్వరూపిణిగా మారి దర్శనమిస్తుంది.

శ్రీ చక్ర రాజ నిలయా శ్రీమత్రిపుర సుందరీ
శ్రీ శివా శివ శక్త్యైక స్వరూపిణి లలితాంబికా

అని లలితాసహస్రనామస్తోత్రంలో చెప్పినట్లుగా సృష్టి స్థితి లయకారిణి అయిన ఆదిశక్తి దుర్గమ్మ పవిత్రమైన లలితా స్వరూపిణిగా నిత్యం లలితాసహస్రనామాలతోనే అర్చించటం జరుగుతోంది. దసరా దుర్గమ్మ దర్శనం శుభకరం. స్త్రీల పసుపు కుంకుమలతో కలకాలం వర్ధిల్లెందుకు, సౌభాగ్యానికి నిత్యం లలితా సహస్రనామ స్తోత్రం పారాయణ చేయాలంటారు.

దర్శనీయ స్థలాలు:

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రాలో బెజవాడ కనకదుర్గమ్మ, తెలంగాణ ప్రాంతంలో జూబ్లిహిల్స్ పెద్దమ్మ, శంకరమఠం శృంగేరి శారద, వరంగల్‌లోని భద్రకాళి, వేములవాడ రాజరాజేశ్వరిదేవి, కలకత్తా నగరంలో కాళీమాత, మైసూరు చాముండేశ్వరీ హిందువులు జరుపుకొనే దసరా పండుగ, నవరాత్రులు, విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయంగా జరుపుకుంటుంది. హిందూ మతంలో ఇతిహాసాలలో దేవత చాముండేశ్వరి (దుర్గా) మహిషాసురున్ని వధించిన రోజు. మహిషాసురున్ని దేవతా సంహారంతో కర్ణాటక రాష్ట్రంలోని నగరానికి మైసూరు అనే పేరు వచ్చింది. మైసూరులో ఈ పండుగ సంప్రదాయం సమయంలో యోధులు, మంచికోసం పోరాడినట్లుగాను ఆ రాష్ట్ర ఖడ్గం, ఆయుధాలు, ఏనుగులు, గుర్రాలతో పాటు దుర్గాదేవి దేవతతో పాటు వారి యోధుడు రూపంలో (ప్రధానంగా) అలాగే విష్ణువు అవతార లో రాముని పూజించి ఉత్సవంగా వేడుకలు, ప్రధాన ఊరేగింపు సాంప్రదాయకంగా మైసూరు రాజుచే నిర్వహించబడుతుంది. మైసూరు నగరం ఈ సంప్రదాయాన్ని ఇప్పటికి కొనసాగిస్తుంది. గుజరాత్ రాష్ట్రంలో పార్వతీదేవిగా ప్రతిఒక్కరి ఇంటిలో శక్తిపూజలు జరుగుతాయి. ఈ విధంగా భారతదేశంలోని శక్తి పీఠాలన్నింటిలో దసరా పండుగ సందర్భంగా భక్తజనులు ఆలయాలన్నింటిలో వివిధ రూపాలలో ఉన్న ఆదిపరాశక్తిని దర్శించుకునేందుకు తండోపతండాలు కదలివస్తారు. ఆ సమయంలో కిక్కిరిసిన జనంతో ఆలయాలన్ని కిటకిటలాడుతూ ఉంటాయి.

జమ్మిచెట్టుకు పూజ:

తొమ్మిదిరోజులు గౌరీదేవీని అనేక రూపాల్లో పూజించిన తదుపరి విజయదశమి నక్షత్రదర్శన సమయాన జమ్మిచెట్టు వద్ద

శమీ శమయతే పాపం
శమీ శతృవినారిణి।
అర్జునస్య ధనుర్ధారీ
రామస్య ప్రియదర్శినీ॥ అనే శ్లోకం చదివి జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేసిన అనంతరం జమ్మి చెట్టు ఆకులు (బంగారం) తెంపుకుని పెద్దలకిచ్చి వారికీ దండం పెట్టి ఆశీర్వాదం తీసుకుంటారు.

శుభం భూయాత్!
సర్వేజనాః సుఖినో భవంతు!

-శారద శృంగేరి
94902 61119

చాకలి ఐలమ్మ చరిత్ర

(ఉయ్యాల పాట)

ఉమ్మడి వరంగల్లు ఉయ్యాలో..
ఉద్యమాల జోరు ఉయ్యాలో..

తెలంగాణ పోరులో ఉయ్యాలో...
తెగువ జూపెటోళ్ళు ఉయ్యాలో...

ఆ ఉద్యమ నేలన ఉయ్యాలో...
పోరు చుక్క పొడిచే ఉయ్యాలో...

ఆ పోరు చుక్కనే ఉయ్యాలో...
చిట్యాల ఐలమ్మ ఉయ్యాలో...

చిట్యాల ఐలమ్మ ఉయ్యాలో..
చాకలి ఐలమ్మే ఉయ్యాలో..

సద్దుల బతుకమ్మ ఉయ్యాలో..
పండుగ రోజునే ఉయ్యాలో..

అణగారిన వర్గాల్లో ఉయ్యాలో..
ఉదయించే కిరణమై ఉయ్యాలో..

కిష్టాపురం లో పుట్టి ఉయ్యాలో...
పాలకుర్తి ఇల్లాలు ఉయ్యాలో...

దేశముఖు దొరలు ఉయ్యాలో...
పటేల్లు పట్వారి ఉయ్యాలో...

న్యాయ రక్షణ లేని ఉయ్యాలో...
నైజాము తొత్తులు ఉయ్యాలో...

తెలంగాణ పల్లెలు ఉయ్యాలో..
భయంగా బతికేవి ఉయ్యాలో...

దొరల కాలంలో ఉయ్యాలో..
రెక్కల కష్టమే ఉయ్యాలో...

కుటుంబ పోషణకు ఉయ్యాలో..
కులవృత్తే జీవనం ఉయ్యాలో...

చాకలి ఐలమ్మ ఉయ్యాలో...
భూమి కౌలు చేసే ఉయ్యాలో...

పాలకుర్తి పటేలు ఉయ్యాలో...
కన్నెర జేసిండు ఉయ్యాలో...

వెట్టి చేసే నీకు ఉయ్యాలో..
భూమి సాగెందుకని ఉయ్యాలో...

తన భూమిలోనే ఉయ్యాలో...
వెట్టి జేమనే ఉయ్యాలో...

పటేల్ల మాటలను ఉయ్యాలో..
ఖాతరు చేయలే ఉయ్యాలో..

వెట్టి చేయనని ఉయ్యాలో...
గట్టిగా చెప్పింది ఉయ్యాలో...

ఆంధ్ర మహాసభలో ఉయ్యాలో...
ఐలమ్మ చేరింది ఉయ్యాలో..

విసునూరు దొరలకు ఉయ్యాలో...
విషయం తెల్వగానే ఉయ్యాలో...

తిరుగుబాటును అణచ ఉయ్యాలో..
కక్ష పెంచుకొనె ఉయ్యాలో..

కేసుల్లో ఇరికించి ఉయ్యాలో...
అరిగోస పెట్టింద్రు ఉయ్యాలో...
ధాన్యాన్ని ఎత్తుకెళ్లి ఉయ్యాలో...
ఇల్లు తగలబెట్టె ఉయ్యాలో..

ఐలమ్మ కూతుర్ని ఉయ్యాలో...
ఆగమాగం జేసే ఉయ్యాలో...

పాలకుర్తి దొరలు ఉయ్యాలో...
పాపిష్టి దొరలు ఉయ్యాలో...

కష్టాలెన్ని పెట్టినా ఉయ్యాలో..
వణకలే జనకలే ఉయ్యాలో...

దొరల అరాచకాలను ఉయ్యాలో..
అంతం చేయాలని ఉయ్యాలో...
భూమి భుక్తికై ఉయ్యాలో..
వెట్టి విముక్తికై ఉయ్యాలో..

రోకలి బండ పట్టి ఉయ్యాలో...
దొర గుండాలనెదురించే ఉయ్యాలో..



-రాచర్ల శ్రీనివాస్
9704246125

భారత తెలంగాణ

వజ్రోత్సవాల ఉయ్యాల పాట

అక్కలారా రండి ఉయ్యాలో
చెల్లెలారా రండి ఉయ్యాలో
అమ్మ భారతి కథను ఉయ్యాలో
పాడుకుందామమ్మ ఉయ్యాలో

ఒకనాటి కాలాన ఉయ్యాలో
భూలోకమందున ఉయ్యాలో
పుణ్యభూమి మనది ఉయ్యాలో
ధర్మభూమి మనది ఉయ్యాలో

నాల్గు వేదమ్ములు ఉయ్యాలో
పుట్టినాయిక్కడ ఉయ్యాలో
శ్రీరామచంద్రుడు ఉయ్యాలో
పుట్టినాడిక్కడ ఉయ్యాలో

శ్రీకృష్ణుడిక్కడ ఉయ్యాలో
తిరిగినాడోయమ్మ ఉయ్యాలో
ధర్మరాజిక్కడ ఉయ్యాలో
పాలించినాడమ్మ ఉయ్యాలో

పాడిపంటలతోటి ఉయ్యాలో
రత్న రాసులతోటి ఉయ్యాలో
ధన ధాన్యములతోటి ఉయ్యాలో
తులతూగినాదమ్మ ఉయ్యాలో

బంగారు పక్షి యని ఉయ్యాలో
పిలిచినారోయమ్మ ఉయ్యాలో
రత్నగర్భ యని ఉయ్యాలో
కొనియాడినారమ్మ ఉయ్యాలో

స్వర్గసీమ యని ఉయ్యాలో
పేరొందినాదమ్మ ఉయ్యాలో
విశ్వగురువు యని ఉయ్యాలో
ఖ్యాతి గాంచినదమ్మ ఉయ్యాలో

ఇటువంటి దేశాన్ని ఉయ్యాలో
శత్రువులు జూసింద్రు ఉయ్యాలో
దుర్మార్గులెందరో ఉయ్యాలో
దాడులు జేసింద్రు ఉయ్యాలో

ఊరు ఊరూ దిరిగి ఉయ్యాలో
పల్లె పల్లే దిరిగి ఉయ్యాలో
దేశ సంపదనంత ఉయ్యాలో
దోచుకొని పోయింద్రు ఉయ్యాలో

దేవాలయాలను ఉయ్యాలో
కూలగొట్టినారు ఉయ్యాలో
విద్యాలయాలను ఉయ్యాలో
తగులబెట్టినారు ఉయ్యాలో

ఛత్రపతి శివాజీ ఉయ్యాలో
రాణాప్రతాపుండు ఉయ్యాలో
ఎందరో వీరులు ఉయ్యాలో
యుద్ధాలు జేసింద్రు ఉయ్యాలో

ధర్మ రక్షణకయ్యి ఉయ్యాలో
దేశ రక్షణకయ్యి ఉయ్యాలో
పోరాటములు జేసి ఉయ్యాలో
ప్రాణాలు ఇచ్చింద్రు ఉయ్యాలో

ఒకరెనుక ఒకరొచ్చి ఉయ్యాలో
రాజ్యమేలినారు ఉయ్యాలో
వ్యాపారమని చెప్పి ఉయ్యాలో
తెల్లదొరలొచ్చింద్రు ఉయ్యాలో

కులము పేరు జెప్పి ఉయ్యాలో
మతము పేరు జెప్పి ఉయ్యాలో
భారతీయులనంత ఉయ్యాలో
విడదీసినారమ్మ ఉయ్యాలో

ఐకమత్యం లేక ఉయ్యాలో
భారతీయులంత ఉయ్యాలో
బలహీనమైనారు ఉయ్యాలో
బానిసలు అయినారు ఉయ్యాలో

దేశ భక్తులంత ఉయ్యాలో
ఒక్కటయ్యినారు ఉయ్యాలో
దేశ నాయకులంత ఉయ్యాలో
ఎదురు దిరిగినారు ఉయ్యాలో

గాంధీ మహాత్ముడు ఉయ్యాలో
ఆంగ్లేయులతోటి ఉయ్యాలో
ధర్మ మార్గమ్మున ఉయ్యాలో
పోరు సల్పినాడు ఉయ్యాలో

భగత్ సింగ్ మరియు ఉయ్యాలో
రాజగురు సుఖదేవ్ ఉయ్యాలో
పోరాటమే జేసి ఉయ్యాలో
ప్రాణాలు ఇచ్చింద్రు ఉయ్యాలో

వీరుల ధాటికి ఉయ్యాలో
తట్టుకోలేకను ఉయ్యాలో
ఆగ్లేయులంత ఉయ్యాలో
వెళ్ళి పోయినారు ఉయ్యాలో

పందొమ్మిదొందల ఉయ్యాలో
నలభై ఏడులో ఉయ్యాలో
ఆగస్ట్ పదిహేనునుయ్యాలో
అర్థ రాత్రి వేళ ఉయ్యాలో

భరత దేశానికి ఉయ్యాలో
స్వాతంత్ర్యమొచ్చింది ఉయ్యాలో
భారతీయులంత ఉయ్యాలో
ఆనందమందిరి ఉయ్యాలో

దేశానికంతకు ఉయ్యాలో
స్వాతంత్ర్యమొచ్చినా ఉయ్యాలో
తెలంగాణాలోన ఉయ్యాలో
స్వాతంత్ర్యమే లేదు ఉయ్యాలో

ఆ కాలమందున ఉయ్యాలో
తెలంగాణలోన ఉయ్యాలో
నైజాము రాజ్యము ఉయ్యాలో
అమలులో వున్నది ఉయ్యాలో

రాక్షసుని పాలనా ఉయ్యాలో
నాడు ఉన్నాదమ్మ ఉయ్యాలో
తెలంగాణ ప్రజలు ఉయ్యాలో
బాధ పడబట్టిరి ఉయ్యాలో

నైజాము రాజుకు ఉయ్యాలో
పరమ కిరాతకుడు ఉయ్యాలో
ఖాసీము రజ్వీ ఉయ్యాలో
తోడుదొంగై వచ్చె ఉయ్యాలో

మానవత్వము లేని ఉయ్యాలో
రాక్షసుండోయమ్మ ఉయ్యాలో
పచ్చి నెత్తురు దాగె ఉయ్యాలో
పరమ దుర్మార్గుడు ఉయ్యాలో

తెలంగాణ యంత ఉయ్యాలో
కలెదిరిగినాడమ్మ ఉయ్యాలో
మాయ మర్మం లేని ఉయ్యాలో
మనవాళ్ళ జూసిండు ఉయ్యాలో

వరంగల్ జిల్లాలో ఉయ్యాలో
పరకాలయందున ఉయ్యాలో
బైరాన్ పల్లిలో ఉయ్యాలో
తెలంగాణ వీరులను ఉయ్యాలో

వరుసగా నిలబెట్టి ఉయ్యాలో
తుపాకులను బేల్చె ఉయ్యాలో
రక్తాలు గారంగ ఉయ్యాలో
ప్రాణాలు విడిచిరి ఉయ్యాలో

నల్గొండ జిల్లాలో ఉయ్యాలో
గుండ్రాంపల్లిలో ఉయ్యాలో
ప్రాణాలతో పట్టి ఉయ్యాలో
బావిలో పూడ్చారు ఉయ్యాలో

ఆడబిడ్డల పైన ఉయ్యాలో
పశువుల చందంబు ఉయ్యాలో
అత్యాచారములు ఉయ్యాలో
చేసినారోయమ్మ ఉయ్యాలో

పసిపిల్లలను గూడ ఉయ్యాలో
గాలిలోకెగిరేసి ఉయ్యాలో
కత్తులను చేబూని ఉయ్యాలో
ముక్కలుగ జేసింద్రు ఉయ్యాలో

పల్లె పల్లె దిరిగి ఉయ్యాలో
దోచుకున్నారమ్మ ఉయ్యాలో
గొఱ్ఱెలను మేకలను ఉయ్యాలో
చంపుకొని తిన్నారు ఉయ్యాలో

తెలంగాణ యంత ఉయ్యాలో
ఎక్కడా జూసినా ఉయ్యాలో
అల్లకల్లోలమై ఉయ్యాలో
అట్టుడికినాదమ్మ ఉయ్యాలో

ఆలేరు ప్రాంతాన ఉయ్యాలో
రేణుకుంటలోన ఉయ్యాలో
వీరుడు రాంరెడ్డి ఉయ్యాలో
ఎదురు దిరిగినాడు ఉయ్యాలో

తుపాకి బట్టిండు ఉయ్యాలో
శత్రువుల జంపిండు ఉయ్యాలో
నైజాము సైన్యము ఉయ్యాలో
చుట్టుముట్టినాది ఉయ్యాలో

వెనుక వైపునుండి ఉయ్యాలో
ముష్కరుండొక్కడు ఉయ్యాలో
వీరునికి గురిపెట్టి ఉయ్యాలో
తుపాకి పేల్చిండు ఉయ్యాలో

మరణము తప్పదని ఉయ్యాలో
తలపోసినాడమ్మ ఉయ్యాలో
కొడుకు రంగారెడ్డి ఉయ్యాలో
పక్కనే ఉన్నాడు ఉయ్యాలో

శత్రువుల చేతికి ఉయ్యాలో
కొడుకు చిక్కొద్దని ఉయ్యాలో
వీరుడు రాంరెడ్డి ఉయ్యాలో
తుపాకి బట్టిండు ఉయ్యాలో

తుపాకి గురిచూసి ఉయ్యాలో
కొడుకును కాల్చిండు ఉయ్యాలో
తండ్రి కొడుకులు గూడ ఉయ్యాలో
అమరులయ్యినారు ఉయ్యాలో

కొమురము భీముండు ఉయ్యాలో
రావి నారాయణ్రెడ్డి ఉయ్యాలో
ఆరుట్ల దంపతులు ఉయ్యాలో
ఇల దొడ్డి కొమురయ్య ఉయ్యాలో

నైజాము పాలనకు ఉయ్యాలో
ఎదురు దిరిగినారు ఉయ్యాలో
దొరతనం వద్దని ఉయ్యాలో
పోరు సల్పినారు ఉయ్యాలో

వీరవనితైనట్టి ఉయ్యాలో
చాకలి ఐలమ్మ ఉయ్యాలో
దొరలకు ఎదురెల్లి ఉయ్యాలో
పోరుసల్పినాది ఉయ్యాలో

సుద్దాల హన్మంతు ఉయ్యాలో
బండి యాదగిరి ఉయ్యాలో
ఉద్యమం పాటలు ఉయ్యాలో
రాసి పాడినారు ఉయ్యాలో

నైజాము పాలనను ఉయ్యాలో
అంతమొందించుటకు ఉయ్యాలో
భారత సర్కారు ఉయ్యాలో
సైన్యమును దించింది ఉయ్యాలో

ఉక్కు మనిషయ్యిన ఉయ్యాలో
సర్దార్ పటేలు ఉయ్యాలో
పోలీసు యాక్షను ఉయ్యాలో
చేపట్టినాడమ్మ ఉయ్యాలో

నైజాము దిగివచ్చి ఉయ్యాలో
లొంగిపోయినాడు ఉయ్యాలో
ఖాసీము రజ్వీని ఉయ్యాలో
జైలులో వేసింద్రు ఉయ్యాలో

పందొమ్మిదొందల ఉయ్యాలో
నలుబై ఎనమిది ఉయ్యాలో
సెప్టెంబరు నెల ఉయ్యాలో
పదిహేడు తేదీన ఉయ్యాలో

తెలంగాణకు నాడు ఉయ్యాలో
విమోచనమ్మాయె ఉయ్యాలో
తెలంగాణ ప్రజలు ఉయ్యాలో
సంతోషమందిరి ఉయ్యాలో

భారతమాతకు ఉయ్యాలో
తెలంగాణ తల్లికి ఉయ్యాలో
స్వాతంత్ర్యమూ వచ్చి ఉయ్యాలో
డెబ్బయైదేండ్లాయె ఉయ్యాలో

వజ్రోత్సవాలను ఉయ్యాలో
జరుపుతున్నారమ్మ ఉయ్యాలో
భారతీయులమంత ఉయ్యాలో
పాల్గొందము రండి ఉయ్యాలో

అందరం ఒకటయ్యి ఉయ్యాలో
భారతమాతను ఉయ్యాలో
తెలంగాణ తల్లిని ఉయ్యాలో
కాపాడుకొందాము ఉయ్యాలో

అక్కలారా రండి ఉయ్యాలో
చెల్లెలారా రండి ఉయ్యాలో
చేయి చేయి కలిపి ఉయ్యాలో
కలిసి బతుకుదాము ఉయ్యాలో

(మన దేశం, మన రాష్ట్రం వజ్రోత్సవాలు మరియు బతుకమ్మ సంబరాల సందర్భంగా)

-బండిరాజుల శంకర్
9948050608

బతకమ్మ

ఉయ్యాలొ ఉయ్యాలొ ఊయ్యాలో
ఉయ్యాలొ ఉయ్యాలొ ఊయ్యాలో
ఉయ్యాలొ ఉయ్యాలొ ఊయ్యాలో
ఉయ్యాలొ ఉయ్యాలొ ఊయ్యాలో

బతకమ్మ బతకమ్మ ఉయ్యాల్లో
వెయ్యేళ్ళ పండగ ఉయ్యాల్లో
బతకమ్మ బతకమ్మ ఉయ్యాల్లో
నూరేళ్ల బ్రతకాలి ఉయ్యాల్లో. ॥ఉయ్యాల్లో॥

నవరాత్రుల పండగ ఉయ్యాలో
పసుపు పూల పండగ ఉయ్యాలో
నేల పూజ చెయ్యాలి ఉయ్యాలో
పూల పూజ చెయ్యాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥

బంతి పూలూ తేవాలి ఉయ్యాలో
తంగెడు పూలు తేవాలి ఉయ్యాలో
చామంతి పూలు తేవాలి ఉయ్యాలో
గునుగు పూలు తేవాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥

ఆ పువ్వు ఈ పువ్వు ఉయ్యాలో
అందంగ పేర్వాలి ఉయ్యాలో
నీ నవ్వు నా నవ్వు ఉయ్యాలో
చిన్నగా పూయాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥

ఆడాలి ఉయ్యాలో
ఊరు వాడ పాడలి ఉయ్యాలో
ఆడపిల్ల బ్రతకాలి ఉయ్యాలో
అడవితల్లి నవ్వాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥

ఆ పక్కా యీ పక్కా ఉయ్యాలో
చప్పట్లు కొట్టాలి ఉయ్యాలో
అందరూ ఆడాలి ఉయ్యాలో
ఆనందం పండాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥

కొంగు చక్కగా చెక్కుకో ఉయ్యాలో
కోలాటమాడాలి ఉయ్యాలో
పూల చుట్టు తిరగాలి ఉయ్యాలో
గౌరి పూజ చెయ్యాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥

నవ దుర్గ దేవతలకు ఉయ్యాలో
మన అందరి దండాలు ఉయ్యాలో
నా ఇల్లు నీ ఇల్లు ఉయ్యాలో
నవ్వుతూ వుండాలి ఉయ్యాలో ॥ఉయ్యాల్లో॥



- ఆర్.కరుణాకర్ రావ్
సెల్.నెం. 9989693349